





www.navabhoomi.in | epaper.navabhoomi.in
RNI No:TELTEL:82083

# నవభూమి

ANUKSHANAM
NAVABHOOMI TELUGU DAILY
నవతరం తెలుగు దినపత్రిక
Published from Hyderabad and Vijayawada
ఎడిటర్ : అజీద్
హైదరాబాద్ | 02 ఆదివారం | ఫిబ్రవరి 2025 | పేజీలు 8-12 | వెల: రూ.6 | సంపుటి:2 సంచిక: 138
Navabhoomi daily fallows..
Circulated at: Hyderabad, Rangareddy, Adilabad, Karimnagar,Warangal,Khammam, Nalgonda, Mahabubnagar,Medak, Nizamabad, Krishna,Guntur,Easrt Godavari, West Godavari,Prakasam, Nellore,Srikakulam,Vizianagaram,Visakhapatanam,Kurnool,Chittoor,Kadapa,and Anantapur







# మధ్యతరగతి మందహాసం



- దేశ చరిత్రలో తొలిసారిగా రూ.50 లక్షల కోట్లు దాటిన బడ్జెట్...
- రికార్డు స్థాయిలో 8వ సారి బడ్జెట్ ప్రవేశపెట్టిన నిర్మలా సీతారామన్
- కేంద్ర వార్షిక బడ్జెట్ రూ.50,65,345 కోట్లు..
- వ్యవసాయరంగానికి అధిక ప్రాధాన్యత,రైతుల ఆదాయం పెరుగుదల
- వేతన జీవులకు భారీ ఊరట..రూ.12 లక్షల వరకు ఐటీ మినహాయింపు
- మిత్రపక్షమైన బీహార్‌కు వరాల జల్లు
- తెలుగురాష్ట్రాలకు చిన్నచూపే..తెలంగాణకు మొండిచెయ్యి

2

**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో**

ప్రపంచవ్యాప్తంగా ఆర్థికావృద్ధి మందగించినా భారత్ మెరుగైన పనితీరు సాధించిందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి చెందిన బడ్జెట్‌ను నిర్మలమ్మ శనివారం పార్లమెంట్ ముందు ఉంచారు. ఉదయం 11 గంటలకు సమావేశాలు ప్రారంభం కాగానే లోక్‌సభలో బడ్జెట్‌పై ప్రసంగం ప్రారంభించారు. పేదలు, యువత, రైతులు, మహిళలకు ప్రత్యేక ప్రాధాన్యంతో ఈ బడ్జెట్‌ను రూపకల్పన చేసినట్లు చెప్పారు. గత పదేళ్లలో సాధించిన అభివృద్ధే తమ స్ఫూర్తి, మార్గదర్శి అని తెలిపారు.

ఇక ఈ బడ్జెట్‌లో వేతన జీవులకు భారీ ఊరట కల్పించారు. రూ.12 లక్షల వరకు ఆదాయపు పన్ను నుంచి మినహాయింపు కల్పించారు. రూ.12 లక్షలకు మించిన ఆదాయం ఉన్నవారికి శ్లాబులవారీగా పన్నులను నిర్ణయించారు. రూ.20లక్షల నుంచి రూ.24 లక్షల వరకు 25 శాతం పన్నుగా నిర్ణయించారు. రూ.16 లక్షల నుంచి 20లక్షల్లోపు ఆదాయంపై 20 శాతం పన్నుగా నిర్ణయించారు. ఇక కేంద్రంలో ప్రధాన మిత్రపక్ష రాష్ట్రమైన బీహార్‌కు వరాల జల్లు కురిపించారు.

**బడ్జెట్ ప్రసంగంలోని ముఖ్యాంశాలు..**

వేతన జీవులకు భారీ ఊరట.. 12 లక్షల వరకు ఆదాయపు పన్ను మినహాయింపు. రూ.12 లక్షలకు మించిన ఆదాయం ఉన్నవారికి శ్లాబులవారీగా పన్నులను నిర్ణయించారు. రూ.20లక్షల నుంచి రూ.24 లక్షల వరకు 25 శాతం పన్నుగా నిర్ణయించారు. రూ.16 లక్షల నుంచి 20లక్షల్లోపు ఆదాయంపై 20 శాతం పన్నుగా నిర్ణయించారు.

బీహార్‌కు బడ్జెట్ గిఫ్ట్.. రాష్ట్రంలో ప్రత్యేక మఖానా బోర్డు ఏర్పాటు

బీహార్‌లోని మిథి[illegible] 50,000 హెక్టార్లకు ప్రయో[illegible]స్టర్న్ కోసి కెనాల్‌కు ఆర్థిక సాయం

ఐఐటీ పట్నా సామర్థ్యాన్ని మరింత పెంచుతాం

బీహార్‌లో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫుడ్

# రిక్త హస్తాలు!

- బడ్జెట్‌లో తెలుగు రాష్ట్రాలకు మొండిచెయ్యి
- ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రానికి రిక్తహస్తాలు
- మిత్రపక్షంగా ఉన్నందుకు ఏపీకి ఒనగూరేదేమీ లేదున్న విమర్శలు
- బీహార్‌కు వరాల జల్లు..ఏపీకి వరాలు నిల్లు
- కేంద్రం తీరుపై నిరసన వ్యక్తం చేస్తున్న తెలంగాణనేతలు

2



**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో**

సాధారణ కేటాయింపులతో మమ ఎన్డీఏ భాగస్వామిగా ఉన్నందున బడ్జెట్ ను ప్రశంసిస్తున్నారని, కానీ ఈ బడ్జెట్ వల్ల ఏపీకి ప్రత్యేకంగా ఒనగూరేదేమీ లేదన్న విమర్శే ఎక్కువగా వినిపిస్తోంది.

కేంద్ర బడ్జెట్‌లో తెలుగు రాష్ట్రాలకు పెద్దగా ఒరిగిందేమీ లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. తెలుగువారి కోడలైన ఆర్థిక మంత్రి సీతారామన్.. తన బడ్జెట్ ప్రసంగంలో తెలుగు కవితా పితామహుడు గురజాడను గుర్తు చేస్తూ 'దేశమంటే మట్టికాదోయ్.. దేశమంటే మనషులోయ్' అని ప్రస్తుతించినా రెండు తెలుగు రాష్ట్రాలకు ప్రత్యేకంగా ఒరిగిందేమీ లేదన్న ఆవేదనే ఎక్కువగా వ్యక్తమవుతోంది. ముఖ్యంగా ఈ బడ్జెటులో ఏపీకి ప్రత్యేక ఆర్థిక సాయం ప్రకటిస్తారని అంతా ఆశించారు. ప్రధాని మోదీ 3.0 ప్రభుత్వం కొనసాగే విషయంలో కీలక పాత్ర పోషిస్తున్న టీడీపీకి బడ్జెట్‌పై పైకి చెప్పలేక.. లోపల మింగలేక అన్న పరిస్థితిని ఎదుర్కొంటోందని అంటున్నారు. ఎన్డీఏ భాగస్వామిగా ఉన్నందున బడ్జెట్ ను ప్రశంసిస్తున్నారని, కానీ ఈ బడ్జెట్ వల్ల ఏపీకి ప్రత్యేకంగా ఒనగూరేదేమీ లేదన్న విమర్శే ఎక్కువగా వినిపిస్తోంది. అదేవిధంగా తెలంగాణ కు కూడా ప్రభుత్వం మొండి చేయే చూపింది. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఒక చోట బీజేపీ భాగస్వామిగా ఉన్న ప్రభుత్వం ఉన్నా ఎప్పటిలానే వివక్షే ఎదురైందని అంటున్నారు. ఇక తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉండటంతో ఆ రాష్ట్రానికి ప్రత్యేక కేటాయింపులేవీ ఇవ్వలేదన్న విమర్శ వినిపిస్తోంది. ముఖ్యంగా ఏపీలో విజయవాడ, విశాఖ మెట్రో ఏర్పాటుకు కేంద్రం ప్యాకేజీ ప్రకటిస్తుందని అంతా ఆశించారు. అదేవిధంగా తెలంగాణలో మెట్రో విస్తరణ, రీజనల్ రింగ్ రైల్ ప్రాజెక్టు వంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులకు ఆర్థిక సాయం ప్రకటిస్తారని ఎదురుచూశారు. కానీ, బడ్జెట్‌లో వీటి ప్రస్తావనే వినిపించలేదు. తన బడ్జెట్ ప్రసంగంలో పదేపదే బిహార్ రాష్ట్రం పేరు ప్రస్తావించిన కేంద్ర ఆర్థిక మంత్రి రెండు తెలుగు రాష్ట్రాల పేరును ఒక్కసారి కూడా ప్రస్తావించకపోవడం గమనార్హం. బిహార్ ఎన్నికలను పరిగణలోకి తీసుకుని ఆ రాష్ట్రానికి ఎక్కువ ప్రాజెక్టులు కట్టబెట్టారు. తమది

# ఏబీవికి కీలక పదవి

- ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా ఏ.బీ. వెంకటేశ్వరరావు
- హోం శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కుమార్ విశ్వజిత్ ఉత్తర్వులు
- రెండేళ్ల పాటు పదవిలో కొనసాగనున్న ఏబీవీ
- సస్పెండ్ కాలంలో రావాల్సిన బకాయిలు సైతం చెల్లింపు



**అమరావతి-నవభూమిబ్యూరో:** ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఏ.బీ. వెంకటేశ్వరరావును ప్రభుత్వం నియమించింది. రెండేళ్ల పాటు ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. అందుకు సంబంధించిన ఉత్తర్వులను హోం శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కుమార్ విశ్వజిత్ శనివారం జారీ చేశారు. గత వైసీపీ ప్రభుత్వం.. ఏబీ వెంకటేశ్వరరావుపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడింది. అందులోభాగంగా ఆయనను రెండుసార్లు సస్పెండ్ చేసింది.

ఒకసారి ఆయన న్యాయస్థానంకు వెళ్లి.. ఊరట పొందారు. మరో సారి సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్‌కు వెళ్లి ఊరట పొందాల్సిన పరిస్థితి ఏర్పడింది. చివరకు రిటైర్మెంట్ సమయంలో ఆయనకు పోస్టింగ్ సైతం ఇవ్వలేదు. దీంతో ఆయన న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఆ క్రమంలో రిటైర్మెంట్ అయ్యే ఒక్క రోజు ముందు ఆయన పోస్టింగ్ పొందారు. ఆ మరునాడు ఆయన రిటైర్ అయ్యారు.

అనంతరం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువు తీరింది. అయితే సస్పెన్షన్ సమయంలో రావాల్సిన బకాయిలను సైతం ఏబీ వెంకటేశ్వరరావుకు విడుదల చేయాలంటూ ప్రభుత్వం ఇటీవల ఆదేశాలు సైతం జారీ చేసింది. తాజాగా ఆయన్ని ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా ప్రభుత్వం నియమించింది.

# దేశ అభివృద్ధి జర్నీలో మైలురాయి

## కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను ప్రశంసించిన ప్రధాని



**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో:** ఎన్డీయే సర్కార్ కేంద్రంలో వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రవేశపెట్టిన పూర్తిస్థాయి కేంద్ర బడ్జెట్‌పై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పందించారు. దేశ అభివృద్ధి జర్నీలో ఇదొక మైలురాయి అని, 140 కోట్ల ప్రజల ఆశలు నెరవేర్చే బడ్జెట్ అని నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై ప్రశంసలు కురిపించారు. అన్నిరంగాల్లో యువతకు అవకాశాలు కల్పిస్తున్నామని, పొదుపు, పెట్టుబడులు పెరుగుతాయని, వికసిత్ భారత్ వైపు బడ్జెట్ అడుగులు వేయిస్తుందని చెప్పారు.

# బుల్లెట్ గాయానికి బ్యాండ్ ఎయిడ్

## బడ్జెట్‌పై రాహుల్ గాంధీ విసుర్లు

**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో:** కేంద్ర బడ్జెట్‌పై లోక్‌సభలో కాంగ్రెస్ ప్రతిపక్ష నేత, పార్లమెంటు సభ్యుడు రాహుల్ గాంధీ స్పందించారు. బుల్లెట్ గాయాలకు బ్యాండ్ ఎయిడ్ చికిత్సలా బడ్జెట్ ఉందని వ్యాఖ్యానించారు. అంతర్జాతీయంగా అనిశ్చితి పరిస్థితులు నెలకొన్ని నేపథ్యంలో దేశ ఆర్థిక సంక్షోభంపై బడ్జెట్‌లో ఎలాంటి చర్యలు లేవని విమర్శించారు. ఇది కేంద్ర ప్రభుత్వ ఆలోచనా లేమిని చాటుతోందన్నారు.కాగా, దేశ ఆర్థిక వ్యవస్థ నాలుగు సంక్షోభాలతో కునారిల్లుతోందని, ఈ జబ్బులను పరిష్కరించడానికి బడ్జెట్‌లో చేసిందేమీ లేదని కాంగ్రెస్ పార్టీ విమర్శించింది. స్థిరమైన వాస్తవ వేతనాలు, వినియోగదారుల ఇబ్బందులు, ప్రైవేటు పెట్టుబడుల మందగమన రేట్లు, సంక్లిష్టమైన జీఎస్టీ వ్యవస్థ వంటి జబ్బులను పరిష్కరించేందుకు ఎలాంటి చర్యలు బడ్జెట్‌లో లేవని కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి జైరామ్ రమేష్ విమర్శించారు.

# కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి కేటాయింపులు ఇవే..!

- పోలవరం ప్రాజెక్టుకు రూ. 5,936 కోట్లు
- వైజాగ్ స్టీల్ ప్లాంట్‌కు రూ. 3,295 కోట్లు
- విశాఖ పోర్ట్‌కు రూ. 730 కోట్లు



**అమరావతి-నవభూమిబ్యూరో:** 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను కేంద్ర బడ్జెట్ ను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్ లో ప్రవేశపెట్టారు. ఈ బడ్జెట్ లో ఏపీకి పలు కేటాయింపులు చేశారు. ముఖ్యంగా పోలవరం ప్రాజెక్టు, విశాఖ స్టీల్ కి ప్రాధాన్యతనిచ్చారు.


**ఏపీకి కేటాయింపులు ఇవే:**

పోలవరం ప్రాజెక్టుకు - రూ. 5,936 కోట్లు
పోలవరం ప్రాజెక్ట్ కు బ్యాలెన్స్ గ్రాంట్ - రూ. 12,157 కోట్లు
విశాఖ స్టీల్ ప్లాంట్ కు - రూ. 3,295 కోట్లు
విశాఖ పోర్ట్ కు - రూ.730 కోట్లు
రాష్ట్రంలో రోడ్లు, వంతెనల నిర్మాణానికి రూ. 240 కోట్లు
జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్ కు - రూ. 186 కోట్లు
లెర్నింగ్ ట్రాన్స్ ఫర్మేషన్ ఆపరేషన్ కు - రూ. 375 కోట్లు
ఆరోగ్య వ్యవస్థల బలోపేతానికి - రూ. 162 కోట్లు
ఏపీ ఇరిగేషన్, లైవ్లీహుడ్ ఇంప్రూవ్ మెంట్ ప్రాజెక్ట్ రెండో దశకు - రూ.242.50 కోట్లు.

# మళ్లీ ఎన్‌కౌంటర్

- 8 మంది మావోయిస్టులు హతం
- బీజాపూర్ జిల్లాలోని గంగలూరు వద్ద ఘటన
- గంగలూరు అటవీ ప్రాంతంలో మావోల సమావేశం
- కూంబింగ్ చేపట్టిన భద్రతా దళాలు
- భద్రతాదళాలను చూసి మావోలు కాల్పులు
- మావోలు..పోలీసుల మధ్య హెూరాహెూరీ కాల్పులు

2



**రాయ్‌పూర్-నవభూమిబ్యూరో:** ఛత్తీస్‌గఢ్‌లో మళ్లీ ఎన్‌కౌంటర్ చోటు చేసుకొంది. బీజాపూర్ జిల్లాలోని గంగలూరు పోలీస్ స్టేషన్ పరిధిలో మావోయిస్టులు, భద్రతా దళాలకు మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో 8 మంది మావోయిస్టులు హతమయ్యారు. అయితే మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశముందని భద్రతా దళాలు వెల్లడించాయి. మరోవైపు మావోయిస్టుల కోసం భద్రతా దళాలు చేపట్టిన కూబింగ్ ఆపరేషన్ ఇంకా కొనసాగుతోంది.

గంగలూరు పోలీస్ స్టేషన్ పరిధిలో మావోయిస్టులు సమావేశమయ్యారంటూ భద్రతా దళాలకు శనివారం ఉదయం సమాచారం అందింది. దీంతో ఆ ప్రాంతానికి చేరుకొన్న భద్రత దళాలు కూంబింగ్ చేపట్టాయి. ఆ క్రమంలో వారికి మావోయిస్టులు ఎదురు పడ్డారు. దీంతో వారు.. భద్రతా దళాలపై కాల్పులకు తెగబడ్డారు. ఆ వెంటనే భద్రతా దళాలు స్పందించి.. ఎదురు కాల్పులకు దిగాయి. దీంతో ఇరువైపులా హెూరా హెూరీ కాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో 8 మంది మావోయిస్టులు మృతి చెందారు. ఈ సంఖ్య మరింత పెరిగవచ్చని భద్రతా దళాలు స్పష్టం చేస్తున్నాయి.

ఛత్తీస్‌గఢ్‌లో ఇప్పటికే పలు ఎన్‌కౌంటర్లు చోటు చేసుకున్నాయి. ఆ యా ఎన్‌కౌంటర్లలో భారీగా మావోయిస్టులు మరణించిన విషయం విధితమే. 2026, మార్చి మాసాంతానికి దేశంలో మావోయిస్టులను నిర్మూలిస్తామంటూ కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షా ఇప్పటికే స్పష్టమైన ప్రకటన చేశారు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ఇప్పటికే దాదాపుగా మావోయిస్టులు తుడుచు పెట్టుకు పోయారు. ఛత్తీస్‌గఢ్‌లోని దండకారణ్యంలో మాత్రం వారి జాడ ఇంకా

# వచ్చే వారమే కొత్త ఆదాయపన్ను బిల్లు!

**న్యూఢిల్లీ-నవభూమి:** కొత్త ఆదాయపన్ను బిల్లును వచ్చే వారమే పార్లమెంటులో ప్రవేశ పెట్టనున్నట్టు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. పార్లమెంటులో బడ్జెట్ ప్రవేశ పెట్టిన అనంతరం.. శనివారం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. ఈ కొత్త బిల్లు న్యాయ స్ఫూర్తికి ప్రతిబింబంగా ఉంటుందన్నారు. బడ్జెట్ ప్రసంగంలో కూడా.. భారతీయ దండ సంహిత స్థానంలో భారతీయ న్యాయ సంహితను తీసుకువచ్చామని పేర్కొన్న నేపథ్యంలో కొత్త ఆదాయ పన్ను చట్టంలో భారీ మార్పులు చేసినట్టు తెలిపారు. 'ముందు విశ్వసించు- తర్వాత పరిశీలించు' అనే విధానంతో ఈ బిల్లును ముందుకు తీసువెళ్తామని పేర్కొన్నారు.

# సింగరేణి సిఎండి ఎన్. బలరాం పదవీకాలం పొడిగింపు

**ఆరో ఏడాదికి డిప్యూటేషన్ పదవీకాలం కొనసాగిస్తూ డీఓపీటీ ఉత్తర్వులు**




**కొత్తగూడెం ఫిబ్రవరి 1 నవభూమి ప్రతినిధి:** సింగరేణి సంస్థలో డైరెక్టర్ (ఫైనాన్స్)గా ఉంటూ సింగరేణి సీఎండీగా కొనసాగుతున్న పాలమూరు గిరిజన బిడ్డ ఐఆర్ఎస్ అధికారి ఎన్.బలరాం కు ఆరో ఏడాది కి డిప్యూటేషన్ పదవికాలం పొడిగిస్తూ డిఓపిటి శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. కష్టపడి పైచదువులు చదివిన ఎన్.బలరాం తాను పడ్డ కష్టాలు మరొకరు పడొద్దని, తెలంగాణ పిల్లలు సివిల్స్ మెయిన్స్ లో రాణించాలని సర్కారును ఒప్పించి సింగరేణి సంస్థ ద్వారా చేతనైన సాయం చేయడం గమనార్హం. తెలంగాణ బిడ్డలు సివిల్స్ లో రాణించి ఎక్కువ మంది అల్ ఇండియా సర్వీసుకు ఎంపిక అయితే తెలంగాణకే గర్వకారణం.

# నవభూమి

www.navabhoomi.in
www.epaper.navabhoomi.in

2
హైదరాబాద్
ఆదివారం
02 । ఫిబ్రవరి । 2025


## గద్దర్‌కు మరణం లేదు.. ప్రజల హృదయాల్లోనే ఉన్నారు



**హైదరాబాద్-నవభూమి:** ప్రజల హృదయాలలో ఉన్న గద్దర్ పాట, మాట అవసరమైనప్పుడు తుపాకీ తూటా అయి పేలుతుందని తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ వెన్నెల గద్దర్‌అన్నారు. గద్దర్ జీవితం అంతా ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేశాడని అన్నారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో గద్దర్ అభిమానుల సంఘం ప్రతినిధులు సీఎల్ యాదగిరి, నిమ్మ ఆంజనేయులు ఆధ్వర్యంలో ప్రజాయుద్ధ నౌక గద్దర్ సాగుతున్న ప్రజా పాటల సభ నిర్వహించారు. ఈ సందర్భంగా గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించడమే కాక 78వ జయంతి సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వెన్నెల గద్దర్ మాట్లాడుతూ, గద్దర్ యుగ పురుషుడని, ఆయన జీవితాన్ని రాస్తే అది ఒక మహాగ్రంథం అవుతుందని అన్నారు. గద్దర్‌కు మరణం లేదని, ఆయన ప్రజల హృదయాలలో ఉన్నాడని అన్నారు.

అణచివేత, దోపిడీపై గద్దర్ పాడిన పాటలు తిరుగుబాటు గేయంగా చిరకాలం ఉంటాయన్నారు. గద్దర్ జీవిత కాలం అంతా ఆడపిల్లలకు అండగా నిలిచారన్నారు. కార్యక్రమంలో బీసీ కమిషన్ సభ్యురాలు బాలలక్ష్మి, నిర్మల జగ్గారెడ్డి, కాంగ్రెస్ పార్టీ కల్చరల్ సెల్ అధ్యక్షుడు చక్రాల రవి, దళిత సేన రాష్ట్ర అధ్యక్షుడు గంట మల్లేష్, గాయకులు డాక్టర్ మాష్టార్జీ, నేర్నాల కిషోర్, లెల్లె సురేష్, వరంగల్ రవి, నల్లమల్ల యాదగిరి, బుద్దిస్ట్ హరినాథ్, వివిధ సంఘాల నేతలు రాజలింగం, జి.శంకర్, ఐలయ్య, నర్సింగ్‌రావు పాల్గొన్నారు.




## 15 ఏళ్ల క్రితం కోకాపేట ఇలా ఉండేదా..? అంతలోనే ఎంత మార్పు, వైరల్‌గా పాత ఫోటో..!



**హైదరాబాద్-నవభూమి:** హైదరాబాద్ నగరం విశ్వనగరంగా అభివృద్ధి చెందుతోంది. గచ్చిబౌలి, నానక్‌రాంగూడ, కోకాపేట, నియోపోలిస్, మాదాపూర్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ వంటి ప్రాంతాలకు వెళితే మనం హైదరాబాద్ నగరంలోనే ఉన్నామా..? అన్ని ఫీల్ కలుగుతుంది. ఆకాశాన్ని తాకే పెద్ద పెద్ద బిల్డింగులు, హైటెక్ హంగులతో కూడిన అద్దాల మేడలు, ఐటీ సంస్థలు వావ్.. అనేలా చేస్తాయి. విశాలమైన రోడ్లు, కళ్లు చెదిరే భవంతులు అక్కడికి వెళ్లిన వారికి కొత్త అనుభూతిని కలగజేస్తాయి. ఒకప్పుడు నగర శివారు ప్రాంతాలుగా ఉన్న కోకాపేట, నానక్‌రాంగూడ వంటి ప్రాంతాలు ఊహించనంతగా అభివృద్ధి చెందాయి. ఎంతలా అంటే గత 15 ఏళ్ల క్రితం ప్రాంతాలకు ఇప్పటి ప్రాంతాలను అస్సలు గుర్తించలేనంతగా.అందుకు సంబంధించిన ఓ ఫోటో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కోకాపేట ప్రాంతానికి చెందిన ఓ పాత ఫోటోను, ఇప్పటి గూగుల్ మ్యాప్ ఫోటోను ఓ నెటిజన్ ట్విట్టర్‌లో షేర్ చేశాడు. 2010లో కోకాపేట ప్రాంతం మొత్తం నిర్మానుష్యంగా ఉంది. అక్కడ ఓ చిన్న గ్రామం, పక్కనే నిర్మాణంలో ఉన్న రోడ్డు, అక్కడక్కడ పంట పొలాలను అందులో చూడవచ్చు. కానీ 2025.. అంటే ప్రస్తుతం గూగుల్ మ్యాప్ ఫోటో చూస్తే మాత్రం దిమ్మతిరిగి పోవాల్సిందే. అంతలోనే ఎంత మార్పు అనేలా.. అక్కడ పెద్ద పెద్ద బిల్డింగులు, ఆఫీసులు, రోడ్లు ఏర్పాటయ్యాయి. లండన్, న్యూయార్క్ ప్రాంతాల్లో ఉన్నట్లుగా భవంతులు, అపార్ట్‌మెంట్లు చూడవచ్చు.ఆ ఫోటోను చూసిన పలువురు నెటిజన్లు భిన్నంగా స్పందిస్తున్నారు. తులసి మూవీలో కోకాపేట ఆంటీ చెప్పినప్పుడే అక్కడ స్థలం కొంటే బాగుండేదని ఓ నెటిజన్ కామెంట్ పెట్టాడు. ఇప్పుడు అక్కడ సామాన్యుడు స్థలం కొనే పరిస్థితి లేదని రాసుకొచ్చాడు. మరో నెటిజన్ అది అభివృద్ధి కాదని.. ప్రకృతిని సర్వనాశనం చేశారని కామెంట్ పెట్టాడు. పచ్చని గ్రామాన్ని సర్వనాశనం చేశారని.. అంతకంతకు అనుభవిస్తారని మరో నెటిజన్ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు.

## రేవంత్ సర్కార్ గుడ్‌న్యూస్.. వారికి టెన్త్ విద్యార్హతతో ప్రమోషన్లు



**హైదరాబాద్-నవభూమి:** అంగన్‌వాడీ రేవంత్ రెడ్డి ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. ఆయాలు టీచర్లుగా ప్రమోట్ అయ్యేందుకు ఛాన్స్ ఇచ్చింది. ఇప్పటి వరకు ఇంటర్ విద్య తప్పనిసరి అన్న నిబంధనను రేవంత్ ప్రభుత్వం సడలించింది. 2022 ఆగస్టు 1కి ముందు ఆయాలుగా నియమితులైన వారు పదో అర్హతతో టీచర్లుగా ప్రమోట్ అయ్యేందుకు ఛాన్స్ కల్పించింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. పదేళ్ల సర్వీస్‌తో పాటు 45 ఏళ్ల లోపు వయసున్న ఆయాలకు ప్రమోషన్ వర్తించనుంది. ప్రభుత్వ నిర్ణయంపై ఆయాలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.ఇక తెలంగాణలో ఉన్నత విద్యాశాఖ పరిధిలోని 12 విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ల వయసు 60 ఏళ్లు దాటినా వారిని కొనసాగించాలని కళాశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన తాజాగా ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు వర్సిటీల రిజిస్ట్రార్లకు ప్రత్యేకంగా లెటర్ రాశారు. 2024 ఆగస్టు 8న అప్పటి విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ఆదేశాల మేరకు ఉన్నత విద్యామండలి కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లను కొనసాగించాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. వారి అవసరం, పనితీరు, అనుభవం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకొని 60 ఏళ్లు దాటినా ఉద్యోగంలో కొనసాగించాలని అప్పటి ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అయితే అనేక వర్సిటీలు ఆ ఉత్తర్వులను పట్టించుకోవడం లేదని ఔట్ సోర్సింగ్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు ప్రభుత్వానికి ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

దీంతో కాళాశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన గత ఉత్తర్వులను పేర్కొంటూ తాజాగా మరోసారి ఆదేశాలిచ్చారు. రెగ్యులర్ ప్రొఫెసర్ల పదవీ విరమణ వయసును 60 నుంచి 65 ఏళ్లకు పెంచుతూ జనవరి 28వ తేదీన ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆ వెంటనే తాజాగా ఔట్ సోర్సింగ్ అసిస్టెంట్ ప్రొఫెసర్లను కూడా కొనసాగించాలని తాజాగా ఉత్తర్వులు వెలువడ్డాయి. అయితే ఈ అంశంపై సందిగ్ధత నెలకొంది. విద్యాశాఖ కార్యదర్శి ఉత్తర్వులు ఇస్తేనే దాన్ని వర్సిటీలు పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉంటుందని తెలిసింది. కళాశాల విద్యాశాఖ కమిషనర్‌తో ఎందుకు ఉత్తర్వులు ఇప్పించారో అర్థం కావట్లేదని వర్సిటీ రిజిస్ట్రార్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా కాంట్రాక్టు విధానంలో సుమారు 1200 మంది సహాయ ఆచార్యులు పనిచేస్తున్నట్లు తెలిసింది.

## ఎక్సైజ్ అకాడమీని తనిఖీ చేసిన మంత్రి జూపల్లి



**హైదరాబాద్-నవభూమి:** రాజేంద్ర నగర్‌లోని ఎక్సైజ్ అకాడమీని మంత్రి జూపల్లి కృష్ణారావుశుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అకాడమీలోని సదుపాయాలు, అక్కడి పరిస్థితులను శిక్షణ పొందుతున్న ట్రైనీ ఎక్సైజ్ కానిస్టేబుళ్లను అడిగి తెలుసుకున్నారు. ట్రైనీలకు అందిస్తున్న భోజనం నాణ్యతపై అధికారులతో చర్చించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మంత్రి కృష్ణారావు మాట్లాడుతూ.. అకాడమీలో ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. ట్రైనీలకు ఇస్తున్న శిక్షణ, అందజేస్తున్న భోజనం విషయంలో లోటుపాట్లు వస్తే సహించేది లేదన్నారు.

## పదో తరగతి విద్యార్థులకు గుడ్‌న్యూస్..



**హైదరాబాద్-నవభూమి:** రాష్ట్రంలో మరికొన్ని రోజుల్లోనే పదో తరగతి పరీక్షలు జరగనున్నాయి. దీంతో ఇప్పటికే టెన్స్ స్టూడెంట్స్.. పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. ఈ క్రమంలోనే తెలంగాణ వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ, మోడల్ స్కూళ్లలో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇక వారికి ఇప్పటికే మధ్యాహ్న భోజనం అందిస్తుండగా.. ఇక నుంచి స్పెషల్ క్లాసులకు హాజరయ్యే స్టూడెంట్స్‌కు సాయంత్రం వేళ అల్పాహారం అందించాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించిన విషయం తెలిసిందే. అయితే ఈ కార్యక్రమంలో శనివారం నుంచే అమలు చేస్తున్నారు.హైదరాబాద్ అబిడ్స్‌లోని ప్రభుత్వ అలియా మోడల్ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు.. ఆ పాఠశాల ఉపాధ్యాయులు.. శనివారం స్నాక్స్ అందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతిలో పాస్ శాతాన్ని పెంచేందుకు ప్రభుత్వం అన్నిరకాల చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలోనే ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. దసరా పండుగ తర్వాత నుంచే రాష్ట్రంలోని చాలా చోట్ల ఈ స్పెషల్ క్లాసులు ప్రారంభం అయ్యాయి.

మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా ఒంటి గంటకు భోజనం చేసిన విద్యార్థులు సాయంత్రం.. స్పెషల్ క్లాసులు పూర్తి అయి ఇళ్లకు వెళ్లేసరికి రాత్రి అవుతోంది. దీంతో రాత్రి వరకు ఏమీ తినకపోవడంతో విద్యార్థులు ఆకలితో ఇబ్బంది పడుతున్నారని ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చింది ఈ నేపథ్యంలోనే వారికి సాయంత్రం పూట స్నాక్స్ అందించాలని నిర్ణయించింది. ఇక ఈ ఏడాది టెన్త్ పరీక్షలు మార్చి 21వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ క్రమంలోనే ఫిబ్రవరి 1వ తేదీ నుంచి మార్చి 20వ తేదీ వరకు పాఠశాలలు నడిచే 38 రోజులపాటు వారికి సాయంత్రం స్నాక్స్ అందించాలని సర్కార్ నిర్ణయం తీసుకుంది.

అయితే ఈ స్నాక్స్ కోసం ఒక్కో విద్యార్థికి రోజుకు రూ.15 చొప్పున ప్రభుత్వం మంజూరు చేయనుంది. రాష్ట్రంలోని దాదాపు 4500 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు.. మరో 194 మోడల్ స్కూళ్లు ఉన్నాయి. వీటిల్లో సుమారు 1.90 లక్షల మంది పదో తరగతి చదువుతున్నారు. ఇక స్నాక్స్ కింద రోజుకో రకం వంటకాలను విద్యార్థులకు ఇవ్వనున్నారు. ఉడకబెట్టిన పెసర్లు, పల్లీలు-బెల్లం, చిరుధాన్యాలతో చేసిన మిల్లెట్ బిస్కెట్లు, ఉడకబెట్టిన బొబ్బర్లు, ఉల్లిపాయ పకోడి, ఉడకబెట్టిన శనగలు వంటి వాటిని రోజుకో ఒక రకం చొప్పున టెన్స్ విద్యార్థులకు అందించనున్నారు.

## విమాన ప్రయాణికులకు గుడ్‌న్యూస్..

### హైదరాబాద్ నుంచి థాయ్‌లాండ్‌కు డైరెక్ట్ ఫ్లైట్




**హైదరాబాద్-నవభూమి:** విమాన ప్రయాణికులకు గుడ్‌న్యూస్. ఇక థాయ్‌లాండ్ వెళ్లాలంటే కనెక్టింగ్ ఫ్లైట్ ఎక్కాల్సిన పనిలేదు. హైదరాబాద్ నగరం నుంచి నేరుగా థాయ్‌లాండ్ చేరుకోవచ్చు. ఈ మేరకు హైదరాబాద్ శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి థాయ్‌లాండ్‌కు నేరుగా ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమాన సర్వీసులు ప్రారంభించారు. శంషాబాద్ నుంచి థాయ్‌లాండ్‌లోని ఫుకెట్ నగరానికి తొలి డైరెక్ట్ ఫ్లైట్ శుక్రవారం (జనవరి 31) బయలుదేరింది. ఈ విషయాన్ని జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు లిమిటెడ్ సీఈఓ ప్రదీప్ ఒక ప్రకటనలో వెల్లడించారు.ఈ కొత్త ఎయిర్ ఇండియా సర్వీసు ద్వారా థాయ్‌లాండ్ లోని ఫుకెట్ - హైదరాబాద్ నగరాల మధ్య ప్రయాణ సౌకర్యం మరింత మెరుగుపడుతుందని ప్రదీప్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ఫ్లైట్ 3.45 గంటల్లోనే గమ్యస్థానానికి చేరుకుంటుందని వెల్లడించారు. ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ ఫ్లైట్ సర్వీసులు ప్రస్తుతం వారంలో ప్రతి బుధ, శుక్ర, ఆదివారాల్లో నడుస్తాయని చెప్పారు. ఈనెల 15 నుంచి వారానికి ఆరు విమానాలకు పెంచుతామని ప్రదీప్ తెలిపారు. హైదరాబాద్ - ఫుకెట్ మధ్య నేరుగా విమాన సర్వీసులు ప్రారంభించిన మొదటి విమానయాన సంస్థగా నిలవడం సంతోషంగా ఉందని ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ మేనేజింగ్ డైరెక్టర్ అలోక్ సింగ్ వెల్లడించారు.సాధారణ రోజుల్లో విమాన టికెట్ రూ.7 వేలు ఉండగా... ప్రస్తుతం రూ.20వేల వరకు ఉంది. ప్రయాగ్‌రాజ్ కుంభమేళాకు హైదరాబాద్ నుంచి విమానసర్వీసులు అందుబాటులోకి వచ్చాయి. విమాన సర్వీసుల టికెట్ ధరలను పరిశీలిస్తే.. ఫిబ్రవరి 2 నుంచి ఫిబ్రవరి 16 వరకు కనిష్ఠంగా రూ.20,552 నుంచి రూ.33,556 వరకు టికెట్ ధరలు ఉన్నాయి. ఈ ధరలకు అదనంగా ట్యాక్సులు ఉంటాయని తెలిపారు. కొన్ని విమానయాన సంస్థలు ప్రయాణికులకు భోజనం, టిఫిన్ సౌకర్యాలు కూడా అందిస్తున్నాయి.హైదరాబాద్ నుంచి ప్రయాగ్ రాజ్ వరకూ నేరుగా వెళ్లే ఫ్లైట్స్.. దాదాపు 1.55 గంటల సమయం తీసుకుంటుండగా.. ఒక స్టాప్, రెండు, స్టాప్‌లున్న ఫ్లైట్ సర్వీసులు 5 గంటల నుంచి 14 గంటల సమయాన్ని తీసుకుంటున్నాయి. స్పైస్‌జెట్, ఇండిగో, ఎయిర్ ఇండియా విమాన సర్వీసులకు అధికంగా గిరాకీ ఉందని ప్రైవేటు విమాన సంస్థల ప్రతినిధులు వెల్లడించారు. కుంభమేళా జరిగినన్ని రోజులు వీటిని నడిపించనున్నారు.

## మధ్యతరగతి మందహాసం

**(1వపేజీ తరువాయి)**టెక్నాలజీ, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అండ్ మేనేజ్‌మెంట్ ఏర్పాటు.
వృద్ధులకు వడ్డీపై టీసీఎస్ ఊరట.. వడ్డీపై వచ్చే ఆదాయంపై రూ.50 వేల నుంచి రూ.లక్షకు పెంపు. అద్దె ద్వారా వచ్చే ఆదాయంపై 2.4 లక్షల నుంచి రూ.6 లక్షలకు పెంపు
వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత..
రైతుల ఆదాయాన్ని పెంచడానికి చర్యలు
వంద జిల్లాలను ఎంపిక చేసి వ్యవసాయంలో అధునాతన పద్ధతులను అమలుచేస్తాం
గ్రామీణ ప్రాంతాల్లో సంపద సృష్టికి ప్రత్యేక చర్యలు
పప్పు ధాన్యాల ఉత్పత్తికి స్వయం సమృద్ధి పథకం. రైతుల నుంచి నేరుగా పప్పు ధాన్యలు సేకరణ
కంది, మినుములు, మసూర్‌లను కొనుగోలు చేయనున్న కేంద్రం
పండ్లు, కూరగాయల ఉత్పత్తికి నూతన పథకం
కిసాన్ క్రెడిట్ కార్డుల పరిమితి రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంపు. దీని ద్వారా 7.7 కోట్ల మంది రైతులకు ప్రయోజనం.
ఎంఎస్ఎంఈలకు ఇచ్చే రుణాలు రూ.5 కోట్ల నుంచి రూ.10 కోట్లకు పెంపు
స్టార్టప్‌లకు రూ.10 కోట్ల నుంచి రూ.20 కోట్లకు పెంపు
బొమ్మల తయారీ రంగాన్ని ప్రోత్సహిస్తాం.. ఇందుకోసం ప్రత్యేక పథకాన్ని తీసుకొస్తాం.
విద్యారంగంలో సంస్కరణలు.. వచ్చే ఐదేళ్లలో దేశవ్యాప్తంగా 75 వేల కొత్త మెడికల్ సీట్లు
గిగ్ వర్కర్లకు ఆరోగ్య బీమా.. ఈ-శ్రమ్ పోర్టల్ కింద గుర్తింపు కార్డులు, పీఎం జన్ ఆరోగ్య యోజన కింద ఆరోగ్య బీమా
జల్ జీవన్ మిషన్‌కు మరిన్ని నిధులు.. ఈ పథకం కింద 15 కోట్ల మందికి రక్షిత మంచినీరు అందించాం
రూ.30 వేల పరిమితితో పట్టణ పేదల కోసం యూపీఐ లింక్డ్ క్రెడిట్ కార్డులు
రాష్ట్రాలకు రూ.1.5 లక్షల కోట్ల రుణాలు. 50 ఏళ్లకు వడ్డీ రహిత రుణాలు
వచ్చే వారం ఇన్‌కమ్ ట్యాక్స్ బిల్లు
దేశ వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో డే కేర్ క్యాన్సర్ సెంటర్లు
బీమా రంగంలో ప్రస్తుతం 74 శాతంగా ఉన్న ఎఫ్‌డీఐ 100 శాతానికి పెంపు
కృత్రిమ మేధ అభివృద్ధికి రూ.500 కోట్లతో మూడు ప్రత్యేక కేంద్రాలు
చిన్న స్థాయి అణు రియాక్టర్ల కోసం జాతీయ అణుశక్తి మిషన్. రూ.20 వేల కోట్లతో నేషనల్ న్యూక్లియర్ ఎనర్జీ మిషన్. 2030 నాటికి నాలుగు చిన్న, మధ్యస్థాయి రియాక్టర్ల ఏర్పాటు. 2047 నాటికి 100 గిగావాట్ల అణువిద్యుత్ ఉత్పత్తి లక్ష్యం.
36 ఔషధాలకు బేసిక్ కస్టమ్స్ డ్యూటీ తొలగింపు
త్వరలో జనవిశ్వాస్ 2.0 బిల్లు
పర్యాటక ప్రాంతాలకు మెరుగైన రవాణా సదుపాయాలు. రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి 22 పర్యాటక ప్రాంతాల అభివృద్ధి
దేశ వ్యాప్తంగా పెట్టుబడుల ఉపసంహరణ, ఆస్తుల విక్రయానికి రెండో ప్రణాళిక

## మళ్లీ ఎన్‌కౌంటర్

**(1వపేజీ తరువాయి)**ఉంది. దీంతో ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల ఏరివేతకు కేంద్రం వ్యూహాత్మకంగా ముందుకు వెళ్తోంది. అందులోభాగంగా మావోయిస్టులు లొంగి పోయి జన జీవన స్రవంతిలో కలవాలని పిలుపు నిచ్చిన సంగతి తెలిసిందే.ఇక కేంద్రం హోం శాఖ మంత్రి అమిత్ షా ఇటీవల ఛత్తీస్‌గఢ్‌లో రెండు రోజులు పర్యటించారు. ఈ సందర్భంగా మావోయిస్టుల బాధిత కుటుంబాలతో సమావేశమయ్యారు. మహారాష్ట్రలోని గడ్చిరోలి పోలీస్ స్టేషన్‌లో సీఎం దేవేంద్ర ఫడణవీస్ సమక్షంలో పలువురు మావోయిస్టులు లొంగిపోయారు. ఇటీవల ఛత్తీస్‌గఢ్- ఒడిశా సరిహద్దుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో సీనియర్ మావోయిస్టు చలపతి మరణించారు. ఆయనపై రూ. కోటి రివార్డు ఉన్న సంగతి తెలిసిందే. ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల ఏరివేతకు భద్రత దళాలు ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకొని ముందుకు వెళ్తున్నాయి. అందులోభాగంగా తరచూ ఎన్‌కౌంటర్లు చోటు చేసుకొంటున్నాయి.

## రిక్త హస్తాలు!

**(1వపేజీ తరువాయి)**వెనుకబడిన రాష్ట్రమని ప్రత్యేక హోదా ఇవ్వాలని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ కోరారు. అయితే ప్రత్యేక హోదా ఇవ్వడం సాధ్యంకాదని గతంలో ప్రకటించిన ప్రభుత్వం.. ఈ బడ్జెట్ లో సంపూర్ణ న్యాయం చేసేలా కేటాయింపులు జరిపిందని అంటున్నారు. చంద్రబాబు ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా తీసుకున్న ప్రాజెక్టుల్లో రాజధాని అమరావతి నిర్మాణం ఒకటి. గత బడ్జెట్ లో అమరావతి కోసం రూ.15 వేల కోట్లు అప్పు ఇప్పిస్తామని చెప్పిన కేంద్రం.. ఈ బడ్జెట్ లో ప్రత్యేకంగా ఎలాంటి నిధులు ఇవ్వలేదన్న ఆందోళన వ్యక్తమవుతోంది. అదేవిధంగా పోలవరం నిర్మాణానికి గతంలో కేటాయించిన నిధులనే ఈ బడ్జెట్ లోనూ కేటాయించారు తప్ప ప్రత్యేకంగా ఎలాంటి సాయం చేయలేదంటున్నారు. ఇక రెండు తెలుగు రాష్ట్రాలకు ప్రత్యేకించి ఎలాంటి ప్రయోజనం కల్పించలేదు. దేశవ్యాప్తంగా అమలయ్యే పథకాలే రెండు రాష్ట్రాలకు వర్తిస్తాయి. మొత్తానికి తెలుగువారి కోడలు ప్రవేశపెట్టిన బడ్జెట్ పై విపక్షాలు పెదవి విరుస్తున్నాయి.

## తెలంగాణకు ద్రోహం

### మంత్రులతో సీఎం రేవంత్ భేటీ.. బడ్జెట్‌పై తీవ్ర ఆగ్రహం

### బడ్జెట్లో వివక్షకు వ్యతిరేకంగా నేడు కాంగ్రెస్ ధర్నా

**హైదరాబాద్-నవభూమి:** కేంద్ర బడ్జెట్ తెలంగాణ హక్కులను, ఆకాంక్షలను కాలరాసిందని రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర స్థాయిలో ఆక్షేపించింది. రాష్ట్ర సమస్యలు, అభివృద్ధి అంశాలను పట్టించుకోలేదని విమర్శించింది. స్థూల దేశీయోత్పత్తి(జీడీపీ)కి 5% వాటాను అందిస్తున్న తెలంగాణను కేం ద్రం నిర్లక్ష్యం చేసిందని ఆరోపించింది. రాష్ట్రం నుంచి రూ.26 వేల కోట్ల పన్ను ఆదాయం కేంద్రానికి వెళ్లిందని, 8 మంది బీజేపీ ఎంపీలను తెలంగాణ గెలిపించి పంపించిందని గుర్తుచేసింది. అయినా.. తెలంగాణకు ప్రధాని మోదీ ద్రోహం చేశారని విమర్శించింది. ఈ బడ్జెట్‌లో కేంద్ర సెస్‌లను మరింత పెం చుకుందని, దానివల్ల రాష్ట్రాల పన్నుల వాటాలు తగ్గే ప్రమాదముందని ఆందోళన వ్యక్తంచేసింది. కేంద్ర సౌజన్య పథకాలపై రాష్ట్రాలు ఆధారపడేలా నిధులు పెంచిందని, సీఎసఎసలను రాష్ట్రాలు వర్తింపజేసుకోవాలా? లేదా? అన్న స్వయం నిర్ణయాధికారాన్ని విస్మరించిందని విమర్శించింది. శనివారం సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో జరిగిన సమావేశంలో కేంద్ర బడ్జెట్‌పై చర్చించారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దామోదర్ రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, డి.శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ, సీతక్క ఈ సమావేశంలో పాల్గొన్నారు. సమావేశంలో చర్చించిన అంశాలపై భట్టివిక్రమార్క ఓ పత్రికాప్రకటనను విడుదల చేశారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కూడా ఈ అంశంపై మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సమస్యలు, అభివృద్ధి ప్రాధమ్యాలను కేంద్రం అర్థం చేసుకోలేకపోయిందని రాష్ట్ర ప్రభుత్వం విమర్శించింది. కొన్ని రకాల వస్తువులపై కస్టమ్ డ్యూటీని తగ్గిస్తున్నట్లు చెబుతూనే.. కేంద్రం తన సెస్‌లను పెంచుకుందని ఆరోపించింది. ఇలాంటి చర్యల వల్ల రాష్ట్రాలకు న్యాయబద్ధంగా రావాల్సిన పన్నుల వాటా తగ్గిపోయే ప్రమాదముందని ఆందోళన వ్యక్తంచేసింది.

కేంద్ర సౌజన్య పథకాల(సీఎసఎస)ల కింద 2024-25లో కేటాయించిన రూ.4,15,356 కోట్ల కంటే ఈసారి బడ్జెట్‌లో 35.5% నిధులను పెంచి, రూ.5,41,850 కోట్లను కేటాయించడమంటే ఆర్థిక సమాఖ్య సూత్రాలను కేంద్రం తుంగలో తొక్కినట్లయిందని రాష్ట్ర ప్రభుత్వం అభిప్రాయపడింది. సీఎసఎసలను అమలు చేసుకోవడంపై రాష్ట్రాలకు స్వయంప్రతిపత్తి ఇవ్వాలంటూ పదేపదే విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదని, ఈ నిధులను పెంచి, కేంద్రంపై రాష్ట్రాలు ఆధారపడేటట్లు చేస్తోందని విమర్శించింది.

ఈసారి కేంద్ర బడ్జెట్‌లో బిహార్ రాష్ట్రానికి వివిధ పథకాల కింద అధిక నిధులను కేటాయించిందని, రెవెన్యూ మిగులుతో ఉండి.. కొన్నేళ్లుగా తక్కువ ద్రవ్యలోటును నమోదు చేసుకుంటున్న తెలంగాణను మాత్రం పట్టించుకోలేదని రాష్ట్ర సర్కారు దుయ్యబట్టింది. ఆర్థిక వనరులను అత్యంత సామర్థ్యంతో వినియోగించుకుంటున్న తెలంగాణను ఈ బడ్జెట్‌లో పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని ఆరోపించింది. వివక్ష పూరిత విధానం రాష్ట్ర ప్రగతిశీల ప్రయత్నాలు, విజయాలను కుంగదీస్తాయని ఆక్షేపించింది.

## నగరాభివృద్ధికి కరుణించని మోదీ సర్కారు

**హైదరాబాద్-నవభూమి:** హైదరాబాద్ అభివృద్ధికి కేంద్రం మరోసారి మొండి చెయ్యి చూపింది. గంపెడాశలతో సిటీ ప్రాజెక్టుల కోసం నిధులు కోరితే, ఖాళీ చేతులను చూపి సమాధానం చెప్పింది. కనీసం భారీ ప్రాజెక్టులను కూడా పరిగణనలోకి తీసుకోలేదు. కేంద్రం నిధులిస్తే గానీ ప్రతిష్టాత్మక ప్రాజెక్టులను చేపట్టలేని పరిస్థితిలో రాష్ట్ర సర్కారు ఉంది. ఈ క్రమంలో నగరాభివృద్ధి కోసం కనీసం రూ. 20వేల కోట్లు కావాలంటూ రేవంత్ సర్కార్ చేసిన ప్రతిపాదనలను మోదీ ప్రభుత్వం బుట్టదాఖలు చేసింది. దీంతో నగరానికి తలమానికమైన ప్రాజెక్టులుగా కాంగ్రెస్ చెప్పుకుంటున్న మూసీ ప్రక్షాళన, మెట్రో రెండో దశ విస్తరణ ఆశలు నీరుగారేలా ఉన్నాయి.

**కాగితాలపై ప్రణాళికలు..**

హైదరాబాద్ నగరాన్ని విశ్వనగరంగా అభివృద్ధి చేస్తామంటూ కాంగ్రెస్ కాగితాలపై ప్రణాళికలు రూపొందించి, నిధులు కోరుతుంటే%ా% ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా రేవంత్ సర్కారుకు షాకిచ్చింది. హైదరాబాద్ నగరానికి ఎంతో కీలకమైన రెండో దశ మెట్రో విషయంలో భారీ అశలు, అంచనాలతో బడ్జెట్ ప్రతిపాదనలు రూపొందించిన రాష్ట్ర సర్కారు ప్రతిపాదనలను కూడా పరిగణనలోకి తీసుకోలేదు. కేంద్ర అనుమతి కోసం ఫేస్-2 మెట్రో డీపీఆర్ వెళ్లిన%ా% ఇప్పటికీ టెక్నికల్ స్క్రూటీ దశను కూడా చేరుకోలేదు. కానీ నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్ర బడ్జెట్ ప్రతిపాదనలకు కేటాయింపులు ఉంటాయని భావించినా%ా% ఒక్క రూపాయి కూడా వచ్చే పరిస్థితి లేదని తేలింది. రాష్ట్రం నుంచి హైదరాబాద్ అభివృద్ధికి నిధులు కోరుతూ మూసీ ప్రక్షాళనకు రూ. 16వేల కోట్లు, మెట్రో ఫేస్-2 కోసం దాదాపు మరో రూ. 4230 కోట్లతో బడ్జెట్ ప్రతిపాదనలు చేసింది. వీటిలో ఏ ఒక్క ప్రతిపాదన కూడా కేంద్రం పరిగణనలోకి తీసుకోలేదు. దీంతో రూ. 20వేల కోట్ల నిధులను ప్రత్యేకంగా కేటాయించాలంటూ చేసిన ప్రతిపాదనలకు విలువే లేకుండా పోయింది.రాష్ట్రాల వారీగా కేంద్రం ఇచ్చే బడ్జెట్ కేటాయింపులను పక్కన పెడితే%ా% ఆయా రాష్ట్రాలు చేపట్టనున్న ప్రతిష్టాత్మక ప్రాజెక్టులకు కేంద్ర సహకారం కోరుతూ ప్రణాళికలను ప్రభుత్వాలు కేంద్రానికి పంపుతాయి. ఈసారి కూడా అదే తీరుగా బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రాజెక్టులకు కేటాయింపులు చేయాలంటూ చేసిన ప్రతిపాదనలు కేంద్రానికి వెళ్లాయి. కానీ అందులో ఏ ఒక్క ప్రతిపాదన కూడా లెక్కలోకి రాలేదు. కనీసం హైదరాబాద్ అభివృద్ధిలో కీలకమైన మెట్రో ఫేస్-2 ప్రాజెక్టు అనుమతులతోపాటు, నిధులు కేటాయింపులు జరిగే అవకాశం ఉందని భావించారు. కానీ ఇప్పటివరకు ప్రత్యేకంగా నిధులను కేటాయిస్తామని హామీ ఇవ్వలేదు. ఇక లక్షన్నర కోట్లతో జీవనది మూసీ నదీని సుందరీకరణ చేస్తామంటూ రాష్ట్ర సర్కారు ఉత్సాహం చూపుతుంటే%ా% అసలు ప్రస్తావనే లేనట్లు బడ్జెట్‌పై ప్రకటనలు చేసింది. గ్రేటర్ నుంచి ముగ్గురు బీజేపీ ఎంపీలు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. నగరాభివృద్ధికి కీలకమైన మెట్రో విస్తరణ కోసం కేంద్రం నుంచి ప్రోత్సాహం ఉంటుందనీ భావించారు. కానీ డీపీఆర్ పరిశీలన దశలో ఉండటంతో, బడ్జెట్ కేటాయింపులకు అవకాశం లేకుండా పోయిందనీ నిపుణులు చెబుతున్నారు.గడిచిన 12 ఏండ్ల కాలంగా హైదరాబాద్ అభివృద్ధికి కీలకమైన మెట్రో విస్తరణకు నిధులు కేటాయించాలని ప్రతిపాదనలు అందుతూనే ఉన్నాయి. కానీ ఇప్పటి వరకు రాష్ట్రం నుంచి వెళ్లిన ఏ ఒక్క ప్రతిపాదనలను కేంద్రం పట్టించుకోలేదు. కనీసం అడిగిన దానిలో సగం కూడా కేటాయింపులు చేయలేదు. దాదాపు రూ. 19వేల కోట్లతో మెట్రో ఫేస్-1 ప్రాజెక్టు నిర్మాణంలో కేంద్రం కేవలం రూ. 1204 కోట్లు కేటాయిస్తే మిగిలిన మొత్తాన్ని పీపీపీ కింద ఎల్ అండ్ టీ సంస్థ రూ. 17974 కోట్లు వెచ్చించి ప్రాజెక్టు చేపట్టింది. అదేవిధంగా ఫేస్-2 కోసం నిధులు కేటాయించాలని ప్రతిపాదనలు చేసినా, కేంద్రం నుంచి స్పందన లేదు. దీంతో దశాబ్ధ కాలంగా మెట్రో విస్తరణకు అవసరమైన నిధుల కేటాయింపుల్లో హైదరాబాద్‌కు అన్యాయమే జరుగుతున్నది.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
హైదరాబాద్
ఆదివారం
02 ఫిబ్రవరి 2025





## రైల్లో టీటీఈ లంచావతారం.. వీడియో తీస్తున్న ప్రయాణికుడికి వార్నింగ్



**న్యూఢిల్లీ-నవభూమి:** ఇండియన్ రైల్వేస్ చెందిన ఓ రైల్లో ఆ రైల్లోని ట్రెయిన్ టికెట్ ఎగ్జామినర్‌కు, ప్రయాణికుడికి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ వాగ్వాదానికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఆ వీడియోలో ఓ టీటీఈ ప్రయాణికుల నుంచి లంచాలు తీసుకుంటూ కనిపిస్తున్నాడు. కావాల్సిన చోట సీటు, బెర్తు ఇస్తానంటూ అతను పలువురు ప్రయాణికుల నుంచి లంచాలు వసూలు చేస్తుండగా ఓ ప్రయాణికుడు వీడియో తీశాడు.అయితే తాను లంచాలు తీసుకుంటుండగా పైబెర్తులో ఉన్న ఓ ప్రయాణికుడు వీడియో తీస్తుండటాన్ని టీటీఈ గమనించాడు. వెంటనే 'విధి నిర్వహణలో ఉన్న టీటీఈని వీడియో తీస్తావా..?' అని నిలదీశాడు. 'డ్యూటీలో ఉన్న టీటీఈని వీడియో తీస్తే ఏడేళ్ల జైలుశిక్ష పడుతుంది తెలుసా..?' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశాడు. దాంతో 'ఆ రూల్ ఎక్కడుందో చూపించు..' అని ప్రయాణికుడు నిలదీయడం, 'చూపిస్తా.. చూపిస్తా..' అని టీటీఈ ఆగ్రహంతో చెప్పడం ఆ వీడియోలో కనిపిస్తోంది.అయితే ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. డ్యూటీలో ఉన్న టీటీఈని వీడియో తీస్తే నిజంగానే ఏడేళ్ల జైలుశిక్ష పడుతుందా..? అనే విషయంలో చర్చ జరుగుతోంది. చట్టంలో అలాంటిదేమీ లేదని కొందరు నెటిజన్లు మండిపడుతున్నారు. లంచం తీసుకుంటూ కెమెరాకు చిక్కడంతో ఫ్రస్టేషన్‌లో టీటీఈ అలా మాట్లాడి ఉంటాడని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# ముంబై రైల్వే స్టేషన్‌లో దారుణ ఘటన



**ముంబై-నవభూమి:**కామవాంఛ ఎక్కువై పలువురు పురుషులు అనేక దారుణాలకు ఒడిగడుతున్నారు. కళ్లకు ఏం కనిపించినా దానిపై పడుతూ పడక సుఖాన్ని పొందుతున్నారు. తాజాగా ఓ యువకుడుకి శృంగార కోరికలు ఎక్కువ కాగా.. దొరికిన వీధి కుక్కపైనే అత్యాచారానికి పాల్పడ్డాడు. అర్ధరాత్రి రైల్వే స్టేషన్‌లో శునకాన్ని పట్టుకుని సుఖం పొందాడు. ఇంతలోనే ఓ వ్యక్తి అటుగా వెళ్లగా ఈ దారుణం బయట పడింది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్ అవుతోంది. మహారాష్ట్రలోని ముంబై నగరంలో ఉన్న బోరివాలి రైల్వే స్టేషన్‌లో దారుణం జరిగింది. జనవరి 29వ తేదీ వేకువజామున 2 గంటలకు ఓ యువకుడికి శృంగార కోరికలు ఎక్కువ కాగా.. వాటిని తీర్చుకోవడానికి చాలానే ప్రయత్నాలు చేశాడు. కానీ కామ వాంఛను ఆపుకోలేక.. చివరకు 3 గంటలకు ఓ వీధి కుక్కపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఎవరూ లేని ఫూటోవర్ బ్రిడ్జిపై కుక్కను పట్టుకుని రేప్ చేశాడు. ఈ రాక్షస క్రీడ జరుపుతుండగా... వీధి శునకం విపరీతమైన కేకలు పెట్టింది.శునకం అరుపులు విని అటుగా వెళ్తే అసలు విషయం వెలుగులోకిఆ శబ్దాలు విన్న ఓ వ్యక్తి.. అటుగా వెళ్లాడు. విషయం గుర్తించి వెంటనే ఫోన్ తీసి వీడియో తీయడం ప్రారంభించాడు. అలా దగ్గరకు వెళ్తూ ఏం చేస్తున్నావని ప్రశ్నించగానే.. వెంటనే పైకి లేచి ప్యాంటు వేసుకున్నాడు. ఏమీ లేదంటూనే నడుస్తూ వెళ్లిపోయాడు. మరోవైపు కుక్క అక్కడి నుంచి తప్పించుకుపోయింది. ఈ వీడియో తీసిన వ్యక్తి దీన్ని సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. రైల్వే స్టేషన్ సమీపంలోనే ఇంత దారుణం జరిగిందని వివరించాడు.

## షెడ్యూల్డ్ కులాల మహిళలకు రూ.2కోట్ల వరకూ రుణాలు



**న్యూఢిల్లీ- నవభూమి:**షెడ్యూల్డ్ కులాల మహిళలకు కేంద్ర ప్రభుత్వం రూ.2కోట్ల వరకూ టర్మ్ లోన్ పథకం ద్వారా రుణాలు అందించనుంది. తొలిసారి సొంత వ్యాపారాలను ప్రారంభించే, ఉన్నవాటిని విస్తరించే మహిళలకు ఈ పథకం కింద వచ్చే ఐదేళ్లలో రూ. 2 కోట్ల వరకూ రుణాలు అందించనున్నట్లు బడ్జెట్ ప్రసంగంలో నిర్మలా సీతారామన్ ప్రకటించారు. మొత్తం 5 లక్షల మందికి ఈ పథకం ప్రయోజనం చేకూర్చనున్నట్లు పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా మహిళలు, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు దీని ద్వారా ఉద్యోగాలను కల్పిస్తామన్నారు.

## ప్రపంచంలోనే తొలిసారి ఒకే స్తంభంపై ఐదు మెట్రోరైలు పట్టాలు



**చెన్నై- నవభూమి:** చెన్నై మెట్రోరైల్వే సంస్థ నగరంలో ప్రస్తుతం నిర్మిస్తున్న రెండో దశ మెట్రోరైలు మార్గాల ప్రాజెక్టు పనుల్లో భాగంగా ఒకే స్తంభంపై ఐదు డబుల్ లేయర్డ్ ట్రాక్‌లను నిర్మించనుంది. ప్రపంచంలోనే మొదటిసారిగా ఈ రైల్వే ట్రాక్‌ల నిర్మాణం చేపడుతున్న ఘనత తమ సంస్థకే దక్కుతుందని సీఎంఆర్ఎల్ డైరెక్టర్ అర్జునన్ తెలిపారు. వడపళని ఆర్కాట్‌రోడ్డు ప్రాంతంలో ఈ ఐదు రైలు పట్టాలను నిర్మించడానికి సొరంగాలను నిర్మించాలని ప్రణాళిక రూపొందించామని, దీని అమలుకు రూ.5వేల కోట్లు ఖర్చవుతుందని భావించి, ఈ అదనపు వ్యయభారాన్ని నివారించడానికి ఒకే స్తంభంపై ఐదు డబుల్ లేయర్ల ట్రాక్‌లను నిర్మించాలని నిర్ణయించినట్లు చెప్పారు.ఈ వినూత్న విధానం ద్వారా రూ.5వేల కోట్లను ఆదా అవుతుందన్నారు. ఐదు ట్రాక్‌ల బరువు తట్టుకునేలా భూమిలో గట్టి పునాది వేస్తున్నామని, వడపళని నుండి పోరూరు వరకు ఉన్న 4 కిలోమీటర్ల మేర ఐదు ట్రాక్‌లను డబుల్ లేయర్లలో నిర్మిస్తామని, రెండంతస్థుల్లో దిగువ అంతస్థులో రెండు ట్రాక్‌లపై, పై అంతస్థులో మరో రెండు ట్రాక్‌లను నిర్మించి, వాటి పక్కనే మరో లూప్‌లైన్ ట్రాక్ కూడా నిర్మించనున్నామని చెప్పారు. దీంతో నాలుగు రైళ్లను ఒకే స్తంభంపై నడపటానికి వీలు కలుగుతుందన్నారు. రైళ్ల ట్రాక్‌లను మార్చడానికి లూప్‌లైన్ సాయపడుతుందన్నారు.

## రైతులకు గుడ్ న్యూస్.. కిసాన్ క్రెడిట్ కార్డుల రుణ పరిమితి పెంపు




**న్యూఢిల్లీ-నవభూమి:**బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం రైతులకు గుడ్ న్యూస్ చెప్పింది. రైతులకు తక్కువ వడ్డీకే రుణాలిచ్చే కిసాన్ క్రెడిట్ కార్డుల రుణ పరిమితిని పెంచింది. రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచుతున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగంలో తెలిపారు. దీంతో దాదాపు 7.7 కోట్ల మంది రైతులకు ప్రయోజనం కలగనుంది.1998లో ప్రవేశపెట్టిన కిసాన్ క్రెడిట్ స్కీమ్ దేశవ్యాప్తంగా లక్షలాది మంది రైతులకు లబ్ధి చెందుతుంది. అయితే, ఈ కార్డుల పరిమితి చాలా కాలంగా సవరించలేదు. ఈ పథకం కింద రైతులు 9 శాతం వడ్డీ రేటుతో రుణాలు తీసుకుంటున్నారు. అయితే, ప్రభుత్వం 2 శాతం వడ్డీ రాయితీగా అందిస్తుంది. అదనంగా, రైతులు తీసుకున్న రుణాన్ని సకాలంలో చెల్లించినట్లయితే, రైతులు మరో 3 శాతం వరకు వడ్డీ రాయితీని పొందుతారు. తద్వారా వడ్డీ రేటును కేవలం 4 శాతానికి తగ్గించవచ్చు.

## పాంక్రియాటిక్ క్యాన్సర్‌కు ముక్కు తాడు



**హ్యూస్టన్-నవభూమి:** ప్రాణాంతక పాంక్రియాటిక్ క్యాన్సర్ చికిత్సకు అమెరికాలోని రైస్ యూనివర్సిటీ పరిశోధకులు కొత్త విధానాన్ని అభివృద్ధి చేశారు. పాంక్రియాటిక్(క్లోమ గ్రంధి) క్యాన్సర్ కణతులు చిన్న పేగు వంటి కీలకమైన అవయవాలకు సమీపంలో ఏర్పడతాయి. దీంతో అధిక డోస్‌తో రేడియేషన్ థెరపీ చేయడం వల్ల తీవ్రమైన జీర్ణకోశ సంబంధ సమస్యలు తలెత్తే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. క్యాన్సర్ కణతుల సమీపంలోని ఆరోగ్యకర కణజాలానికి నష్టం కలుగుతుంది. అయితే, ఆమైఫోస్టిన్ అనే ఔషధం రేడియేషన్ థెరపీ చేస్తున్నప్పుడు ఆరోగ్యకర కణజాలానికి రక్షణనిస్తుంది.ఇప్పటివరకు సిరల ద్వారా ఇచ్చే ఈ ఔషధం వల్ల సైడ్ ఎఫెక్ట్ అధికంగా ఉంటున్నందున ఎక్కువగా వినియోగించడం లేదు. నోటి నుంచి ఈ ఔషధాన్ని ఇస్తే కడుపులోని ఆమ్లాలు దాని ప్రభావాన్ని తగ్గించేస్తాయి. దీంతో రైస్ యూనివర్సిటీ పరిశోధకులు ఈ ఔషధాన్ని ముక్కు నుంచి ఇచ్చే పద్ధతిని తయారు చేశారు. ఒక ట్యూబ్ ద్వారా నేరుగా ముక్కు నుంచి జీర్ణ వాహిక పై భాగానికి అందించవచ్చని వీరు చెప్తున్నారు. తద్వారా రేడియేషన్ థెరపీ సమయంలో ఆరోగ్యకర కణజాలానికి కలిగే నష్టాన్ని నివారించవచ్చని తెలిపారు. ఈ పద్ధతిని ఎలుకలపై ప్రయోగించగా సత్ఫలితాలు వచ్చాయని చెప్పారు.

# ఇక్కడ భార్యలను అద్దెకు తీసుకోవచ్చు



**శివపురి-నవభూమి:**ఇల్లు, కారు, బైకు లాంటివి అద్దెకు తీసుకోవడం, ఇవ్వడం గురించి చూశాం. చాలా సార్లు మనం కూడా అద్దె తీసుకునే ఉంటాం. కానీ పెళ్లాలను అద్దెకు తీసుకోవడం గురించి ఎప్పుడైనా విన్నారా? ఈ వింత ప్రపంచంలోని ఏదో మూల జరుగుతోంది అనుకుంటే మీరు పప్పులో కాలేసినట్లే. మన దేశంలోనే ఈ వింత పోకడ జరుగుతోంది. రూ.10 వేల నుంచి మొదలు పెడితే లక్షలు కూడా చెల్లించే వారు ఉన్నారు. కొన్ని వర్గాల వారికి ఇదో సంస్కృతి, ఇదో ఆచారంగా సాగుతోంది.ప్రపంచంలోని చాలా దేశాలతో పోలిస్తే భారతదేశంలో వివాహ బంధానికి ఎక్కువ విలువ ఇస్తుంటారు. ఈ మధ్యకాలంలో విడిపోవడం కాస్తంతా పెరిగింది కానీ కొన్ని రోజుల ముందు వరకు ఒక్కసారి పెళ్లైన వారు జీవితాంతం వారితోనే కలిసి ఉంటారు. భార్యభర్తల సంబంధానికి అంతగా విలువ ఇస్తాం మన భారతీయులం. అయితే మధ్యప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాల వారు భార్యలను వేరే మగవారికి అద్దెకు ఇస్తుంటారని చాలా మందికి తెలియదు. శివపురిలోని కొన్ని తెగల వారిలో ఈ సాంప్రదాయం చాలా కాలంగా నడుస్తోంది. ఈ సాంప్రదాయాన్ని వారు దఢీచ్‌గా పిలుస్తుంటారు. భర్త తన భార్యను అంగట్లో బేరానికి పెడతాడు. తను నచ్చిన వారు ఆ భర్తతో అద్దె గురించి మాట్లాడుకుంటారు. రూ.10 వేలతో మొదలై లక్షల వరకు చెల్లిస్తుంటారు.

అందంగా, శరీర సౌష్ఠవంగా ఉన్నవారు ఎక్కువ ధర పలుకుతుంటారు. పెళ్లై ఒక వయస్సు ఉన్న వారికి తక్కువ ధర వస్తుంటుంది. పెళ్లైన మంచి అందంగా ఉన్న వారికి ఎక్కువ ధర వస్తుంది. కన్యలు అయి, అందంగా ఉండే వారికి లక్షల్లో చెల్లించడానికి ముందుకు వస్తుంటారు. ఒక రోజు, వారం, నెల, ఏడాది వరకు కూడా ఈ అద్దెలు ఉంటాయి. ఈ అద్దెలు కేవలం నోటి మాట ద్వారా కాకుండా ఏకంగా ఓ అగ్రిమెంట్ రాసుకుంటారు. ఎన్ని రోజులు, ఎంత చెల్లించాలి, షరతులు ఏమిటో స్పష్టంగా పేర్కొంటారు. యువతులు, మహిళలు ఈ అగ్రిమెంట్‌ను ఎప్పుడైనా బ్రేక్ చేయవచ్చు. అద్దెకు వెళ్లిన ఇంట్లో ఏవైనా ఇబ్బందులు ఎదురైనా, అసౌకర్యంగా అనిపించినా, మరేదైనా కారణంతోనైనా ఆ ఒప్పందాన్ని రద్దు చేసుకునే హక్కు మహిళలకు ఉంటుంది.అద్దెకు వెళ్లిన వారు పరాయి వ్యక్తిని కూడా భర్తగానే చూడాల్సి ఉంటుంది. ప్రేమానురాగాలు అలాగే పంచాలి. ఏడాది కంటే ఎక్కువ అద్దెకు వెళ్లే వారైతే పిల్లలకు కూడా జన్మనిస్తుంటారు. పెళ్లికి తగిన యువతి దొరకని వారు, బాగా డబ్బున్న ధనవంతులు, ఇంట్లోని వయోవృద్ధుల సంరక్షణ కోసం కూడా ఇలా అద్దెకు మహిళలను తెచ్చుకుంటారు. ఒప్పందం పూర్తి అయిన తర్వాత వేరొకరికి అద్దెకు ఇస్తారు. లేదంటే ఒప్పందం పూర్తయ్యాకే తనే కావాలనుకుంటే ఒప్పందాన్ని రెన్యూవల్ చేయించుకోవాల్సి ఉంటుంది.మధ్యప్రదేశ్ తో పాటు రాజస్థాన్, గుజరాత్, ఉత్తరప్రదేశ్, హర్యానాలోని కొన్ని తెగల్లో ఈ సాంప్రదాయం ఉంది. ఒక్కో ప్రాంతంలో ఒక్కోలా పిలుస్తుంటారు. ఈ మధ్యే ఈ సాంప్రదాయానికి సంబంధించి పెద్దగా చర్చ జరగడం మొదలైంది. ఈ విస్తుపోయే సాంప్రదాయం గురించి జాతీయ మహిళా హక్కుల కమిషన్ కూడా సీరియస్ అయింది. దీనిని అరికట్టేందుకు చర్యలు చేపట్టాలంటూ ఆయా రాష్ట్రాలను కేంద్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ కోరింది.

## 2032లో భూమిని ఢీ కొట్టనున్న ఆస్టరాయిడ్!



**వాషింగ్టన్-నవభూమి:** 2024 వైఆర్4 అనే భారీ గ్రహ శకలం(ఆస్టరాయిడ్) 2032లో భూమిని ఢీ కొట్టవచ్చని నాసా శాస్త్రవేత్తలు అంచనా వేశారు. 130-300 అడుగుల పొడవు గల ఈ గ్రహ శకలం మానవాళికి మొత్తానికి తక్కువ ప్రమాదకారి అయినా ఒక పెద్ద నగరాన్ని తీవ్రంగా నాశనం చేయగల శక్తిని కలిగి ఉండొచ్చని శాస్త్రవేత్తలు అభిప్రాయపడ్డారు.దీని ప్రభావం 8 మెగా టన్నుల టీఎన్‌టీకి సమానమని%ొ% ఇది హిరోషిమాపై ప్రయోగించిన అణు బాంబు కన్నా 500 రెట్లు శక్తివంతమైనది అయి ఉండొచ్చని వారు వెల్లడించారు. అయితే డిసెంబర్ 22, 2032లో ఈ గ్రహ శకలం భూమి ఢీ కొట్టే చాన్స్ ఒక్క శాతమేనని.. అంటే 99 శాతం దాని ప్రభావం భూమిపై ఉండదని వారు తెలిపారు.

## స్పేస్‌వాకింగ్‌లో సునీత రికార్డ్



**వాషింగ్టన్-నవభూమి:** అత్యధిక సమయం స్పేస్‌వాకింగ్ చేసిన తొలి మహిళా వ్యోమగామిగా భారత సంతతికి చెందిన సునీతా విలియమ్స్ రికార్డ్ సృష్టించారు. ఆమె 62 గంటల 6 నిమిషాలపాటు స్పేస్‌వాక్ చేశారు. ఆమె బుచ్ విల్మోర్‌తో కలిసి 2024 జూన్‌లో ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్ (ఐఎస్ఎస్)కు వెళ్లిన సంగతి తెలిసిందే. వీరిద్దరూ గురువారం స్పేస్‌వాక్ చేశారు.అంతరిక్షంలో సూక్ష్మజీవులు ఉన్నాయేమో చూసి, వాటి నమూనాలను సేకరించడం కోసం వీరు తామున్న ప్రయోగశాల నుంచి బయటకు దిగారు. ఈస్టర్న్ టైమ్ ప్రకారం ఉదయం 7.43 గంటలకు ప్రారంభమైన వీరి స్పేస్‌వాక్ మధ్యాహ్నం 1.09 గంటలకు ముగిసింది.

## ఈ ఎన్నికల్లో మేం ఓడిపోతే జరిగేది అదే..

# షాకింగ్ వీడియో రిలీజ్ చేసిన కేజ్రీవాల్



**న్యూఢిల్లీ-నవభూమి:**దేశ రాజధాని ఢిల్లీలో మరో నాలుగు రోజుల్లోనే అసెంబ్లీ ఎన్నికలు జరగబోతున్నాయి. ఈక్రమంలోనే ప్రధాన పార్టీలన్నీ పెద్ద ఎత్తున ఎన్నికల ప్రచారాలు నిర్వహి స్తున్నారు. ముఖ్యంగా బీజేపీ, ఆమ్ ఆద్మీ పార్టీ, కాంగ్రెస్ పార్టీలు అయితే.. ఓటర్లను ఆకర్షించేందుకు అనేక వరాల జల్లులు కురిపిస్తున్నాయి. అలాగే ఇతర పార్టీలపై తీవ్ర విమర్శలు చేస్తూ వారికి జనాలు ఓట్లు వేయకుండా చేసేందుకు కృషి చేస్తున్నాయి. తాజాగా ఇలాంటి ప్రయత్నమే చేశారు ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అర్వింద్ కేజ్రీవాల్. తమ పార్టీ ఈ ఎన్నికల్లో ఓడిపోతే జరగబోయేది అదేనంటూ ఓ వీడియో విడుదల చేశారు. ఆ పూర్తి వివరాలు మీకోసం.మరో నాలుగు రోజుల్లో జరగబోతున్న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో తమ సర్కారు ఓడిపోతే.. జరగబోయేది ఇదేనంటూ కేజ్రీవాల్ ఓ వీడియోను విడుదల చేశారు. అందులో బీజేపీ మద్దతుదారులను ఉద్దేశిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. తాను బీజేపీ మద్దతుదారులతో ముఖ్యమైన విషయాలు మాట్లాడాలను కుంటున్నాని చెప్పు కొచ్చారు. ఇటీవలే ఆ పార్టీకి చెందిన ఓ అభిమానిని కలిశాని.. అప్పుడు ఆయన ఈ ఎన్నికల్లో మీరు ఓడిపోతే ఎలా అని ప్రశ్నించినట్లు తెలిపారు. దానికి అతడు కచ్చితంగా సమాధానం తెలుసుకోవాలని కేజ్రీవాల్ వెల్లడించారు.ఈక్రమంలోనే వీడియోలో ఆ సమాధానం వివరించారు. ఢిల్లీ ఎన్నికల్లో ఆమ్ అద్మీ పార్టీ ఓడిపోతే.. ఉచిత కరెంట్, నీరు, నాణ్యమైన విద్య, మెరుగైన వైద్య సేవలు అన్నీ ఆగిపోతాయని స్పష్టం చేశారు. బీజేపీ వీటన్నిటినీ ఆపేస్తుందన్నారు. అలాగే ఢిల్లీ ప్రజలు అందరికీ నెలకు రూ.25 వేల ఖర్చు పెరిగిపోతుందన్నారు. ప్రస్తుతం భారతీయ జనతా పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో సర్కారు బడులు ఎలా ఉన్నాయో అందరికీ తెలుసన్నారు. అలాగే ఉచితంగా 24 గంటల కరెంటు ఇస్తుందో లేదో కూడా తనకంటే జనాలకే బాగా తెలుసని చెప్పారు.బీజేపీ ప్రయోజనాల గురించి కాకుండా.. బీజేపీ మద్దతుదారులు తమ కుటుంబాల గురించి ఆలోచించాలని సూచించారు. వారంతా ఆ పార్టీని వీడినా, వీడకపోయినా ఓట్లు మాత్రమే ఆమ్ ఆద్మీ పార్టీకి వేసి గెలిపిస్తే ఢిల్లీ అభివృద్ధికి సాయం చేసిన వారు అవుతారన్నారు. ఇదంతా ఇలా ఉండగా.. ఢిల్లీలో ఫిబ్రవరి 5వ తేదీన అసెంబ్లీ ఎన్నికలు జరగబోతున్నాయి. అలాగే 8వ తేదీన ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. మొత్తం 70 స్థానాలు ఉన్న ఈ అసెంబ్లీ ఎన్నికల్లో.. ఆమ్ ఆద్మీ పార్టీ ఈసారి ఎన్ని స్థానాలు దక్కించుకుంటుందో చూడాలి మరి.


## మమతా కులకర్ణీకి బిగ్ షాక్... బాబా రామ్ దేవ్ వ్యాఖ్యలే కారణమా?



**ప్రయాగ్‌రాజ్-నవ భూమి:** ఉత్తరప్రదేశ్ లోని రాజ్ ప్రయాగ్ వద్ద ప్రపం చంలోనే అతిపెద్ద ఆధ్యా త్మిక కార్యక్రమం మహా కుంభమేళా జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ కార్యక్రమంలో ఎంతో మంది సాధువులు, సన్యాసులు, అఘోరాలు, బాబాలు పాల్గొంటున్నారు.. ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నారు. ఈ సమ యంలో ప్రముఖ బాలీవుడ్ నటి మమతా కులకర్ణి ప్రత్యక్షమైన సంగతి తెలిసిందే. మరికొంతమందికి షాకింగ్‌గా మారింది. ఈ సమయంలో ఆమె ప్రాపంచైక జీవనాన్ని పరిత్యజించి, సన్యాసినిగా మారారు. కిన్నెర అఖాడాలో చేరారు. మాహామండలేశ్వర్‌గా ఆమె దీక్షను చేపట్టారు. ఈ సమయంలో అమెకు తాజాగా ఆ కిన్నెర అఖాడా షాకిచ్చింది. అక్కడ నుంచి బహిష్కరించింది.అవును.. ప్రముఖ బాలీవుడ్ నటి మమతా కులకర్ణి ఇటీవల సన్యాసినిగా మారిన సంగతి తెలిసిందే. ఈ సమయంలో ఆమెను కిన్నెర అఖాడా నుంచి బహిష్కరించారు. ఆమె తీసుకున్న దీక్షను రద్దు చేరు. కిన్నెర అఖాడా ఈ నిర్ణయం తీసుకోవడానికి ప్రధాన కారణం ప్రముఖ యోగా గురువు రామ్ దేవ్ బాబా చేసిన వ్యాఖ్యలే అని అంటున్నారు. వాస్తవానికి ఆమె అఖాడాలో చేరిన అనంతరం.. పలువురు మతపెద్దలు నుంచి అభ్యంతరాలు వచ్చినట్లు చెబుతున్నారు. దీనికి తోడు రామ్ దేవ్ బాబా చేసిన వ్యాఖ్యలు ప్రధాన కారణంగా చెబుతున్నారు. దీంతో.. ఆమెతో పాటు ఆమెను చేర్పించిన ఆచార్య మహామండలేశ్వర్ డాక్టర్ లక్ష్మీనారాయణ్ త్రిపాఠీని సైతం అఖాడా నుంచి తొలగిస్తున్నట్లు తెలిపారు. ఈమె కిన్నెర అఖాడాలో చేరడం ఒకెత్తు అయితే.. చేరిన మొదట్లోనే ఆమె అత్యున్నత స్థానమైన మహామండలేశ్వర్ హోదాను పొందడం మరొకెత్తు అంటూ పలువురు వ్యతిరేకించినట్లు చెబుతున్నారు. ఇదే సమయంలో బాబా రామ్ దేవ్ స్పందిస్తూ... మహా కుంభమేళా అనేది పవిత్ర కార్యక్రమంలో కొంతమంది వ్యక్తులు అసభ్యతను ప్రోత్సహిస్తున్నారంటూ మండిపడ్డారు. ఇదే సమయంలో... ఇప్పటివరకూ ప్రాపంచిక సుఖాల్లో మునిగిపోయిన వ్యక్తులు ఒక్కసారిగా సన్యాసులుగా మారిపోయి.. మహామండలేశ్వర్ వంటి బిరుదులను పొందుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలా పలు ప్రభావల ఫలితంగా ఆమెపై బహిష్కరణ వేటు వేసినట్లు చెబుతున్నారు.

## ప్రయాగ్‌రాజ్‌కు తరలివచ్చిన 'అయోధ్య'..


# టాలీవుడ్ ఆర్ట్ డైరెక్టర్ అద్భుత సృష్టి



**ప్రయాగ్‌రాజ్-నవభూమి:** మహాకుంభ మేళాకు వెళ్లేవారు.. అక్కడి నుంచి అయోధ్య రామమందిరానికి వెళ్లాలని మనసులో ఉన్నా.. అధికారులు రద్దీ పేరుతో వెళ్లకుండా అడ్డుకుంటున్నారని అసంతృప్తిగా ఉందా? అయితే ఇలాంటి వారు నిరుత్సాహానికి గురికావద్దు. మహా కుంభమేళాలో ఆ అయోధ్య రాముడ్ని దర్శించుకోవచ్చు. బాల రాముడే అయోధ్య నుంచి ప్రయాగ్‌రాజ్‌కు తరలివచ్చాడు. అదేంటి అయోధ్య రాముడు కుంభమేళాకు వచ్చాడా? అని ఆశ్చర్యపోవద్దు. అచ్చం అయోధ్య మందిరాన్ని దర్శించుకున్న అనుభూతి కలిగేలా ప్రయాగ్‌రాజ్‌లో నమూనా ఆలయాన్ని టాలీవుడ్‌కు చెందిన ప్రముఖ కళా దర్శకుడు రమణ వంక తీర్చిదిద్దారు. త్రివేణి సంగమానికి 1.5 కి.మీ. దూరంలో చుంగ్గీ అనే చోట భక్తుల కోసం ఓ ప్రయివేట్ సంస్థ ప్రత్యేక ఈవెంట్లు నిర్వహిస్తోంది. అందులోనే అయోధ్యను తలపించేలా 16,800 చదరపు అడుగుల విస్తీర్ణం, 140 అడుగుల పొడవు, 120 అడుగుల వెడల్పు, 81 అడుగుల ఎత్తులో రమణ వంక నమూనా మందిరాన్ని సృష్టించాడు.

దీని నిర్మాణంలో వెదురు, వస్త్రాలు, ఫోమ్ మెటీరియల్, ఫైబర్‌ను ఉపయోగించారు. ఆలయం లోపల అయోధ్య మాదిరిగానే బాలరాముడి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. దీనిని నిత్యం 20వేల మంది భక్తులు దర్శించుకుంటున్నారు. ప్రయాగ్‌రాజ్‌లో అయోధ్య రామమందిర ప్రతిరూపాన్ని నిర్మించే అవకాశం తనకు దక్కడం అదృష్టంగా భావిస్తున్నట్లు రమణ వంక తెలిపారు. ఈ ఆలయ నిర్మాణంలో 200 మంది కార్పెంటర్లు, సివిల్ వర్కర్లు పాలుపంచుకున్నారని చెప్పారు. కేవలం. 25 రోజుల్లో నిర్మాణం పూర్తిచేశామని ఆయన వివరించారు.

## గురజాడ సూక్తిని ప్రస్తావించిన నిర్మలా సీతారామన్




**న్యూఢిల్లీ-నవభూమి:** పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు కొనసాగుతున్నాయి. ఉదయం అధికారులతో కలిసి రాష్ట్రపతి భవన్‌కు వెళ్లిన కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్.. బడ్జెట్ ను రాష్ట్రపతికి అందజేశారు. బడ్జెట్‌లోని కీలక వివరాలను వివరించి పార్లమెంట్‌లో ప్రవేశపెట్టడానికి ఆమె అనుమతి కోరారు. బడ్జెట్ ప్రవేశ పెట్టేందుకు అనుమతిస్తూ రాష్ట్రపతి ముర్ము కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌కు స్వీటు తినిపించారు. రాష్ట్రపతితో సమావేశం ముగిసిన అనంతరం ఆర్థిక శాఖ ఉన్నతాధికారులతో కలిసి కేంద్ర మంత్రి పార్లమెంట్‌కు చేరుకున్నారు. 2025-26 వార్షిక బడ్జెట్‌ను కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ది పవర్ ఆఫ్ రైజింగ్ మిడిల్ క్లాస్ పేరుతో బడ్జెట్ 2025ను ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా దేశమంటే మట్టికాదోయి దేశమంటే మనుషులోయి అంటూ గురజాడ అప్పారావు సూక్తిని నిర్మలా సీతారామన్ ప్రస్తావించారు. వికసిత్ భారత్ లక్ష్యంగా తమ ప్రభుత్వం ముందుకు వెళ్తోందని పేర్కొన్నారు..



## పాఠశాల విద్యలో సంస్కరణలు ఎటువైపు?

ప్రభుత్వ రంగంలో మంచి పాఠశాల విద్యకు ప్రధానంగా కావలసిన ఉపాధ్యాయుల నియామకం పట్ల గత ప్రభుత్వం నిర్లక్ష్యం వహించింది. ఉపాధ్యాయ పోస్టులు తగ్గించుకోవడానికి పాఠశాల విద్యను విధ్వంసం చేసిన జీఓ 117 తీసుకువచ్చింది. ప్రస్తుత ప్రభుత్వం ఈ జీఓ రూపాన్ని మాత్రమే మారుస్తుందా, సారాన్ని కూడా మారుస్తుందా అన్నది పాఠశాల విద్య ముంగిట ఉన్న పెద్ద సమస్య. ఈ జీఓ ఉపసంహారణ ప్రక్రియ పేరుతో ప్రభుత్వం జనవరి 9న విడుదల చేసిన మెమో ఇక్కడ చర్చనీయాంశం.

గత ప్రభుత్వం జీఓ 117 ద్వారా ఐదు ప్రధాన సమస్యలను సృష్టించింది: 1) ప్రాథమిక పాఠశాలలను నిలువునా రెండు ముక్కలు చేసి 3, 4, 5 తరగతుల బాలబాలికలను ఉన్నత పాఠశాలలకు పంపింది. అత్యధిక సందర్భాల్లో ఉన్నత పాఠశాలలకు వెళ్ళిన విద్యార్థులు నిర్లక్ష్యానికి గురికాగా, 1, 2 రెండు తరగతులతో మిగిలిపోయిన ఫౌండేషన్ పాఠశాలలతో కలిపి సుమారు 15 వేల ప్రాథమిక పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా దిగజారిపోయాయి. 2) 1 నుంచి 8 వరకు ఉండే అత్యధిక ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయుల సంఖ్య ఎనిమిది నుంచి నాలుగు లేదా ఐదుకు తగ్గించారు. ఆ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. 3) అత్యధిక ఉన్నత పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయుడు, పి.ఇ.టి పోస్టులు రద్దు చేశారు. 4) ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత విభాగాల్లో తరగతి గదిలో విద్యార్థుల గరిష్ఠ సంఖ్యను వరుసగా 30, 35, 40/50 నుంచి వరుసగా 40, 52, 60గా మార్చారు. ఇంకా, వారానికి ఉపాధ్యాయులు గరిష్టంగా బోధించవలసిన పీరియడ్లను 32 నుంచి 42కు పెంచారు. దీనితో విజయవంతంగా నడుస్తున్న ఎక్కువ నమోదుగల పాఠశాలలు అవసరమైన ఉపాధ్యాయ పోస్టులను కోల్పోయి నష్టపోయాయి. 5) ప్రభుత్వ పాఠశాలల్లో సమాంతరంగా నడుస్తున్న మాతృభాషా మాధ్యమ విభాగాలను రద్దుచేశారు. జీఓ 117 రద్దు చేయమని, పాఠశాల పునర్వ్యవస్థీకరణ జీఓ 84ను, ప్రాథమిక విద్య అందుబాటు దూరపరిమితి పెంపు జీఓ 85ను రద్దుచేయమని సుమారు అన్ని ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాలు కూడా డిమాండు చేశాయి. కానీ గత ప్రభుత్వం పట్టించుకోలేదు.

పాఠశాల విద్యాశాఖ ఇచ్చిన మెమోలో విద్యార్థులు ప్రకాశవంతమైన భవిష్యత్‌తో గ్లోబల్ పౌరులు కావాలని లక్ష్య నిర్దేశం చేశారు. ప్రాథమిక విద్య పూర్తిచేసిన విద్యార్థులకు గత 20 ఏళ్లుగా చదవనూ రాయనూ రావడం లేదు. ఈ పరిస్థితుల్లో అంత గొప్ప లక్ష్య నిర్దేశం చేయడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. ఇక ఆ మెమోలో ఏముందో చూద్దాం. ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల నుంచి 3, 4, 5 తరగతులను తిరిగి ప్రాథమిక పాఠశాలలకు మారుస్తున్నారు. ఇది మంచి పరిణామం. అయితే ప్రాథమిక విద్య అందించే అత్యధిక పాఠశాలలు గతంలో జీఓ 117 పద్ధతిలోనే రెండవ తరగతి వరకు మాత్రమే విద్య అందించే ఫౌండేషన్ పాఠశాలలుగా కొనసాగుతాయి. కొన్ని పాఠశాలలు మాత్రమే జీఓ 117 ముందు స్థాయికి వస్తాయి. అందులో కూడా కొన్ని బేసిక్ పాఠశాలలుగా, కొన్ని ఆదర్శ పాఠశాలలుగా వ్యవస్థీకరిస్తారు. ఆదర్శ పాఠశాలలు ఆదర్శంగా తయారవుతాయో లేదో కాని, బేసిక్ పాఠశాలలు కునారిల్లిపోతాయనే ఆందోళన వ్యక్తమవుతున్నది. ఈ మెమో ప్రకారం 60 లోపున విద్యార్థుల నమోదు ఉన్న ఏడు తరగతులకు (ఎల్.కె.జి%-%యు.కె.జి%-% 1 నుంచి 5 తరగతులకు) కలిపి ఇద్దరు టీచర్లను ఇస్తారు. వీటిని బేసిక్ పాఠశాలలు అంటారు. ఇవి పెద్ద సంఖ్యలో ఉంటాయి. వీటి పరిస్థితి దారుణంగా ఉంటుందని వేరుగా చెప్పనవసరం లేదు. ఇక నమోదు 60 దాటిన ప్రాథమిక పాఠశాలలకు ఏడు తరగతులకు (ఎల్.కె.జి-యు.కె.జి 1 నుంచి 5 తరగతులకు) కలిపి ఐదుగురు ఉపాధ్యాయులను ఇస్తారు. వీటిని ఆదర్శ పాఠశాలలు అంటారు. ఇటు బేసిక్ పాఠశాలలకు గాని, అటు ఆదర్శ పాఠశాలలకు గాని పూర్వ ప్రాథమిక విద్యకు (ఎల్.కె.జి%-%పిపి1%-% యు.కె.జి-పిపి2లకు) ప్రత్యేకంగా ఉపాధ్యాయులను ఇవ్వరు. ఇక కొన్ని ఆదర్శ పాఠశాలలకు ఐదుగురు ఉపాధ్యాయులను ఇవ్వడానికి పెద్ద సంఖ్యలో ప్రాథమిక పాఠశాలలను 2వ తరగతి వరకు బోధించే ఫౌండేషన్ పాఠశాలలుగా కుదించడం, ఎల్.కె.జి నుంచి 5వ తరగతి వరకు మొత్తం ఏడు తరగతులు ఉండే బేసిక్ పాఠశాలలకు ఇద్దరు ఉపాధ్యాయులను మాత్రమే ఇవ్వడం ఎంతవరకు సమంజసం? విద్యార్థి-ఉపాధ్యాయ నిష్పత్తి విషయంలో 'కేంద్ర విద్యా హక్కు చట్టం (బాలల ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం 2009)' తగిన స్థాయిలో లేదు. ఆపైన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హైకోర్టు 'విద్యాహక్కు చట్టానికి మినహాయింపుగా' ఇచ్చిన ఒక తీర్పును ఉపయోగించుకుని ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థి నమోదు 20 వరకు ఒకే ఒక్క ఉపాధ్యాయుడ్ని ఇస్తూ వచ్చారు. ఇప్పుడూ అందులో మార్పులేదు. ఇక, నమోదు 21-40 స్లాబ్‌లో విద్యాహక్కు చట్టం ప్రకారం ఇద్దరు ఉపాధ్యాయులను కేటాయిస్తున్నారు, కాని గురువారం విడుదల్కెన మెమో ప్రకారం నమోదు 21%-%30 ఉన్న ఫౌండేషన్ పాఠశాలలకు (ఎల్.కె.జి, యు.కె.జి ఇంకా 1వ తరగతి, 2వ తరగతి) ఒక ఉపాధ్యాయుడ్నే కేటాయించడం ఒక కొత్త కత్తిరింపు. ఆదర్శ పాఠశాలల స్థాపన పేరున ఈ కత్తిరింపులు జరుగుతున్నాయి. నమోదు 41-60 ఉన్న ప్రాథమిక పాఠశాలలను బేసిక్ పాఠశాలలుగా పరిగణిస్తూ ఇద్దరు ఉపాధ్యాయుల చొప్పున మాత్రమే ఇవ్వబోతున్నట్లు ఇటీవలి మెమో బట్టి తెలుస్తుంది. ఈ స్లాబ్‌లో 3వ ఉపాధ్యాయుడ్ని ఎందుకివ్వకూడదు? ఈ స్లాబ్‌లో కనీసం ప్రతి పంచాయితీకి ఒక పాఠశాల ఉంటుంది. మూడవ పోస్టును కేటాయించి వాటిని బలపరచవచ్చు, ఇంకా బాలబాలికల నమోదు 40, 60, 90 దాటిన ప్రాథమిక పాఠశాలలన్నింటికీ విద్యాహక్కు చట్టానికి అదనంగా రాష్ట్ర ప్రభుత్వం ఒక పోస్టును ఇస్తే ప్రాథమిక స్థాయిలో సార్వత్రికంగా విద్యా ప్రమాణాలు పెరుగుతాయి. అత్యధిక పాఠశాలలు ఆదర్శ పాఠశాల వైపు అడుగులు వేయగలుగుతాయి. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో నమోదు కూడా పెరుగుతుంది. రాష్ట్ర ప్రభుత్వం అదనంగా ఇచ్చే ఆ పోస్టును ఆంగ్ల భాషా బోధనకు ఉద్దేశించవచ్చు. మాతృభాషా మాధ్యమం, ఆంగ్లభాషా బోధన రెండూ సాధించవచ్చు. ఇందుకోసం ప్రభుత్వం కొత్తగా పోస్టులు మంజూరు చేయవలసిన అవసరం లేదు. ఇప్పటికే మంజూరై ఖాళీగా ఉన్న పోస్టులను మార్పుచేసి నింపితే సరిపోతుంది.ప్రాథమికోన్నత పాఠశాలల విషయానికి వస్తే) 6, 7, 8 తరగతుల నమోదు 60 పైన ఉంటే ఆ ప్రాథమికోన్నత పాఠశాలను ఉన్నత పాఠశాల చేస్తామంటున్నారు. జీఓ 117 అమలు కారణంగా గత రెండు సంవత్సరాలుగా ప్రాథమికోన్నత పాఠశాలలు బాగా తెబ్బతిన్నాయి. అప్‌గ్రేడేషన్ అవకాశం ఉండకపోవచ్చు. బి) 6, 7, 8 తరగతుల నమోదు 30లోపున ఉంటే అటువంటి ప్రాథమికోన్నత పాఠశాలను ప్రాథమిక పాఠశాలగా కుదిస్తారు.

గత రెండు సంవత్సరాలుగా నమోదు తగ్గినందున చాలా

# "పుత్తడి లాంటి చిత్తడి నేలలు"



**ఫిబ్రవరి 2 ప్రపంచ చిత్తడి నేలల పరిరక్షణ దినం సందర్భంగా..**


అనాదిగా మానవుని జీవన ప్రయాణం నేలతో ముడిపడి ఉన్నదన్నది కాదనలేని నిజం. ఈ నేలల్లో కొన్ని ఆహారాన్ని పండించడానికి, కొన్ని ప్రకృతి వైపరీత్యాల ప్రమాదాన్ని తగ్గించడానికి, మరికొన్ని జీవ వైవిధ్యాన్ని కాపాడడానికి ఉపయోగపడుతున్నాయి. వీటన్నింటిలో చిత్తడి నేలలు ప్రత్యేకమైనవి.

**చిత్తడి నేల దినోత్సవం - థీమ్:**

ఇరాన్ దేశంలో రామ్‌సర్ నగరంలో 2 ఫిబ్రవరి 1971న చిత్తడినేలల పరిరక్షణ, స్థిరమైన ఉపయోగం కోసం సమావేశం జరిగింది. అందువలన ఫిబ్రవరి రెండవ తేదీని అంతర్జాతీయ చిత్తడి నేలల దినోత్సవంగా జరుపుకుంటారు. ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవం 2025 యొక్క థీమ్ "మన ఉమ్మడి భవిష్యత్తు కోసం చిత్తడి నేలలను రక్షించడం". ప్రజలు భవిష్యత్తు తరాల సంక్షేమం కోసం చిత్తడి నేలలను రక్షించాల్సిన అవసరాన్ని థీమ్ నొక్కి చెబుతుంది.

**చిత్తడి నేల అంటే ?**

నది, సముద్రం, ఇతర నీటి వనరుల తీర ప్రాంతాలలో లోతు తక్కువ వుండి ఎక్కువ కాలం నీరు నిల్వా ఉండే భూములను 'చిత్తడి నేలలు' అంటారు. ఈ నేలలు శాశ్వతంగా లేదా కాలానుగుణంగా ఆక్సిజన్ రహిత ప్రక్రియలు ప్రబలంగా ఉన్న నీటి వరదలకు గురయ్యే ఒక ప్రత్యేకమైన పర్యావరణ వ్యవస్థ. నీటి మొక్కలు, ప్రత్యేకమైన హైడ్రిక్ మట్టికి అనుగుణంగా ఉండే వృక్షసంపదలు అనేవి ఇతర భూభాగాలు లేదా నీటి వనరుల నుండి చిత్తడి నేలలను వేరుచేసే ప్రాథమిక అంశం. మంచి నీటి సరస్సులు, ఉప్పునీటి సరస్సులు, మడ అడవులున్న తీర ప్రాంతాలన్నీ చిత్తడి నేలలే. చిత్తడి నేలలు మన సహజ వాతావరణంలో కీలకమైన భాగం. ఇవి మానవ మనుగడకు కీలకం. మానవాళికి,




పర్యావరణ వ్యవస్థలకు అనేక మేలు చేస్తాయి. ఇవి మంచినీటి సరస్సులు, చిత్తడి నేలలు, మడ అడవులు, ఎత్తైన సరస్సులతో సహా విభిన్న పర్యావరణ వ్యవస్థలను కలిగి ఉంటాయి.

**రామ్ సార్ ఒప్పందం :**

ఈ సమావేశంలో రూపొందించిన ఒప్పందంపై 164 దేశాలు సంతకం చేశాయి. దానినే రామ్ సార్ ఒప్పందం అంటారు. చిత్తడి నేలల పరిరక్షణకు ఈ ఒప్పందంలో కొన్ని ప్రమాణాలను నిర్దేశించారు. చిత్తడి నేలల యొక్క అపారమైన విలువను, పరిరక్షణ తక్షణ అవసరాన్ని ఇది నొక్కి చెప్పింది. ఈ ఒప్పందాన్ని మనదేశం 1 ఫిబ్రవరి 1982న ఆమోదించింది.

**ఉపయోగాలు:**

వరదలను, వరద ప్రభావాలను తగ్గిస్తాయి. తీరప్రాంతాలను రక్షిస్తాయి. వాతావరణ మార్పులను తగ్గిస్తాయి. జీవవైవిధ్యాన్ని కాపాడుతాయి. లెక్కలేనన్ని జాతుల మొక్కలు, జంతువులు మనుగడ కోసం వీరిపై ఆధారపడి ఉంటాయి. కాలుష్య కారకాలను గ్రహిస్తాయి. నీటి నాణ్యతను మెరుగుపరుస్తాయి. ఆహారం, ముడిపదార్థాలు, ఔషధాలకు మూలమవుతున్నాయి.

అరుదైన మొక్కలకు, పక్షులకు, జంతువులకు, చేపలు గుడ్లు పెట్టడానికి ఈ నేలలు అనుకూలమైనవి. మంచినీటి సరఫరా, ఆహారం, నిర్మాణ వస్తువులును అందిస్తాయి. భూగర్భజలాలను రీఛార్జ్ చేస్తాయి. ప్రపంచవ్యాప్తంగా నలభై శాతం జీవజాతులకు నివాసాన్ని, వంద కోట్లకు పైగా ప్రజలకు జీవనోపాధిని కలిగిస్తున్నాయి. రవాణా, పర్యాటకం, ప్రజల సాంస్కృతిక, ఆధ్యాత్మిక శ్రేయస్సులో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. విభిన్న వృక్షజాలం, జంతుజాలానికి కీలకమైన ఆవాసాలు, స్థానిక ప్రజలకు అవసరమైన పర్యావరణ వ్యవస్థ సేవలను అందిస్తాయి. అనేక చిత్తడి నేలలు సహజ సౌందర్యం ఉన్న ప్రాంతాలు, అనేక ఆదివాసీలకు ముఖ్యమైనవి.

**రామ్‌సర్ ప్రాంతం అంటే ?**

మార్ష్ , ఫెన్, పీట్‌ల్యాండ్ లేదా నీటి ప్రదేశాలను రామ్‌సర్ ప్రాంతం అంటారు. మార్ష్ అనేది నీరు భూమిని చాలా కాలం పాటు కప్పి ఉంచే భూభాగం. ఫెన్ అంటే గడ్డితో కూడిన వృక్షసంపదతో లోతట్టు నేల. పీట్‌ల్యాండ్ అనగా కుళ్ళిపోతున్న మొక్కల సేంద్రియ పదార్థాలను కలిగి ఉండే నేల. ఇవన్నీ చిత్తడి నేలలే. ప్రపంచవ్యాప్తంగా 172 ఒప్పంద భాగస్వామి

**దేశాల భూభాగాల్లో**


25 లక్షల చదరపు కిలోమీటర్ల కంటే ఎక్కువ విస్తీర్ణంలో 2,400 పైగా రామ్‌సర్ సైట్‌లు ఉన్నాయి. మన దేశంలో 2024లో ప్రకటించిన మూడు రామ్‌సర్ ప్రదేశాలతో (అవి తమిళనాడులోని నంజరాయన్, కజువేలి పక్షుల అభయారణ్యం, మధ్యప్రదేశ్‌లోని తవా రిజర్వాయర్) 85 రామ్‌సర్ సైట్లు ఉన్నాయి. ఇవి సుమారు 13,58,068 హెక్టార్ల విస్తీర్ణాన్ని కలిగి ఉన్నాయి. ఈ ప్రాంతాలు వాటి పర్యావరణ ప్రాముఖ్యత, జీవవైవిధ్య పరిరక్షణ, నీటి శుద్ధీకరణ, స్థానిక ప్రజలకు జీవనోపాధి మద్దతు కోసం వారి సహకారం కోసం గుర్తించబడ్డాయి. రామ్‌సర్ జాబితా ప్రపంచంలోనే అతిపెద్ద రక్షిత ప్రాంతాల నెట్‌వర్క్. ప్రపంచంలోని మొట్టమొదటి సైట్ ఆస్ట్రేలియాలోని కోబోర్గ్ ద్వీపకల్పం. దీనిని 1974లో గుర్తించారు. సుమారు 1,20,000 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంతో బ్రెజిల్‌లోని రియోనీగ్రో, 60,000 చ.కి.మీ విస్తీర్ణంతో డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగోలోని ఎన్‌గిరి తుంబ మైందోంబే, కెనడాలోని క్వీన్ మౌడ్ గల్ఫ్ అతిపెద్ద సైట్‌లు. యు.కె ప్రస్తుతం 175, మెక్సికో 144 ప్రాంతాలతో మొదటి, రెండవ స్థానాలలో ఉన్నాయి. మనదేశం మూడవ స్థానంలో ఉంది. కన్వెన్షన్ రక్షణలో 1,48,000 చదరపు కిలోమీటర్లతో బొలీవియా అతిపెద్ద ప్రాంతాన్ని కలిగి ఉంది.

**సవాళ్లు - పరిష్కారాలు:**

మానవుల తప్పిదాలతో పర్యావరణానికి చాల హాని జరుగుతున్నది. ఆ పరంపరలో ఈ చిత్తడి నేలలకు గూడా పెద్ద హాని జరుగు తున్నది. ప్రజలు వ్యవసాయ అవసరాలకు ఈ భూములను ఆక్రమించు కొని రసాయన ఎరువులకు వాడడం, నివాస యోగ్యానికి ఈ నేలలను పూడ్చడం, పరిశ్రమల కొరకు ఈ చిత్తడి నేలలను కేటాయిచడంలో ఇవి మరింత విధ్వంసానికి గురవుతున్నాయి. కాలుష్యం, ఆక్రమణలు, నిలకడలేని అభివృద్ధి, వాతావరణ మార్పులు సరిపడని నిర్వహణ పద్ధతులు వంటి సవాళ్లు ఎదుర్కొంటున్నాయి. మానవ కార్యకలాపాలు, గ్లోబల్ వార్మింగ్ కారణంగా చిత్తడి నేలలు అడవుల కంటే మూడు రెట్లు వేగంగా కనుమరుగు అవుతున్నాయి. యునెస్కో ప్రకారం చిత్తడి నేలల్లో నివసించే లేదా సంతానోత్పత్తి చేసే ప్రపంచంలోని 40% వృక్ష జంతుజాలంపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది. వీటి పరిష్కారానికి ప్రభుత్వ సంస్థలు, స్థానిక సంఘాలు, అంతర్జాతీయ సంస్థల నుండి సమన్వయ ప్రయత్నాలు అవసరం.


**కింజరాపు అమరావతి**
**9494588909**


# స్థానిక కోటా రద్దు.. మెడికల్ పీజీ సంకటం




ఈ రోజుల్లో ఎంబీబీఎస్ మాత్రమే చేస్తే వైద్య విద్య చదివినట్టు కాదు. పీజీ సర్టిఫికెట్ జోడింపు ఉంటేనే గుర్తింపు, గౌరవమే కాదు.. ఉద్యోగమూ లభిస్తుంది. కానీ మెడికల్ పీజీ విద్యావకాశాలు రాష్ట్ర విద్యార్థులకు అంతకంతకూ తగ్గిపోతుండటం ఆందోళన కలిగిస్తున్నది. స్థానికత ఆధారంగా కల్పించే రిజర్వేషన్లను తాజాగా సుప్రీంకోర్టు రద్దు చేయడంతో విద్యార్థుల ఆశలపై నీళ్లు చల్లినట్టయింది. జనవరి 29న వెలువరించిన ఆ తీర్పులో స్థానికత అనే ప్రాతిపదిక రాజ్యాంగం ప్రకారం 'ఆమోదయోగ్యం కాదని' సర్వోన్నత న్యాయస్థానం అభిప్రాయపడింది. చట్టం ముందు అందరూ సమానులేననే రాజ్యాంగం లోని 14వ అధికరణానికి స్థానిక కోటా విరుద్ధమని తెలిపింది. సుదూర పర్యవసానాలతో కూడిన ఈ తీర్పుతో తెలంగాణ వైద్య ప్రవేశాల రూపురేఖలే మారిపోతాయి. వచ్చే ఏడాది నుంచి స్థానిక కోటా లేకుండానే ప్రవేశాలు కల్పించాల్సి ఉంటుంది.

దార్శనిక నేత కేసీఆర్ రాష్ట్ర పగ్గాలు చేపట్టగానే వైద్యవిద్యపై ప్రత్యేక దృష్టి పెట్టారు. రాష్ట్రంలో నాణ్యమైన వైద్యసేవలు అందుబాటులోకి తేవాలంటే వైద్యవిద్యా వ్యవస్థ విస్తరణే మార్గమని ఆలోచించారు. వైద్యవిద్య కేవలం రాజధాని ప్రాంతానికే పరిమితం కారాదని, ప్రతి జిల్లాకు ఒక వైద్య కళాశాల ఉండాలని సంకల్పించారు. ఎన్నో వ్యయప్రయాసలకోర్చి ఆగమేఘాల మీద వాటిని అభివృద్ధి చేశారు. ఫలితంగా రాష్ట్రంలో వైద్యవిద్యా వ్యవస్థ అంచెలంచెలుగా ఎదిగింది. స్వరాష్ట్రం ఏర్పడే నాటికి కేవలం 5 మాత్రమే ఉన్న ప్రభుత్వ వైద్య కళాశాలల సంఖ్య ఇప్పుడు 33కు పెరిగిందంటే అది కేసీఆర్ దూరదృష్టి వల్లనే సాధ్యపడిందనేది ప్రత్యక్ష సత్యం. ఉన్నత వైద్యవిద్య కూడా అన్నిచోట్లా అందుబాటులోకి తేవాలనే సదాశయంతో పీజీ అప్‌గ్రేడ్ కూడా ప్రవేశపెట్టారు. వైద్యవిద్యకు వైద్యశాలల అనుబంధం తప్పనిసరి. దాంతో దవాఖానల ఆధునీకరణ కూడా చేపట్టారు. ధనిక-పేద, పట్టణ-గ్రామ అనే తేడాలు సమసిపోయి అందరికీ డాక్టరు చదువు అందుబాటులోకి వచ్చింది. దీనినే తెల్లకోటు విప్లవమని కూడా పిలుస్తున్నారు. ఇప్పుడు స్థానికత అనేది తొలగిస్తే పరిస్థితి తారుమారవుతుంది. కేసీఆర్ కలలు కన్న ఆరోగ్య తెలంగాణ ఆగమాగం అవుతుంది. ప్రాంతీయ ప్రయోజనాల కోసం కొట్లాడి సాధించుకున్న రాష్ట్రంలో స్థానికతే లేకుండా పోవడం పెద్ద సమస్యే.

సుప్రీం తీర్పు వల్ల తెలంగాణతో పాటు యావత్ దక్షిణాదిపై ప్రభావం పడుతుంది. స్థానికత లేకుండా చేస్తే ఉత్తరాది వారికి అవకాశాలు పెరిగి, దక్షిణాది వారికి అవకాశాలు తగ్గిపోతాయి. అత్యాధునిక వైద్య విద్యా వ్యవస్థలను అభివృద్ధి చేసిన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు వంటి రాష్ట్రాల్లోని స్థానిక విద్యార్థులు అవకాశాలు కోల్పోవాల్సి వస్తుంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు ఎక్కువ నష్టం జరుగుతుందనేది మరో వాదన. ఎంబీబీఎస్ పూర్తిచేసి గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే 'ఇన్ సర్వీస్' అభ్యర్థుల కోటా కూడా రద్దయిపోతుంది. మొత్తంగా రాష్ట్రంలో వైద్యసేవల నాణ్యత, అందుబాటు అనేవి కూడా క్రమంగా తగ్గిపోతాయి. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం తగిన స్థాయిలో మదింపు జరిపి, రాజ్యాంగ ధర్మాసనానికి అపీలు చేయడంతో సహా అన్ని ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాల్సి ఉన్నది.

## కుండలినీ శక్తి నిజంగానే ఉందా?

భక్తి



జిడ్డు కృష్ణమూర్తి ఉపన్యాసాల్లో, సంభాషణలలో 'చైతన్యం' అతి ముఖ్యమైన అంశం. 'యోగః చిత్త వృత్తి నిరోధః' అని పతంజలి మహర్షి అష్టాంగ యోగాన్ని నిర్వచించాడు. చైతన్యంలో పుట్టి, నిరంతరం చలనంలో ఉండే వృత్తుల్ని నిరోధించడాన్ని, అం టే... వాటిని అరికట్టే లేదా నిర్మూలించే సాధనను 'యోగం' అంటారని అర్థం. అయితే 'చిత్తం అంటే ఏమిటి?' అనే ప్రశ్నకు పతంజలి యోగసూత్రాల్లో మనకు జవాబు దొరకదు. 'నేను ఎవరిని?', 'ఈ ప్రపంచం ఏమిటి?' అనే రెండు మౌలికమైన ప్రశ్నలు అర్థం కావాలంటే... చైతన్యం అంటే ఏమిటో అర్థం చేసుకోవాలి. కాబట్టి చిత్తం లేదా చైతన్యం ప్రాక్పశ్చిమ తత్త్వశాస్త్రాలలో అతి ముఖ్యమైన విషయం. మన అనుభవాలన్నిటికీ ఇదే రంగస్థలం. పాయసంలో రుచిని, గులాబీలో పరిమళాన్ని, వేణునాదంలో మాధుర్యాన్ని, ఉదయిస్తున్న సూర్యుడిలో రంగులను జ్ఞానేంద్రియాలు గ్రహిస్తున్నప్పటికీ... అవి అనుభవం అయ్యేది చైతన్యంలోనే. మన సంకల్పాలకు, ఆలోచనలకు, రాగద్వేషాలకు, సుఖదుఖాలకు, వినయం, మదం లాంటి గుణాలకు చైతన్యమే వేదిక. దీని పర్యాయ పదాలైన 'మనసు, బుద్ధి, చిత్తం, హృదయం' లాంటివి మన మాటల్లో తరచు దొర్లుతూ ఉంటాయి.

**అది కేవలం ఒక మిష**

ఆధ్యాత్మిక సాధన అంతా చైతన్యపరమైనదే. మనిషి చైతన్యంలో కుండలినీ అనే అనంతమైన శక్తి ఒకటి ఉంటుంది, దాన్ని సాధన ద్వారా మేల్కొల్పవచ్చునని మన సంప్రదాయం చెబుతోంది. "కుండలినీ శక్తి నిజంగానే ఉంటుందా?..." కృష్ణమూర్తితో జరిపిన సంభాషణల్లో పుపుల్ జయకర్ లాటి మేధావులు ఈ ప్రశ్న వేశారు. "అవును, చైతన్యంలో అనంతమైన, నిత్యనూతనమైన, అక్షయమైన శక్తి ఒకటి ఉంటుంది" అనేది కృష్ణమూర్తి జవాబు. "అయితే మనకు అనంతమైన ఈ చైతన్యంలో ఒక చిన్న భాగం మాత్రమే అందుబాటులో ఉంటుంది. 'నేను' అనే అహంభావం, అది సృష్టించిన 'నేను-నువ్వు' అనే విభజన (అంటే ద్వైతం), ఆ 'నేను' చుట్టూ పేరుకున్న కుహనా మనుగడ... ఇవన్నీ చైతన్యాన్ని ఆవరిస్తాయి. అందువల్ల మనకు మన చైతన్యం సంపూర్ణంగా అందుబాటులో ఉండదు. చైతన్యాన్ని శుభ్రపరిస్తే ఈ శక్తి మేలుకొనే అవకాశం ఉంటుంది. సంప్రదాయం చెప్పే సాధన అందుకు పనికిరాదు" అంటారు కృష్ణమూర్తి. అబద్ధాలు, అవినీతి, అసూయ లాంటి వాటితో నిండిన జీవితాన్ని గడుపుతూ కుండలినీ శక్తిని మేల్కొల్పాలనే ఉద్దేశం హాస్యాస్పదం, కేవలం ఆధ్యాత్మిక వ్యాపారానికి ఒక మిష. చైతన్యాన్ని సంపూర్ణంగా శుభ్రపరచడం ఒక్కటే ఈ శక్తిని మేలుకొలుపగలిగే మార్గం. అంటే దానిలో ఎలాటి ఆలోచనలకు, జ్ఞాపకాలకు... అంటే గతంతో ముడిపడిన అనుభవాలకు, సంకల్పాలకు, మంత్రాలకు, ఉపదేశాలకు, జపాలకు (ఇవన్నీ ఆలోచనల ప్రతిరూపాలే)... చివరకు 'కుండలినీ శక్తిని మేలుకొలపాలి' అనే ఆలోచనకు కూడా తావు లేకుండా చూడాలి.

నిరంతర ప్రక్రియ

చైతన్యాన్ని శుభ్రపరిచే ఈ ప్రక్రియను 'ధ్యానం' (మెడిటేషన్) అంటారు కృష్ణమూర్తి. ఈ ధ్యానం పక్షమో, మాసమో, ఆరునెలలో చేసే పునశ్చరణ కాదు. ఇది 24 గంటలూ నిర్విరామంగా, అత్యంతమైన అప్రమత్తతతో జరిగే మానసిక ప్రక్రియ. చైతన్యాన్ని సంపూర్ణంగా శుభ్రపరచడం వరకే మన ప్రయత్నం పరిమితమై ఉంటుంది. కుండలినీ శక్తి తాలూకు జాగృతి మన చేతిలో ఉండదు. ఇంటిని శుభ్రం చేసి కిటికీలు, తలుపులు తెరిస్తే గాలి లోపలికి వచ్చే అవకాశం ఉంటుంది. గాలిని మనం నిర్బంధించలేం. కుండలినీ శక్తి కూడా అంతే



## చిల్లీతో... రుచి రుచిగా

**కావాల్సిన పదార్థాలు:** పెద్ద సైజులో ఉన్న పచ్చి మిరపకాయలు- 8, శనగపిండి- ఒక కప్పు, కొబ్బరి కోరు- రెండు చెంచాలు, పసుపు- చిటికెడు, ధనియాల పొడి- ఒక చెంచా, జీలకర్ర పొడి- అర చెంచా, ఉల్లిపాయ ముక్కలు- అర కప్పు, వెల్లుల్లి ముక్కలు- ఒక చెంచా, అల్లం ముక్కలు- ఒక చెంచా, టమోటా పేస్ట్- రెండు చెంచాలు, నూనె- పావు కప్పు, పంచదార- అర చెంచా, ఉప్పు- తగినంత, నీళ్లు- తగినన్ని

తయారీ విధానం: ఒక గిన్నెలో ధనియాల పొడి, శనగపిండి వేసి ముద్దగా చేయాలి.
పచ్చి మిరపకాయలను మధ్యలోకి చీల్చాలి. దానిలో ఉన్న గింజలన్నీ తీసివేయాలి. దీని మధ్యలో శనగపిండి ముద్దను కూరాలి.
ఒక మూకుడులో నూనె వేసి వేడి చేయాలి. దానిలో పచ్చి మిరపకాయలను వేయించాలి. వాటిని పక్కన పెట్టుకోవాలి.
మిగిలిన నూనెలో ఉల్లిపాయ ముక్కలు, వెల్లుల్లి ముక్కలు వేసి వేయించాలి. ఇవి దోరగా వేగిన తర్వాత వాటిలో పసుపు, జీలకర్ర పొడి, టమోటా పేస్ట్ వేసి బాగా కలపాలి. రెండు నిమిషాలు ఉడికించాలి. ఆ తర్వాత ఉప్పు, పంచదార వేయాలి. ఈ మిశ్రమంలో కొద్దిగా నీళ్లు పోయాలి. కొద్దిగా చిక్కపడిన తర్వాత దానిలో వేయించిన పచ్చి మిరపకాయలను వేయాలి. జాగ్రత్తలు..ఎక్కువ కారం లేకుండా ఉన్న పెద్ద మిరపకాయలు మార్కెట్లో లభ్యమవుతాయి. ఈ కూర వాటితో చేస్తే బావుంటుంది.


నవభూమి

www.navabhoomi.in
www.epaper.navabhoomi.in

5 హైదరాబాద్ ఆదివారం 02 ఫిబ్రవరి 2025


# ఖఫ్తాన్ శారీతో కొత్తగా...



ఫ్యాషన్ డ్రెస్‌లు సౌకర్యానికి పెద్ద పీట వేస్తాయి. అలాగని సంప్రదాయాన్ని వదిలిపెట్టవు. అందుకే అవంటే అందరూ మోజు పడుతుంటారు. ఇలాంటి ఫ్యాషన్ ప్రపంచంలోకి 'ఖఫ్తాన్ శారీస్' మేమున్నామంటూ వచ్చేశాయి. మహిళలకు విపరీతంగా నచ్చేశాయి. ఒకవైపు చీరలా కనిపిస్తూ మరోవైపు అందమైన కుర్తీని గుర్తుకు తెస్తూ ఇండోవెస్ట్రన్ లుక్‌తో అందరినీ ఆకట్టుకుంటున్నాయి. చీర అంటే ఇష్టం ఉన్నప్పటికీ కట్టుకోవడానికి ఇబ్బంది పడే యువతులకు ఈ ఖఫ్తాన్ శారీ వరం లాంటిది.

ఖఫ్తాన్ శారీని కాటన్, పట్టు, చందేరీ సిల్క్, జార్జెట్, టస్సర్... ఇలా ఏ రకం ఫ్యాబ్రిక్ చీరతోనైనా రూపొందించవచ్చు.

వీటి తయారీ విషయానికి వస్తే... చక్కని చీరకు కుచ్చిళ్లు సెట్ చేసి... లెహంగా మాదిరి కుట్టేస్తారు. కొంగులో కొంత భాగాన్ని కుర్తీలా కుట్టి, మిగిలినదాన్ని భుజాలమీదుగా వేలాడేలా జతచేస్తారు. చీర కొంగుకు ఉన్నట్టే కుర్తీని కూడా స్లైప్స్‌తో రూపొందిస్తున్నారు! ఇలాంటివి చిన్న పార్టీల్లో వేసుకోవడానికి బాగుంటాయి.

కుర్తీకి కాలర్, స్టార్, వి, రౌండ్ నెక్ డిజైన్‌లను అమరుస్తున్నారు. నెక్ డిజైన్‌ను అనుసరించి బటన్స్ కూడా అమరుస్తున్నారు. వీటితోపాటు చక్కని ఎంబ్రాయిడరీ, సీక్వెన్స్, జర్దోసీ వర్క్‌లు చేసిన ఖఫ్తాన్ శారీలను మహిళలు ఎక్కువగా ఇష్టపడుతున్నారు.

కుర్తీ పొట్టిగా ఉన్నపుడు నడుము భాగంలో బెల్ట్ పెట్టుకుంటే చీర కట్టుకున్నట్లే కనిపిస్తుంది. అదే పొడవుగా ఉంటే లాంగ్ గౌన్ లుక్ వస్తుంది.

ఖఫ్తాన్ శారీ ధరించినపుడు ఎక్కువగా ఆభరణాల అవసరం ఉండదు. చిన్న గొలుసు, ఒక ఉంగరం, చక్కని స్టడ్స్ ఉంటే చాలు. అలాగే ప్రత్యేకమైన హెయిర్ స్టయిల్ కూడా అక్కర్లేదు. ఎంత సాధారణంగా ఉంటే అంత హుందాగా కనిపిస్తారు. కేవలం ఈ డ్రెస్ స్టయిల్ ఒక్కటే అందరినీ చూపు తిప్పుకోనివ్వకుండా చేస్తుంది.



# బాల్యంలోకి తొంగిచూద్దామా!

**కార్పొరేట్ ప్రపంచంలో 'పని ఒత్తిడి' కామన్ అయిపోయింది. ఉద్యోగుల మానసిక, శారీరక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నది. ఈ క్రమంలో.. 'కిడల్టింగ్' వారికి భరోసా ఇస్తున్నది. పాశ్చాత్య దేశాల్లో ఎప్పటినుంచో ఉన్న ఈ ట్రెండ్.. మన దగ్గర ఇప్పుడిప్పుడే ప్రాచుర్యం పొందుతున్నది. పెద్దవాళ్లను బాల్యంలోకి తీసుకెళ్లే ఈ నయా ట్రెండ్ సంగతులివి..**



పార్క్‌లో వాకింగ్ చేస్తున్నప్పుడు.. పిల్లల ప్లేగ్రౌండ్‌లో ఒకరిద్దరు పెద్దవాళ్లు కనిపిస్తుంటారు. ఊయల ఊగుతూ.. ట్యాస్లైడింగ్‌పై నుంచి జారుతూ.. పిల్లల్లో చిన్నపిల్లల్లా కలిసిపోయి.. ఆడుకుంటూ ఉంటారు. ఆ క్షణం.. తమకున్న అన్ని టెన్షన్లనూ పక్కన పెట్టేస్తారు. మనస్తత్వ నిపుణులు చెబుతున్న 'కిడల్టింగ్ ట్రెండ్' అదే! పిల్లలతో కలిసి సైకిల్ తొక్కడం, బొమ్మలు గీయడం, క్యారమ్స్ ఆడటం, లెగోస్‌తో బొమ్మలు చేయడం.. ఇలాంటి చిన్ననాటి ఆటలు, పెద్దవాళ్ల గతాన్ని తవ్వితీస్తాయి. తాము స్వేచ్ఛగా, ఆనందంగా గడిపిన సమయంలోకి తీసుకెళ్తాయి. బాల్య జ్ఞాపకాల్ని తట్టిలేపుతాయి.

ముఖ్యంగా నెలవారీ టార్గెట్‌లు, ఆడిట్ లాంటి ఒత్తిడిని పెంచే పనులు ఉన్నప్పుడు.. 'కిడల్టింగ్' ఉపశమనం ఇస్తుందని మానసిక నిపుణులు అంటున్నారు. వాకింగ్ తర్వాత కాసేపు పార్కులోనే ఆడుకోవడం, బోర్డ్ గేమ్‌లలో మునిగిపోవడం వంటి ఏ రకమైన చర్య అయినా.. మిమ్మల్ని ఉత్సాహపరుస్తుంది. అంతేకాకుండా.. చిన్నపిల్లల్లా ఆనందించడం వల్ల వారిలో 'నోస్టాల్జియా' భావాలు పెరుగుతాయి. ఇవి గతానికి- వర్తమానానికి మధ్య బలమైన సంబంధాన్ని ఏర్పరుస్తాయి. బాధలో ఉన్నవారికి ఓదార్పునిస్తాయి. భరోసానిస్తాయి. మానసిక ఆరోగ్యానికీ ఎంతో మేలుచేస్తాయి. కిడల్టింగ్.. శరీరంలో డోపమైన్ ఉత్పత్తిని పెంచుతుందట. ఇది.. మనిషిలో ఒత్తిడి, విచారం, కోపం, ఆందోళనను తగ్గిస్తుందట.

సంస్థల ప్రోత్సాహం కూడా..

కొన్ని కార్పొరేట్ సంస్థలు కూడా పెద్దవాళ్లను కిడల్టింగ్ దిశగా ప్రోత్సహిస్తున్నాయి. అమెరికాలో టాయ్ అసోసియేషన్ ఓ సర్వే నిర్వహించింది. అక్కడ పిల్లల బొమ్మలు, ఆట వస్తువులను కొనుగోలు చేసిన 2,000 మంది తల్లిదండ్రుల నుంచి వివరాలు సేకరించింది. వారిలో 58 శాతం మంది.. పిల్లల కోసం కాకుండా, తమ కోసమే బొమ్మలు, ఆట వస్తువులు కొనుగోలు చేశారని నివేదించింది. యునైటెడ్ కింగ్‌డమ్‌లోని ప్రధాన నగరాల్లో పెద్దలు ఆడుకునేలా 'బల్లీ బాలర్సన్' కేంద్రాలను ఏర్పాటుచేశారు. వీటిని ప్రతినెలా వేలాదిమంది సందర్శిస్తున్నారు కూడా! మరెందుకు ఆలస్యం.. ఆఫీస్, ఆర్థిక, కుటుంబ సమస్యలన్నీ మరిచిపోండి. రోజులో కొంత సమయమైనా చిన్నపిల్లల్లా గడపండి. మళ్లీ బాల్యంలోకి వెళ్లండి.. ఒత్తిడిని జయించండి.

## పత్రికలతో డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌కు

# విడదీయలేని బంధం

**రచనల ద్వారా సమాజ చైతన్యానికి ఆయన కృషి**

**భావ ప్రకటన స్వేచ్ఛకు పట్టం కట్టిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్**

**మూక్ నాయక్ పత్రికా ఏర్పాటు చేసి 105 సంవత్సరాలు**

భారతదేశం పూర్తిగా బ్రిటిష్ పరిపాలన ఉండి పోయి భావ ప్రకటన స్వేచ్ఛ భారతీయులకు స్వేచ్ఛ కరువైంది . స్వతంత్ర సమరంలో భాగంగా ఆనాటి స్వాతంత్ర సమరయోధుడు స్వతంత్ర పోరాటానికి ప్రజలను సన్నద్ధం చేయడానికి భారతదేశంలో ప్రాంతాలవారీగా పత్రికలను నడిపించారు . లైబ్రరీలను కూడా ఏర్పాటు చేసి గ్రామ గ్రామాన స్వతంత్ర సంగ్రామానికి సన్నద్ధులను చేశారు.

ఇదే క్రమంలో భారతదేశంలోనే ఉంటూ అంటరాని వారికీ ఏ రకమైన హక్కులకు అధికారాలకు అవకాశాలకు నోచుకోలేదు డిప్రెస్ డు క్లాసెస్ గా ఉన్న అణగారిన ప్రజల కోసం భారతదేశంలో మొట్టమొదటిసారి డాక్టర్ భీమ్రావు అంబేద్కర్ పత్రికా నడిపించాలని ముందుకు వచ్చారు. ఆలోచన ఉన్నా కూడా కరుడుగట్టిన పేదరికం ఉండడంతో ఆర్థిక సహాయం లేని కారణంగా చాలా కాలం పాటు ఆలోచన కార్యరూపం దాల్చలేదు. విషయం తెలుసుకున్న బరోడా సంస్థల మహారాజు స్వాహు మహారాజ్ ఆర్థిక సహాయంతో "" మూక్ నాయక్ " మరాఠీ పత్రికను మూగవారికి నాయకుడని తెలుగులో అర్థం 31 జనవరి 1920 న ప్రారంభించారు . ఇప్పటికీ పత్రిక ప్రారంభించిది. మూక్ నాయక్ ' పత్రిక కు జనవరి 31తో 105 ఏళ్ళు గడుస్తుంది .దళిత జాతులకు సాంఘిక, రాజకీయ అవగాహన కల్పించడం కోసం అంబేద్కర్ నడిపిన పత్రిక మూక్ నాయక్.

దేశంలో మొదటి ది ఈ పత్రిక 1920 జనవరి 31న పక్షపత్రిక గా ప్రారంభమైంది.

దీని ప్రచురణకు ముందు, ఈ పత్రిక విషయం ప్రజలకు తెలియజేయడానికి, అప్పట్లో ఏ పత్రిక కూడా ఒప్పుకో లేదంటే, పరిస్థితులను అర్థం చేసుకోవచ్చు.

అంటే, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ స్థాపిస్తున్న మూక్ నాయక పత్రిక ప్రకటనను వేయడానికి, అప్పట్లో ఎవరు ముందుకు రాలేదు. స్వరాజ్యం నా జన్మ హక్కు' అంటూ జబ్బలు చర్చుకున్న బాలగంగాధర తిలక్ నడుపుతున్న' కేసరి' పత్రిక కూడా అంబేద్కర్ మూక్ నాయక్ ప్రకటనను వేయడానికి నిరాకరించింది. దీనిని బట్టి స్వాతంత్ర ఉద్యమ కాలంలో నడిచిన పత్రికలు దళిత వర్గాల అభివృద్ధి పట్ల ఎంత దారుణంగా వ్యవహరించాయో తెలుసుకోవచ్చు. కింది జాతులకు పత్రికలు ఉండడం వారు రాజకీయ సాంఘిక విషయాలను అర్థం చేసుకోవడం అప్పుడే కాదు, ఇప్పుడు కూడా ఈ సమాజానికి ఇష్టం లేదు. డాక్టర్ అంబేద్కర్ స్థాపించిన' మూక్ నాయక్' ఎన్నో విషమ పరిస్థితులను ఎదుర్కొన్నది. ఈ పత్రిక అంబేద్కర్ అభిప్రాయాలను ఎప్పటికప్పుడు ప్రకటించేది.

కింది కులాల పట్ల వివక్ష చూపే హిందూ సమాజాన్ని విమర్శించడం, దళితులకు ప్రోత్సాహాన్ని ఇవ్వడం, వారు నిర్వహించాల్సిన కర్తవ్యాన్ని ఉపదేశించటం అన్నీ ఈ పత్రిక ద్వారానే జరిగేవి. హిందూ సమాజంలో వర్ణాలు నాలుగు కాదు. మూడే. బ్రాహ్మణులు, బ్రాహ్మణ ఇతరులు, అస్పృశ్యులు' అన్నారు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్.

భారతదేశానికి రాజకీయ స్వాతంత్రం వస్తే, అది ఈ అందరికీ రావాలి. ఆర్థిక ,సామాజిక రంగాలలో సమానత్వం అందరికీ ఉండాలి' అని మూక్ నాయక పత్రిక ద్వారా ప్రకటించాడు డాక్టర్ అంబేద్కర్. బ్రిటిష్ వాళ్ళని ఎదుర్కోవడం భారతీయులకు ఎంత న్యాయ సమ్మతంగా కనిపిస్తుందో, బ్రాహ్మణులను ఎదుర్కోవడం దళిత జాతులకు అంత సమంజసం గానూ, న్యాయ సమ్మతం గానూ చూస్తున్నదని అంబేద్కర్ చెప్పాడు.

కనీస ప్రాథమిక హక్కులే లేని దళిత జాతులకు స్వరాజ్యం అనవసరం. బ్రిటిష్ పాలకవర్గం పోతే హిందువుల చేతుల్లో వారు మరోరకమైన బానిసత్వాన్ని అనుభవిస్తారన్న సత్యం ఆయన చాటి చెప్పారు. ఈ పత్రిక నడిపే నాటికి అంబేద్కర్ వర్ణవ్యవస్థను గురించిన పోరాటానికి పూర్తి సన్నద్ధంగా లేదు. దానికి రెండు కారణాలు ఉన్నాయి.


మొదటిది ఆయన ప్రభుత్వ కళాశాలలో ప్రొఫెసర్ గా ఉండడం.

రెండోది, ఆయన లండన్ చదువు పూర్తి కాకపోవడం. చదువు పూర్తయితే తప్ప ఆయన రంగంలోకి దిగదల్చుకోలేదు.

ఈ నేపథ్యంలో అంబేద్కర్ మూక్ నాయక్ పత్రిక నిర్వహణలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నాడు.

అప్పటి తన అభిప్రాయాలను స్పష్టంగా వెల్లడి చేయడానికి ఈ పత్రికను ఉపయోగపెట్టాడు.

భారతదేశంలోనే అక్షరాస్యత తక్కువగా ఉంది అందులోనూ అణగారిన వర్గాల వారికి అసలు చదివే లేదు ! అయితే తమ వారు చదువుకున్న తమ సమస్యలను అంటరానితనం




వివక్షతను తాము ఎదుర్కొంటున్న వాటిని పత్రికల ద్వారా బయట ప్రపంచానికి తెలియజేయాలని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సంకల్పించారు . అప్పటికే ఆయన చాలా ఇంగ్లీష్, హిందీ, మరాఠి పత్రికలకు వ్యాసాలు కూడా రాసేవారు . అంబేద్కర్ సారథ్యంలో నిర్వహిస్తున్న మూ క్ నాయక్ ఈ పత్రిక ఎక్కువకాలం నడవలేదు.

**సమతా పత్రిక ఏర్పాటు**

సమాజంలో ప్రజలందరూ సమానంగా ఉండాలని తమ సమస్యలను బయట ప్రపంచానికి తెలియజేయడం కోసం ముందుగా బాబా సభ అంబేద్కర్ 1919 లో సమతా సైనికుడా ఏర్పాటు చేశారు. దానికి అనుబంధం గానే సమతా పత్రికను ఏర్పాటు చేశారు కానీ అంతగా ప్రచారం రాలేదు.

**బహిష్కృత భారత్ ఏర్పాటు**

సమత , మూ క్ నాయక్, పత్రికల్లో తర్వాత కాలంలో డాక్టర్ అంబేద్కర్ ఏప్రిల్ 3న 1927 బహిష్కృత భారత్ పక్ష పత్రికను ప్రారంభించారు. ఇందులో ప్రధానంగా మహారాష్ట్రలోని చౌదరీ చెరువు మీరు తాగడానికి వచ్చిన సమస్యను అగ్రవర్ణాలకు దళితులకు మధ్య జరిగిన ఘర్షణలను ఎప్పటికప్పుడు తెలియజేయడానికి ఉపయోగపడింది. ఈ సందర్భంగానే డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆవేదన వ్యక్తం చేస్తూ మనిషి మతం కోసం ఉన్నారా ? మతం మనిషి కోసం ఉందా? అంటూ ప్రశ్నించారు. వర్ణ వ్యవస్థ పూర్తిగా మానసిక వ్యాధి అని ప్రతి దళితుడు మతం మానసిక వ్యాధి నుండి బయటకు రావాలని పిలుపునిచ్చారు. ఈ దేశంలో అణగారిన వర్గాల జీవన దుస్థితిపై బహిష్కృత భారత్ విస్తృత ప్రచారం చేసింది . ఈ పత్రికను అంబేద్కర్ అనుయాయులైన దేవరాజు నాయక్, కాంద్రేకర్ లు నడిపించారు . తర్వాత కాలంలో జనతా పత్రికను ప్రారంభించారు.




ఆ తర్వాత కాలంలో ఆంగ్లంలో పీపుల్స్ హెరాల్డ్ అనే పత్రికను నిర్వహించారు . ఇలా అంబేద్కర్ తాత్విక సిద్ధాంతాన్ని ప్రచారం చేయడానికి అప్పట్లో ఈ పత్రికలు ఎంతగానో ఉపకరించాయి. ఇంకొక దురదృష్టం ఏంటంటే, అంబేద్కర్ పట్ల, కింది వర్గాల అభివృద్ధి పట్ల అప్పటినుంచి ఇప్పటివరకు, మీడియా ధోరణి ఏమీ మారలేదు. పత్రికలు పెట్టుబడిదారీ విష పుత్రికలని శ్రీ శ్రీ అన్నట్టుగానే, పెట్టుబడిదారులు, వాళ్ళ అనుబంధం రాజకీయ పార్టీల కరపత్రాలు గా ఇప్పటి మీడియా నిస్సిగ్గుగా వ్యవహరిస్తున్నది.

**రాజ్యాంగంలో పత్రికలకు ప్రత్యేక హక్కులు కల్పించిన డాక్టర్ అంబేద్కర్**

రాజ్యాంగంలో ఉన్న ఫోర్త్ ఎస్టేట్ అయిన మీడియాకు దారి చూపిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ని మీడియా దారిలో కనపడకుండా చేయటం లక్ష్యంగా మెయిన్ స్ట్రీమ్ మీడియా తన వంతు ప్రయత్నాన్ని ఎప్పటికప్పుడు కొత్త కొత్తగా చేస్తూనే ఉంది.

రాజ్యాంగంలో , పొలిటికల్, ఎగ్జిక్యూటివ్, జుడిషరీ కి అన్నింటినీ రాజ్యాంగ పరిధిలోకి తీసుకొచ్చిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పత్రికలకు మాత్రం స్వేచ్ఛ కల్పించారు. ఆ భావ ప్రకటన స్వేచ్ఛ ద్వారానే నేడు పత్రికలు నడుస్తున్నాయి. ప్రస్తుతం పత్రికలో నడుస్తున్న తీరు తెనులు మనందరికీ తెలుసు. సామాజిక న్యాయం ప్రజల కోసం కాకుండా పెట్టుబడిదారులు, రాజకీయ పార్టీలు వాళ్లకోసం పత్రికలు నడుపుతున్నారు. చాలా తక్కువ మంది మాత్రమే దళిత వర్గాల నుండి పత్రికా రంగంలో పనిచేస్తున్న వారు ఉన్నారు . సంస్థలు నడిపిస్తున్న వారు అంతకన్నా తక్కువగా ఉన్నారు. ఆ ఉన్న వారికి కూడా బాబా సాహెబ్ అంబేద్కర్ కల్పించిన హక్కు మాత్రమే అది. మీడియాలో పనిచేస్తున్న దళిత వర్గాలకు సైతం

తమ చేతుల్లో అక్షరాన్ని, పెన్ను, పుస్తకం ని పెట్టిన మహనీయుడు స్థాపించిన పత్రిక గురించిన కనీస సమాచారం కూడా మెజారిటీ దళిత జర్నలిస్టులకు తెలియకపోవడం శోచనీయం. బాబా సాహెబ్ అంబేద్కర్ కు పత్రికలతో విడదీయరాని బంధం ఉంది. ఆయన తన రచనల ద్వారా సమాజాన్ని చైతన్య పరిస్థితితోపాటు పత్రికా రంగంలో కూడా వివిధ స్థాయిలో ఎప్పటికప్పుడు సమాజ హితం కోసం కృషి చేశారు.




**అస శ్రీరాములు**
**సీనియర్ జర్నలిస్ట్**
**9440037196**

# ఒడిదొడుకుల మధ్య ఫ్లాట్‌గా ముగిసిన స్టాక్ మార్కెట్లు..!



**న్యూఢిల్లీ- నవభూమి:** కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశ పెట్టిన 2025-26 కేంద్ర బడ్జెట్ నేపథ్యంలో దేశీయ స్టాక్ మార్కెట్‌లో ఫ్లాట్‌గా ముగిశాయి. శనివారం ఉదయం లాభాలతో ప్రారంభమైనా.. తిరిగి నష్టాల్లోకి పడిపోయాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ-30 ఇండెక్స్ సెన్సెక్స్ స్వల్పంగా 5.39 పాయింట్లు లాభంతో 77,505.96 పాయింట్ల వద్ద ముగిసింది. అంతర్గత ట్రేడింగ్‌లో 77,899.05 పాయింట్ల గరిష్టానికి చేరుకుని.. తిరిగి 77,006.47 పాయింట్ల కనిష్ట స్థాయికి పతనమైంది. ఎన్ఎస్ఈ-50 సూచీ నిఫ్టీ 26.25 పాయింట్ల లబ్ధితో 23,482.15 పాయింట్ల వద్ద స్థిర పడింది. ఇంట్రా డే ట్రేడింగ్‌లో 23,632.45 పాయింట్ల గరిష్టానికి దూసుకెళ్లి.. తిరిగి 23,318.30 పాయింట్ల కనిష్ట స్థాయికి పతనమైంది. బీఎస్ఈ-30లో జొమాటో ఏడు శాతానికి పైగా లబ్ధి పొందగా, ఐటీసీ హోటల్స్, ఐటీసీ, మహీంద్రా అండ్ మహీంద్రా, ఏషియన్ పెయింట్స్, టైటాన్, ఇండస్ఇండ్ బ్యాంక్ తదితర స్టాక్స్ లాభ పడ్డాయి. మరోవైపు పవర్ గ్రిడ్, ఎల్ అండ్ టీ, ఎన్టీపీసీ, అల్ట్రాటెక్ సిమెంట్, హెచ్‌సీఎల్ టెక్, టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, అదానీ పోర్ట్స్ నష్టాలతో ముగిశాయి. శుక్రవారం వరకూ దేశీయ స్టాక్ మార్కెట్లలో విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.1,188.99 కోట్ల విలువైన షేర్లు కొనుగోలు చేశారు. గ్లోబల్ క్రూడాయిల్ బెంచ్ మార్క్ బ్రెంట్ క్రూడ్ బ్యారెల్‌పై 0.29 శాతం తగ్గి 76.67 డాలర్ల వద్ద తచ్చాడుతున్నది.




# కేంద్ర బడ్జెట్.. గిగ్ వర్కర్లకు గుడ్ న్యూస్ చెప్పిన ఆర్థిక మంత్రి



**న్యూఢిల్లీ- నవభూమి:** ప్రస్తుతం జొమాటో, స్విగ్గీ, జెప్టో, అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి ఆన్‌లైన్ డెలివరీ సంస్థలు ప్రజలకు విశేష సేవలందిస్తున్నాయి. తమకు కావాల్సిన సరకులు, ఫుడ్ వంటివి వీటి ద్వారా ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేస్తే ఇంటికే డెలివరీ చేస్తున్నారు. అయితే, ఆన్‌లైన్ ఫుడ్, గ్రాసరీ వంటి ఆన్‌లైన్ డెలివరీ యాప్స్‌లో వర్క్ చేసే వర్కర్లకు ఇప్పటి వరకూ ఎలాంటి ఉద్యోగ భద్రతా లేదు. ఈ క్రమంలో తాజా బడ్జెట్‌లో కేంద్రం వారికి గుడ్ న్యూస్ చెప్పింది. గిగ్ వర్కర్ల కు ఆరోగ్య బీమా సౌకర్యంతో పాటు గుర్తింపు కార్డులు ఇవ్వాలని నిర్ణయించింది. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఇవాళ బడ్జెట్ స్పీచ్‌లో ఈ మేరకు ప్రకటించారు. ఈ-శ్రమ్ పోర్టల్ కింద గుర్తింపు కార్డులు, పీఎం జన్ ఆరోగ్య యోజన కింద ఆరోగ్య బీమా కల్పించనున్నట్లు వివరించారు. ఈ నిర్ణయంతో కోటి మంది గిగ్ వర్కర్లకు ప్రయోజనం కలగనుంది.

# బంగారం భగభగ.. పదిగ్రాముల ధర రూ.85 వేలు



**న్యూఢిల్లీ- నవభూమి:** బంగారం భగభగమండుతున్నది. రోజుకొక రికార్డు స్థాయికి చేరుకుంటున్న పుత్తడి విలువ శుక్రవారం మరో ఉన్నత శిఖరాలకు చేరుకున్నది. అంతర్జాతీయ మార్కెట్లో అతి విలువైన లోహాలకు డిమాండ్ అధికంగా ఉండటంతోపాటు దేశీయంగా కొనుగోళ్లు ఊపందుకోవడంతో ధరలు రికార్డు స్థాయికి చేరుకున్నాయి. దేశ రాజధాని న్యూఢిల్లీ బులియన్ మార్కెట్లో శుక్రవారం ఒకేరోజు 99.9 శాతం స్వచ్ఛత కలిగిన బంగారం ధర రూ.1,100 పెరిగి చారిత్రక గరిష్ఠ స్థాయి రూ.85 వేలకు చేరువైంది. బులియన్ మార్కెట్ ముగిసే సమయానికి పదిగ్రాముల ధర రూ.84,900గా నమోదైంది. ధరలు ఈస్థాయికి చేరుకోవడం ఇదే తొలిసారని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ వర్గాలు వెల్లడించాయి. జనవరి నెలలో బంగారం ధర రూ.5,510 లేదా 7 శాతం ఎగబాకింది. జనవరి 1న పుత్తడి ధర రూ.79,390గా ఉన్నది. అలాగే 99.5 శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల ధర రూ.1,100 అధికమై రూ.84,500 పలికింది. ఇటు హైదరాబాద్‌లోనూ బంగారం పరుగులు పెట్టింది. 24 క్యారెట్ పదిగ్రాముల ధర రూ.1,310 అధికమై రూ.84,330 పలికింది. అంతకుముందు ఇది రూ. 83 వేలుగా ఉన్నది. అలాగే 22 క్యారెట్ విలువ రూ.1,200 ఎగబాకి రూ. 77,300కి చేరుకున్నది.

**వెండి పరుగులు**

పసిడితోపాటు వెండి పరుగులు పెట్టింది. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి కొనుగోళ్లు ఊపందుకోవడంతో వెండి ధర రూ.95 వేలు పలికింది. కిలో ధర రూ.850 పెరిగినట్లు అయింది. అంతకుముందు ఇది రూ.94,150గా ఉన్నది. ఇటు హైదరాబాద్‌లో కిలో వెండి రూ.1,000 ఎగబాకి రూ.1.07 లక్షలు పలికింది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 2,800 డాలర్లు అధిగమించడం వల్లనే దేశీయంగా తొలిసారిగా 84 వేల మార్క్‌ను అధిగమించిందని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీ సీనియర్ ఉన్నతాధికారి సౌమిల్ గాంధీ తెలిపారు. ఫ్యూచర్ ట్రేడ్ మార్కెట్లో ఫిబ్రవరి నెలకుగాను రూ.487 పెరిగి రూ.82,210 పలికిందన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టనున్న సార్వత్రిక బడ్జెట్‌లో అతి విలువైన లోహాలపై సుంకాలు తగ్గిస్తే ధరలు తగ్గే అవకాశాలున్నాయన్నారు. మెక్సికో, కెనడాలపై అమెరికా సుంకాలను విధించడంతో పెట్టుబడిదారులు తమ పెట్టుబడులను సురక్షితమైన బంగారం వైపు మళ్లిస్తుండటం కూడా ధరలు పెరగడానికి ప్రధాన కారణమని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. అలాగే పలు దేశాల సెంట్రల్ బ్యాంకులు వడ్డీరేట్లను తగ్గిస్తుండటం కూడా మరో కారణం.

# ఆ పేషెంట్స్‌కు బిగ్ రిలీఫ్.. ప్రాణాలు కాపాడే మందులు చవకగా..



**న్యూఢిల్లీ- నవభూమి:** బడ్జెట్-2025లో కేంద్ర ప్రభుత్వం పలు ఊహించని సర్‌ప్రైజ్‌లు ఇచ్చింది. ట్యాక్స్ మినహాయింపులతో మధ్యతరగతి ప్రజలకు అదిరిపోయే గుడ్ న్యూస్ చెప్పింది. హెల్త్‌కేర్ సెక్టార్‌కు కూడా ప్రాధాన్యత ఇచ్చిన మోడీ సర్కారు.. ఆ పేషెంట్స్‌కు భారీ ఊరటను ఇచ్చింది. ప్రాణాలు కాపాడే 36 రకాల మందులను చవకగా ఇచ్చేందుకు సిద్ధమైంది. ఆ మెడిసిన్స్‌ను కస్టమ్స్ డ్యూటీ నుంచి మినహాయిస్తున్నట్లు ప్రకటించారు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్.

**కస్టమ్స్ డ్యూటీ ఎత్తివేత**

'క్యాన్సర్‌తో పాటు అరుదైన వ్యాధులతో బాధపడే రోగులకు ఊరటను ఇవ్వడంలో భాగంగా ప్రాణాలు కాపాడే 36 రకాల మందులపై కస్టమ్స్ డ్యూటీని ఎత్తేస్తున్నాం. ఆ ఔషధాలను బేసిక్ కస్టమ్స్ డ్యూటీ (బీసీడీ) నుంచి మినహాయిస్తున్నాం. ఆ లిస్ట్‌లో ప్రాణాలు కాపాడే మరో 6 రకాల మందులను చేరుస్తున్నాం. వీటిపై గతంలో 5 శాతం కస్టమ్స్ డ్యూటీ ఉండేది. ఇప్పుడు వాటిపై కస్టమ్స్ డ్యూటీ ఉండదు. పై అన్ని రకాల మందులను తయారు చేసే సంస్థలకు పన్ను మినహాయింపులు వర్తిస్తాయి' అని నిర్మలా సీతారామన్ చెప్పుకొచ్చారు.

# బడ్జెట్‌లో కీలక ప్రకటన.. భారీగా తగ్గనున్న 'ఆభరణాల' ధరలు..



**న్యూఢిల్లీ- నవభూమి:** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్ 2025లో కీలక నిర్ణయం తీసుకుంది.

ఆభరణాలు, విడిభాగాలపై కస్టమ్స్ డ్యూటీని తగ్గిస్తూ బడ్జెట్లో ప్రకటన చేశారు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్. ఆభరణాలు, వాటి విడిభాగాలకు సంబంధించిన వస్తువు కోడ్ 7113 కోసం కస్టమ్స్ టారిఫ్‌ను తగ్గిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం జువలెరీపై కస్టమ్స్ టారిఫ్ 25 శాతంగా ఉండగా దానిని ఈ బడ్జెట్లో 20 శాతానికి తగ్గించారు. తగ్గిన టారిఫ్ రేట్లు ఫిబ్రవరి 2, 2025 నుంచే అమలులోకి వస్తాయని ఆర్థిక మంత్రి తెలిపారు. అలాగే ప్లాటినం ఆభరణాలపై కస్టమ్స్ టారిఫ్ 25 శాతం నుంచి ఏకంగా 5 శాతానికి తగ్గించడం గమనార్హం.గత ఏడాది జులై, 2024లో ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్లో బంగారం దిగుమతులపై కస్టమ్స్ డ్యూటీ తగ్గించింది కేంద్రం. 15 శాతం నుంచి 6 శాతానికి తగ్గించింది. దీంతో దేశీయంగా బంగారం ధరలు భారీగా దిగివచ్చాయి. ఈసారి మళ్లీ పెంచుతారని అంతా భావించారు. కానీ, అలాంటి ప్రకటన చేయలేదు. ఇప్పుడు ఆభరణాలు, విడిభాగాలకు సంబంధించి కస్టమ్స్ టారిఫ్ భారీగా తగ్గిండంతో బంగారం, వజ్రాభరణాలు చౌకగా లభించనున్నాయి. కేంద్రం నిర్ణయంపై పలువురు జువెలర్స్ ప్రశంసలు కురిపించారు.

'జువెలరీ డ్యూటీని 25 శాతం నుంచి 20 శాతానికి తగ్గించడం స్వాగతించదగిన నిర్ణయం. పెద్ద ఎత్తున జువెలరీ వినియోగించే భారత్ వంటి దేశానికి ఇలాంటి నిర్ణయం కీలకంగా మారుతుంది. ఈ నిర్ణయం కచ్చితంగా డొమెస్టిక్ మార్కెట్లో డిమాండును పెంచుతుంది. ముఖ్యంగా లగ్జరీ మార్కెట్లో డిమాండ్ పుంజుకుంటుంది. అలాగే ప్లాటినం వస్తువులపై కస్టమ్స్ టారిఫ్ 25 శాతం నుంచి 5 శాతానికి తగ్గించడం మరో కీలక నిర్ణయం. ఈ నిర్ణయం మొత్తం రత్నాలు, ఆభరణాల పరిశ్రమకు ఊతమిస్తుంది.' అని కామా జువెలరీ ఎండీ కొలిన్ షా ఎకనామిక్ టైమ్స్‌తో చెప్పారు.

మరోవైపు.. మధ్య తరగతి వినియోగాన్ని పెంచే అంశంపై ఈ బడ్జెట్ ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు సెన్కో గోల్డ్ అండ్ డైమండ్స్ ఎండీ సువాంకర్ సెన్. అగ్రికల్చర్ సెక్టార్‌కి ప్రోత్సాహకాలు కల్పించడంతో గ్రామీణ డిమాండ్ పెంచడం, గ్రామీణ ఉత్పాదకతను పెంచేందుకు సాయపడుతుందన్నారు. అలాగే మహిళలు, యువతపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు.

# ఆదాయపు పన్ను ఊరటతో ఆ కోటి మందికి నో టాక్స్..



**న్యూఢిల్లీ- నవభూమి:** వేతన జీవులకు ఈసారి బడ్జెట్‌లో భారీ ఊరట కలిగిన సంగతి తెలిసిందే. ముందు నుంచి ఉన్న అంచనాలకు తగ్గట్లుగానే .. వాస్తవంగా చెప్పాలంటే అంచనాల్ని మించి ప్రకటన వచ్చిందని చెప్పొచ్చు. కొత్త పన్ను విధానంలో ఇకపై రూ. 12 లక్షల వరకు వార్షికాదాయంపై టాక్స్ చెల్లించాల్సిన పని లేదని చెప్పారు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్. ఈ పన్ను ఊరట నిర్ణయంతో.. అదనంగా మరో కోటి మందికిపైగా పన్ను భారం నుంచి తప్పించుకున్నారని తెలిపారు. వీరు ఇదివరకు పన్ను పరిధిలో ఉండేవారని అన్నారు. ఈ వర్గం వారు ఇప్పుడు బెనిఫిట్ పొందనున్నట్లు చెప్పారు. బడ్జెట్ ప్రవేశపెట్టిన తర్వాత.. సాయంత్రం మీడియాతో మాట్లాడిన ఆమె కీలక వ్యాఖ్యలు చేశారు. ఇంకా ఆమె ఏం చెప్పారో చూద్దాం.'బడ్జెట్‌లో ఆదాయపు పన్ను శ్లాబుల సవరణలతో ప్రజల చేతుల్లో ఇప్పుడు సరిపడా డబ్బులు చేతిలో ఉండేలా కేంద్ర ప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకుంది. అంతకుముందు రూ. 8 లక్షల ఆదాయం ఉండే వారు ఇప్పటి వరకు రూ. 30 వేలు టాక్స్ చెల్లించేవారు. ఇక మీదట వారు ఏమీ చెల్లించాల్సిన పని లేదు. ఇంకా మిగతా శ్లాబుల్లో ఉన్నవారికి కూడా ఊరట కలిగింది. రూ. 12 లక్షల వరకు ఆదాయంపై టాక్స్ రిబేట్ పెంచడంతో కోటి మందికిపైగా దేశ ప్రజలు ఇకపై టాక్స్ చెల్లించడం నుంచి ఉపశమనం పొందారు.' అని నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. ఖర్చు చేసే ప్రతి రూపాయి విషయంలో కూడా తాము చాలా వివేకంతో వ్యవహరించామని.. ఆర్థిక వ్యవస్థలో ప్రతి అంశాన్ని కూడా స్పృశించేలా బడ్జెట్ రూపొందించినట్లు చెప్పుకొచ్చారు. వ్యవసాయ రంగానికి కూడా అన్ని రకాలుగా అండగా ఉంటున్నామని.. దానికి తగ్గట్లుగానే వారికి ఊరట కల్పించినట్లు నిర్మలా సీతారామన్ అన్నారు. రుణాలు, కొత్త వంగడాల సృష్టి, పెట్టుబడి సాయం ఇలా అన్ని రకాలుగా మద్దతు ఇస్తున్నట్లు వివరించారు. బ్యాంకుల నుంచి వారికి రుణ సదుపాయాన్ని మరింత చేరువ చేశామని అన్నారు. బడ్జెట్‌లో పాత పన్ను విధానం గురించి నిర్మలా సీతారామన్ ఏం ప్రస్తావించలేదు. ఇదే సమయంలో వచ్చే వారంలో కొత్త ఆదాయపు పన్ను బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట నున్నట్లు వెల్లడిం చారు. మరి అందులో ఏమేం మారతాయో చూడాలి. ఇక కొత్త పన్ను విధానంలో ఇప్పుడు రూ. 12.75 లక్షల వరకు (స్టాండర్డ్ డిడక్షన్ రూ. 75 వేలతో కలిపి) పైసా టాక్స్ చెల్లించనక్కర్లేదు.

# ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేసే వారికి గుడ్‌న్యూస్..




**న్యూఢిల్లీ- నవభూమి:** కేంద్ర ప్రభుత్వం శనివారం ప్రకటించిన వార్షిక బడ్జెట్ 2025లో కీలక నిర్ణయం తీసుకుంది. బ్యాంకులు, ఫైనాన్షియల్ సంస్థల వద్ద డిపాజిట్లు చేసే వారికి శుభవార్త అందించింది. ఫిక్స్‌డ్ డిపాజిట్ల ద్వారా వచ్చే వడ్డీ ఆదాయంపై ట్యాక్స్ డిడక్టెడ్ ఎట్ సోర్స్ పరిమితి పెంచుతున్నట్లు ప్రకటించింది. జనరల్ కస్టమర్లు (60 సంవత్సరాల లోపు వారికే) కే ఈ పెంపు వర్తించనుంది. ప్రస్తుతం సాధారణ కస్టమర్లకు డిపాజిట్ల వడ్డీ ఆదాయంపై ట్యాక్స్ లిమిట్ రూ. 40 వేలుగా ఉండగా దానిని రూ.50 వేలకు పెంచుతున్నట్లు బడ్జెట్లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రతిపాదించారు. సవరించిన కొత్త పన్ను పరిమితి అనేది ఏప్రిల్ 1, 2025 నుంచే అమలులోకి రానుంది.

టీడీఎస్ అంటే ఏంటి?..ఫిక్స్‌డ్ డిపాజిట్లపై ఒక ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన పరిమితికి మించి వడ్డీ ఆదాయం పొందినప్పుడు సదరు వడ్డీపై బ్యాంకులు పన్ను కట్ చేయాల్సి ఉంటుంది. ఈ పరిమితి అనేది సాధారణ కస్టమర్లు, సీనియర్ సిటిజన్లకు వేరు వేరుగా ఉంటుంది. పాన్ కార్డు ఉన్న వారికి ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వచ్చే వడ్డీకి 10 శాతం టీడీఎస్ కట్ చేయాల్సి ఉంటుంది. పాన్ కార్డు లేకుంటే 20 శాతం మేర పన్ను పడుతుంది. ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 194 ఏ కింద టీడీఎస్ కట్ చేస్తారు. జనరల్ కస్టమర్లకు ఫిక్స్‌డ్ డిపాజిట్లపై టీడీఎస్ లిమిట్ రూ. 40 వేల నుంచి రూ. 50 వేలకు పెంచారు. ఫిక్స్‌డ్ డిపాజిట్లపై టీడీఎస్ రూల్స్.. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వెబ్‌సైట్ ప్రకారం.. ఫిక్స్‌డ్ డిపాజిట్ల వడ్డీపై టీడీఎస్ డిడక్ట్ చేయాల్సి వచ్చినప్పుడు ఆదాయపు పన్ను విభాగం కొన్ని మార్గదర్శకాలను జారీ చేసింది. వాటిని బ్యాంకులు, ఫైనాన్షియల్ సంస్థలు కచ్చితంగా పాటించాల్సి ఉంటుంది. ఒక ఆర్థిక సంవత్సరంలో నిర్దేశిత పరిమితికి మించి వడ్డీ వచ్చినప్పుడు మాత్రమే టీడీఎస్ కట్ చేయాల్సి ఉంటుంది. ఎక్కడైతే ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేస్తారో అదే బ్యాంక్ లేదా ఫైనాన్షియల్ సంస్థ టీడీఎస్ కట్ చేయాలి. పాన్ కార్డు వివరాలు అందుబాటులో ఉన్నప్పుడు 10 శాతం టీడీఎస్ కట్ చేయాలి. పాన్ కార్డు లేని సందర్భంలో 20 శాతం టీడీఎస్ కట్ చేయాలి. ఒక వేళ జాయింట్ అకౌంట్ ద్వారా ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసినప్పుడు ప్రైమరీ అకౌంట్ హోల్డర్ ఆధారంగా టీడీఎస్ కట్ చేయాల్సి ఉంటుంది. రెండో ఖాతాదారుడికి ఎలాంటి సంబంధం ఉండదు.

# హైదరాబాద్ టూ ఫుకెట్‌కు డైరెక్ట్ ఫ్లైట్

**హైదరాబాద్ - నవభూమి::** హైదరాబాద్ నుంచి థాయ్‌లాండ్ లోని ఫుకెట్ నగరానికి విమాన సర్వీస్ ప్రారంభమైంది. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి తొలి విమానం శుక్రవారం టేకాఫ్ అయినట్టు జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ సీఈవో ప్రదీప్ తెలిపారు. కొత్త సర్వీస్‌తో ఫుకెట్-హైదరాబాద్ మధ్య కనెక్టివిటీ ఘననీయంగా పెరుగుతుందని తెలిపారు. ఈ విమానం 3:45 గంటల్లో గమ్యాన్ని చేరుకుం టుందని పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రతి బుధ, శుక్ర, ఆదివారాల్లో ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానం మూడు సర్వీసులను నడుపుతుందని తెలిపారు.




# తగ్గిన యమహా బైకుల ధరలు



**న్యూఢిల్లీ- నవభూమి:** స్పోర్ట్స్ బైకుల తయారీ సంస్థ యమహా మోటర్స్.. వాహన కొనుగోలుదారులకు శుభవార్తను అందించింది. తన ఫ్లాగ్‌షిప్ మాడల్స్ ఆర్3, ఎంటీ-03 మాడళ్ల ధరలను రూ.1.10 లక్షల వరకు తగ్గించింది. ఈ ధరలు శనివారం నుంచి అమలులోకిరానున్నాయి. సంస్థ తీసుకున్న తాజా నిర్ణయంతో ఆర్3 మాడల్ రూ.3,59,900, ఎంటీ-03 మాడల్ ధర రూ.3,49,900కి తగ్గనున్నాయి. ఈ ధరలు ఢిల్లీ షోరూంనకు సంబంధించినవి. ప్రీమియం మోటర్‌సైకిళ్లకు డిమాండ్ పెంచాలనే ఉద్దేశంతో ఈ రెండు మాడళ్ల ధరలను తగ్గించినట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి.

# టీడీఎస్.. వృద్ధులకు తగ్గింపు.. అద్దెలపై వచ్చే ఆదాయంపై పెంపు..




**న్యూఢిల్లీ- నవభూమి:** కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన కేంద్ర బడ్జెట్‌ను లోక్‌సభలో ప్రవేశపెట్టారు. శనివారం ఉదయం 11 గంటలకు సభ ప్రారంభం కాగానే బడ్జెట్‌ను ప్రవేశపెట్టి ప్రసంగాన్ని పూర్తి చేశారు. పలు రంగాలకు కేటాయింపుల గురించి వెల్లడించారు. అలాగే ఆదాయపు పన్ను గురించి కీలక ప్రకటన చేశారు. మరోవైపు ట్యాక్స్ డిడక్షన్ సర్వీస్ పై కూడా కీలక ప్రకటనలు చేశారు. వచ్చే వారం ఆదాయపు పన్ను ప్రత్యేక బిల్లును తీసుకురాబోతున్నట్టు ప్రకటించారు. తాజా బడ్జెట్‌లో వృద్ధులకు నిర్మలమ్మ ఉపశమనం కలిగించారు. సీనియర్ సిటిజన్స్‌కు వడ్డీపై వచ్చే ఆదాయంపై టీడీఎస్ పరిమితిని రూ.50 వేల నుంచి రూ.లక్షకు పెంచారు. అయితే ఇళ్లు, గృహ సముదాయాలు లేదా ఇతర నిర్మాణాల ద్వారా వచ్చే ఆదాయంపై టీడీఎస్‌ను రూ.2.4 లక్షల నుంచి ఏకంగా రూ.6 లక్షలకు పెంచారు. అలాగే ఐటీ రిటర్నుల గడువును కూడా పెంచారు. ఏదైనా మదింపు సంవత్సరానికి అప్డేటెడ్ రిటర్నులు సమర్పించడానికి ప్రస్తుతం ఉన్న రెండేళ్ల కాల పరిమితిని నాలుగేళ్లకు పెంచారు. పార్లమెంట్‌లో వచ్చే వారం ఆదాయపు పన్ను ప్రత్యేక బిల్లును తీసుకురాబోతున్నట్టు ప్రకటించారు. ఆ బిల్లు ఆదాయపు పన్ను విదానాన్ని మరింత సులభతరం చేస్తుందని తెలిపారు. ప్రస్తుత ఆదాయపు పన్ను విధానంలోని నిబంధనలను సగానికి తగ్గించబోతున్నారు.

# మెడికల్ విద్యార్థులకు శుభవార్త.. పదేళ్లల్లో ఎన్ని మెడికల్ సీట్లు పెంచనున్నారంటే



**న్యూఢిల్లీ- నవభూమి:** పార్లమెంట్ బడ్జెట్ 2025-26 సమావేశాలు ప్రారంభం అయ్యాయి. కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ తన 8వ బడ్జెట్ ప్రవేశపెట్టి ప్రసంగించారు. 2024-25 ఆర్థిక ఏడాదికి సవరించిన వ్యయం రూ.47.16 లక్షల కోట్లని కేంద్రమంత్రి తెలిపారు. మూలధన వ్యయం రూ.10.1 లక్షల కోట్లుగా చెప్పారు. ప్రస్తుత ఆర్థిక ఏడాదికి సవరించిన ఆదాయ అంచనా రూ.31.47 లక్షల కోట్లు (అప్పులు మినహా)గా కేంద్ర మంత్రి చెప్పారు. నికర పన్నుల ద్వారా సమకూరిన ఆదాయం రూ.25.57 లక్షల కోట్లని నిర్మలా సీతారామన్ వెల్లడించారు. ద్రవ్యలోటు జీడీపీలో 4.8 శాతంగా ఉందని అంచనా వేసినట్లు చెప్పారు. ఆర్థిక లోటు జీడీపీలో 4.4 శాతంగా అంచనా వేశారు. వచ్చే వారం పార్లమెంట్ ముందుకు వ్యక్తిగత ఆదాయపన్ను బిల్లు వస్తున్నట్లు పార్లమెంట్ సాక్షిగా నిర్మలా సీతారామన్ ప్రకటించారు. గత పదేళ్లలో కొత్తగా 1.01 లక్షల మెడికల్ సీట్లు పెంచినట్లు, అలాగే రానున్న ఐదేళ్లలో కొత్తగా 75 వేల సీట్లు అందుబాటులోకి రానున్నట్లు కేంద్ర మంత్రి నిర్మలా తెలిపారు. దేశవ్యాప్తంగా అన్ని జిల్లా ఆస్పత్రుల్లో డే-కేర్ క్యాన్సర్ సెంటర్లు ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర మంత్రి నిర్మల తెలిపారు. 2025-26లో 200 క్యాన్సర్ సెంటర్లు ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. పట్టణ పేదలు, వర్తకులకు చేయూత నిచ్చేందుకు సిద్ధమైనట్లు చెప్పారు.

వర్తకులకు రూ.30 వేల పరిమితితో క్రెడిట్ కార్డులు, గిగ్ వర్కర్లకు ఈ-శ్రమ్ పోర్టల్ ద్వారా ఐడీ కార్డులు ఇవ్వనున్నట్లు తెలిపారు. అలాగే అంగన్వాడీ కేంద్రాలకు కొత్త హంగులు దిద్దనున్నట్లు ఆమె తెలిపారు. ప్రభుత్వ స్కూళ్లలో 50 వేల అటల్ టింకరింగ్ ల్యాబ్స్ ఏర్పాటు, అన్ని ప్రభుత్వ హైస్కూల్స్‌కు బ్రాడ్‌బ్యాండ్ సేవలు అందించనున్నారు. భారతీయ భాష పుస్తకాలకు డిజిటల్ రూపం ఇవ్వనున్నట్లు ఆమె చెప్పారు. స్కూళ్లలో విద్యతోపాటు ఇకపై నైపుణ్య శిక్షణకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపారు. 2014 తర్వాత ఏర్పాటైన 5లకు మరిన్ని నిధులు కేటాయించనున్నట్లు చెప్పారు.



# జైళ్ల ఆధునీకరణకు.. కేంద్ర బడ్జెట్‌లో రూ.300 కోట్లు




**న్యూఢిల్లీ- నవభూమి:**దేశంలోని జైళ్ల ఆధునీకరణ కోసం వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ.300 కోట్ల బడ్జెట్ కేటాయింపును కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. అయితే గత ఆర్థిక సంవత్సరంలో కూడా ప్రస్తుతం మాదిరిగానే రూ.300 కోట్లు కేటాయించారు. ఆ తర్వాత దానిని రూ.75 కోట్లకు సవరించారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం పార్లమెంట్‌లో కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో జైళ్ల ఆధునీకరణ కోసం రూ.300 కోట్లు ఖర్చు చేయనున్నట్లు వెల్లడించారు.కాగా, 2024-25 ఆర్థిక సంవత్సరంలో జైళ్ల ఆధునీకరణ కోసం బడ్జెట్‌లో తొలుత రూ.300 కోట్లు కేటాయించారు. అయితే ఆ తర్వాత దానిని రూ.75 కోట్లకు కేంద్ర ప్రభుత్వం సవరించింది. 2023-24లో జైళ్ల ఆధునీకరణకు రూ.86.95 కోట్లు కేటాయించారు.మరోవైపు సమర్థవంతమైన జైళ్ల నిర్వహణ, సంస్కరణలకు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నది. దీని కోసం 2023 మేలో సమగ్ర 'మోడల్ జైళ్ల చట్టాన్ని' ఖరారు చేసింది. హై సెక్యూరిటీ జైలు, ఓపెన్ జైళ్ల ఏర్పాటు, జైళ్ల నిర్వహణ, కరడుగట్టిన నేరస్తులు, ఇతర నేరస్తుల నుంచి సమాజాన్ని రక్షించడం, ఖైదీలకు సంక్షేమ కార్యక్రమాలు, పునరావాస సేవలు వంటివి ఈ చట్టంలో ప్రతిపాదించారు.

# ఉద్యోగం ఉంటే పన్ను ప్రయోజనం.. మరి నిరుద్యోగుల సంగతేంది..? : శశిథరూర్




**న్యూఢిల్లీ- నవభూమి:** కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఇవాళ పార్లమెంట్ లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, ఎంపీ శశిథరూర్ స్పందించారు. మధ్య తరగతికి ప్రయోజనం చేకూరేలా పన్ను శ్లాబుల్లో మార్పులు చేయడాన్ని మెచ్చుకుంటూనే.. మరి నిరుద్యోగుల కు ఈ జీరో పన్ను తో కలిగే ప్రయోజనం ఏమిటని ప్రశ్నించారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తన 75 నిమిషాల బడ్జెట్ ప్రసంగంలో ఎక్కడా నిరుద్యోగం, ద్రవ్యోల్బం ఊసు ఎత్తలేదెందుకు..? అని ఆయన క్వశ్చన్ చేశారు.ఈ బడ్జెట్‌లో మధ్యతరగతి ప్రజలపై పన్నులు తగ్గించడాన్ని బీజేపీ నేతలు గొప్పగా చెప్పుకుంటున్నారు. బడ్జెట్‌పై ప్రశంసలు కురిపిస్తున్నారు. అయితే కొత్త పన్ను పాలసీతో మధ్యతరగతి ప్రజలకు మేలు చేయడం మంచి విషయమే. మరి కరెక్టుగా ఆలోచిస్తే.. మీకు వేతనం వస్తున్నట్లయితే మీరు మీరు చెల్లించే గతంలో కంటే తగ్గుతుంది. కానీ నా ముఖ్యమైన ప్రశ్న ఏమిటంటే.. మరి మీకు ఉద్యోగమే లేకపోతే తగ్గిన పన్నుతో ఏం లాభం..?' అని ప్రశ్నించారు. 'మీకు ఉద్యోగం ఉండి, ఏడాదికి రూ.12 లక్షల కంటే తక్కువ వేతనం ఉంటే.. సంతోషించదగ్గ విషయమే. మరి నిరుద్యోగుల సంగతేంటి..?' అని నొక్కినొక్కి ప్రశ్నించారు.'ప్రధాన సమస్యలైన నిరుద్యోగం, ద్రవ్యోల్బణం అంశాలను ఆర్థిక మంత్రి తన ప్రసంగంలో ఎందుకు ప్రస్తావించలేదు. ఆమె పూర్తి ప్రసంగంలో ఎక్కడా ఆ రెండు పదాలు కనిపించకపోవడం విచారకరం. కేంద్ర బడ్జెట్ ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని రూపొందించినట్టు లేదని, ఎన్నికల్లో పొందే ఓట్లను దృష్టిలో పెట్టుకుని రూపొందించిన బడ్జెట్ అని ఆయన ఆరోపించారు. బీజేపీ పాలిత రాష్ట్రాలకు, బీజేపీ మిత్రపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాలకు ఎక్కువ కేటాయింపులు చేశారని విమర్శించారు.

# బడ్జెట్‌లో కొత్త ప్రాజెక్టుల ఊసే లేదు..!
# నిర్మలమ్మ పద్దులో రైల్వేకు దక్కింది ఎంత..?




**న్యూఢిల్లీ- నవభూమి:**కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2025-26 బడ్జెట్‌ను పార్లమెంట్‌కు సమర్పించారు. సాధారణ బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి ఒక్కసారి కూడా భారత రైల్వేల గురించి ప్రస్తావించలేదు. అయితే, 2026 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌లో భారత రైల్వేలకు రూ.2.55 లక్షల కోట్లు కేటాయించారు. ఈ సారి ఎలాంటి కొత్త ప్రాజెక్టుల జోలికి వెళ్లకుండా.. గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంపైనే దృష్టి సారించారు. ఆర్థిక మంత్రి 2024 సాధారణ బడ్జెట్‌లో రైల్వేకు రూ.2,55,200 కోట్లు కేటాయించగా.. అంతకు ముందు బడ్జెట్ 2023-24 సంవత్సరంలో రూ.2,40,200 కోట్ల కంటే 5 శాతం ఎక్కువ. జూలై 2024లో ఆర్థిక మంత్రి సమర్పించిన బడ్జెట్‌లో నిర్మలా సీతారామన్ కొత్త వందే భారత్ రైళ్లను ప్రకటించారు. భారతదేశంలో మూడు ప్రధాన రైల్వే ఆర్థిక కారిడార్‌లను నిర్మిస్తామని చెప్పారు. ఈ సారి బడ్జెట్‌లో రైల్వేలకు రూ.2,55,445 కోట్లు కేటాయించింది. ఇందులో రెవెన్యూ ఎక్స్‌పెండేచర్ రూరూ.3445 కోట్లు కాగా.. రూ.2,52,000 కోట్లు మూలధనం వ్యయం కోసం ఖర్చు చేయనున్నది.బడ్జెట్‌లో పెన్షన్ ఫండ్‌లో రూ.66వేల కోట్లు, కొత్త లైన్లు వేయడానికి రూ.32,235 కోట్లు కేంద్రం ఖర్చు చేయనున్నది. రైల్వేలైన్ల లైన్ల డబ్లింగ్ కోసం రూ.32వేల కోట్లు, గేజ్ లైన్లుగా మార్చడానికి రూ.4,550 కోట్లు బడ్జెట్ నిర్ణయించారు. అలాగే, రైల్వే సిగ్నలింగ్, టెలికాం కోసం రూ.6800 కోట్లు, విద్యుత్ లైన్లకు రూ.6,150 కోట్లు, సిబ్బంది సంక్షేమానికి రూ.833 కోట్లు సాధారణ బడ్జెట్‌లో కేటాయించారు. రైల్వే సిబ్బంది శిక్షణ కోసం రూ.301 కోట్లు ఖర్చు చేయనున్నారు. రూ.45వేల కోట్లు రైల్వే భద్రతా నిధికి బదిలీ చేయనున్నది. రైలు ప్రమాదాలను తగ్గించడానికి రైల్వే మంత్రిత్వ శాఖ ప్రత్యేక చర్యలు తీసుకోనున్నది. ప్రధాన రైల్వే మార్గాల్లో కవచ్ అప్‌గ్రేడ్ వెర్షన్ 4.%ూ% ని ఇన్‌స్టాల్ చేసే పని వేగంగా జరుగుతున్నది. అయితే, బడ్జెట్‌లో దీని గురించి ఆర్థిక మంత్రి ప్రకటన చేయలేదు. కానీ, బడ్జెట్ ఆర్థిక మంత్రి దీనికి సంబంధించి ఎటువంటి కొత్త ప్రకటన చేయలేదు. కానీ బడ్జెట్ కేటాయింపులో గతంలో ఇచ్చిన హామీలను నెవర్చేందుకు ప్రాధాన్యం ఇచ్చినట్లుగా రైల్వే వర్గాలు పేర్కొన్నాయి.

# అదుపుతప్పి కాలువలో పడ్డ వాహనం.. ఏడుగురు దుర్మరణం



**హర్యానా - నవభూమి:**వివాహ వేడుకకు వెళ్లిన 14 మందితో తిరిగివస్తున్న వాహనం అదుపుతప్పి కాలువలో పడింది. ఈ ప్రమాదంలో ఏడుగురు దుర్మరణం పాలయ్యారు. ఇద్దరు తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్నారు. మరో ఐదుగురు గల్లంతయ్యారు. గల్లంతైన వారి కోసం గాలింపు కొనసాగుతోంది. హర్యానా రాష్ట్రం లోని ఫతేహాబాద్ జిల్లాలో ఈ ఘటన చోటుచేసుకుంది.శుక్రవారం రాత్రి హర్యానాకు చెందిన 14 మంది పంజాబ్‌లో ఓ వివాహ వేడుకకు హాజరై తిరిగి స్వస్థలానికి వస్తుండగా వారు ప్రయాణిస్తున్న వాహనం అదుపుతప్పి కాలువలో పడింది. ఇది గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు, స్థానిక అధికారులు హుటాహుటిన ఘటనా ప్రాంతానికి చేరుకున్నారు. ముగ్గురిని రక్షించి ఆస్పత్రికి తరలించారు. వారిలో ఒకరు చికిత్స పొందుతూ మరణించారు.ఎమిగతా ఇద్దరికి ప్రాణాపాయం తప్పిందని వైద్యులు వెల్లడించారు. శనివారం ఉదయం మరో ఆరు మృతదేహాలను వెలికితీశారు. ఇంకో ఐదుగురు గల్లంతయ్యారు. గల్లంతైన వారి కోసం గాలింపు కొనసాగుతోంది. మృతుల్లో ఓ ఏడాదిన్నర పసిబిడ్డ, పదేళ్ల బాలిక ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు వెల్లడించారు.

# చెన్నైలో డాక్టర్ దుర్మార్గం.. చంపేసి.. వాసన రాకుండా ఏసీ వేసి మరీ!



**చెన్నై- నవభూమి:** ఒక డాక్టర్ దుర్మారం గురించి తెలిస్తే నోట మాట రాదంతే. ఇలా కూడా చేస్తారా? అన్నట్లుగా ఉండే ఈ ఉదంతం చెన్నైలో చోటు చేసుకుంది. ఇటీవల కాలంలో పెరుగుతున్న కొత్త తరహా నేరాలు కొత్త భయాలకు తెర తీస్తున్నాయని చెప్పాలి. చెన్నైలోని తిరుముల్లైవాయల్ లోని ఒక అపార్టుమెంట్ లో ఉంటున్న తండ్రి,కూతుళ్ల మృతదేహాల మిస్టరీకి సంబంధించి ఒక వైద్యుడ్ని చెన్నై పోలీసులు అరెస్టు చేశారు. విచారణ సందర్భంగా వెలుగు చూసిన వివరాల్ని చూస్తే.. షాక్ కు గురి కావాల్సిందే. ఆయన కుమార్తె 37 ఏళ్ల సింథియా చెన్నైలో ఉంటారు. అయితే.. శంకర్ కిడ్నీసమస్యతో బాధ పడుతుండేవారు. ఇదిలా ఉండగా ఆయన కుమార్తె సింథియాకు ఆన్ లైన్‌లో పరిచమయ్యారు డాక్టర్ శ్యాముల్. దీంతో.. తన తండ్రికి చికిత్స చేయాలని కోరగా.. అతను అంగీకరించారు. అయితే.. శ్యాముల్ వేలూరులో ఉండేవాడు. దీంతో.. ప్రతిసారి వేలూరు నుంచి వచ్చి చికిత్స చేయటం ఇబ్బందిగా మారటంతో వారిని అపార్టుమెంట్‌లో ఉంచి తానే వచ్చి వైద్యం చేస్తుండేవాడు. చికిత్స పొందుతున్న శంకర్.. గత సెప్టెంబరు 6న చికిత్స పొందుతూ మరణించాడు. తండ్రి మరణం తట్టుకోలేని సింథియా డాక్టర్ శ్యాముల్‌ను ప్రశ్నించింది. ఈ క్రమంలో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. అది కాస్తా పెరగటం.. సింథియాను నెట్టేయటంతో ఆమె తలకు గాయమై.. మరణించింది. దీంతో షాక్ కు గురైన డాక్టర్ శ్యాముల్ తండ్రీ కూతుళ్ల డెడ్ బాడీలను ఒక గదిలో ఉంచి తాళం వేసి వెళ్లారు. దుర్వాసన రాకుండా ఉండేందుకు ఏసీ వేసి కాంచీపురం వెళ్లాడు. వారానికి రెండుసార్లు వచ్చి.. కెమికల్స్ చల్లి వెళ్లేవాడు. ఈ విషయం బయటకు వస్తే కాంచీపురంలో గుండెకు సర్జరీ చేసుకున్న తల్లికి ప్రమాదం జరుగుతుందని ఐదునెలలుగా తండ్రికూతుళ్ల మరణాల్ని దాచి ఉంచాడు. ఇటీవల కరెంట్ పోవటం.. శంకర్ ఇంటి నుంచి భయంకరమైన దుర్వాసన రావటంతో అపార్టుమెంట్ వాసులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. తాళం పగలకొట్టి లోపలకు వెళ్లిన వారంతా కుళ్లిపోయి.. అస్తిపంజరాలుగా ఉన్న తండ్రీకూతుళ్లు కనిపించారు. ఈ క్రమంలో డాక్టర్ శ్యాముల్ ను అదుపులోకి తీసుకొన్న పోలీసులు 12 గంటల పాటు విచారించగా.. అన్ని వివరాల్ని వెల్లడించారు. శంకర్ బంధువులకు వాట్సాప్ కాల్ చేయటం.. మిస్డ్ కాల్స్ చేస్తూ మేనేజ్ చేసినట్లుగా గుర్తించారు. ఈ ఉదంతంలో డాక్టర్‌ను అరెస్టు చేసి జైలుకు తరలించారు. ఈ వ్యవహారం తెలిసిన వారంతా విస్తుపోతున్నారు.

# రాష్ట్రపతి భవన్‌లో ఆమె పెళ్లి



**న్యూఢిల్లీ- నవభూమి:**అవును.. ఆమె పెళ్లి కోసం దేశ ప్రథమ పౌరుడు రాష్ట్రపతి అధికార నివాసం.. రాష్ట్రపతి భవన్ వేదికగా మారింది. ఇందు కోసం ప్రత్యేక అనుమతులు జారీ చేశారు. ఇంతకూ పెళ్లి కుమార్తె ఎవరు? ఎందుకని ఆమె పెళ్లికి రాష్ట్రపతి భవన్ వేదికగా మారటానికి కారణమేంటి? అన్న వివరాల్లోకి వెళితే.. రాష్ట్రపతి భవనంలో పీఎస్ వోగా సేవలు అందిస్తున్న సీఆర్ పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ పూనమ్ గుప్తా పెళ్లి జరగనుంది. ఆమె పెళ్లి కోసం రాష్ట్రపతి భవన్ లోని మదర్ థెరెసా క్రౌన్ కాంప్లెక్స్ లో వివాహ వేడుకను నిర్వహించేందుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రత్యేకంగా అనుమతులు మంజూరు చేశారు. ఇంతకూ పెళ్లి కుమారుడు ఎవరంటే.. సీఆర్ పీఎఫ్ విభాగంలోనే పని చేసే ఉన్నతాధికారి కావటం విశేషం. అత్యంత గౌరవప్రదమైన రాష్ట్రపతి భవన్ వేదికగా ఒక అధికారి వివాహం జరగటం ఇదే తొలిసారిగా చెబుతున్నారు. ఈ పెళ్లిని పలువురు చారిత్రాత్మకంగా అభివర్ణిస్తున్నారు. ఈ పెళ్లికి పలువురు ప్రముఖులు హాజరువుతున్నారు. అదే సమయంలో పెళ్లికి హాజరయ్యే ఇరు వర్గాలకు సంబంధించిన వారికి సంబంధించిన లాంఛనాలు పూర్తి అయినట్లుగా తెలుస్తోంది. రాష్ట్రపతి భవన్ లో ప్రవేశానికి ప్రత్యేక అనుమతులతో పాటు. దాదాపు నెలకు ముందే అన్నీ అనుమతులు పొంది ఉండాల్సి ఉంటుంది. జమ్మూకశ్మీర్ లో సీఆర్పీఎఫ్ అసిస్టెంబ్ కమాండెంట్ గా సేవలు అందిస్తున్న అవనీశ్ కుమార్ తో పూనమ్ గుప్తా వివాహం ఫిబ్రవరి 12న పెళ్లి జరగనుంది. మధ్యప్రదేశ్ కు చెందిన పూనమ్ గుప్తా.. 2019 లో యూపీఎస్సీ నిర్వహించిన సీఏపీఎఫ్ ఎగ్జామ్ లో 81వ ర్యాంక్ సాధించారు. ఆ తర్వాత సీఆర్ పీఎఫ్ లో అసిస్టెంట్ కమాండెంట్ గా పోస్టింగ్ లభించింది. రిపబ్లిక్ డే సందర్భంగా నిర్వహించిన కవాతులో సీఆర్ పీఎఫ్ మహిళా దళానికి పూనమ్ సారథ్యం వహించారు. పూనమ్ తల్లిదండ్రుల విషయానికి వస్తే.. నవోదయ విద్యాలయం ఆఫీస్ సూపరింటెండెంట్ గా పని చేస్తున్న రఘువీర్ గుప్తా తండ్రి కాగా.. తల్లి ఇంట్లోనే ఉంటారని తెలుస్తోంది. మధ్యప్రదేశ్ లోని శివపురిలోని శ్రీరామ్ కాలనీలో వారి నివాసం. గణితంలో గ్రాడ్యుయేషన్.. ఇంగ్లిషు లిటరేచర్ లో మాస్టర్స్ చేసిన ఆమె.. గ్వాలియర్ లోని జివాజీ వర్సిటీ నుంచి బీఈడీ చేశారు. అంతకు ముందు షియోపూర్ లోని జవహర్ నవోదయ విద్యాలయ విద్యార్థి.

# వండుతున్న ఆహారంలో బూడిద పోసిన పోలీస్



**ప్రయాగ్‌రాజ్-నవభూమి:**ఉత్తరప్రదేశ్ లోని ప్రయాగ్ రాజ్ లో జరుగుతున్న మహా కుంభమేళాకు భక్తులు పోటెత్తుతున్న సంగతి తెలిసిందే. ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక కార్యక్రమం అయిన మహా కుంభమేళాకు దేశ విదేశాల నుంచి భక్తులు, పర్యాటకులు కోట్ల సంఖ్యలో తరలివస్తున్నారు. దీంతో... వారందరికీ ఆకలి తీర్చేందుకు అనేక మంది అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తరలవస్తున్న భక్తుల కోసం అక్కడికక్కడే వండి వేడి వేడి ఆహారాన్ని అందిస్తుంటారు. వారి ఆకలి తీరుస్తుంటారు. ఇలా ఆధ్యాత్మిక చింతనతో వస్తోన్న భక్తులకు ఆకలి తీర్చే అద్భుతమైన కార్యక్రమం వద్దకు తాజాగా వెళ్లిన ఓ పోలీస్ అధికారి.. అక్కడ జరుగుతున్న వంటల్లో బూడిద పోశారు. దీనికి సంబంధించిన వీడియో ఇప్పుడు నెట్టింట వైరల్ గా మారింది. ప్రయాగ్ రాజ్ లో జరుగుతున్న మహా కుంభమేళాకు తరలివస్తోన్న కోట్లాది మంది భక్తులలో కొంతమందికి పలువురు భక్తులు స్వచ్ఛందంగా ఆహారాన్ని సిద్ధం చేసి అందిస్తున్నారు. పుణ్యస్థానాల కోసం తరలి వస్తున్న భక్తులకు అన్నదాన కారక్రమాలు చేస్తున్నారు. ఈ క్రమంలో.. అలాంటి ఒక చోటుకు వచ్చిన పోలీస్ అధికారి ఒకరు దారుణంగా ప్రవర్తించారు. ఈ సమయంలో భండారా వద్ద భక్తులకు ఆహారం సిద్ధం చేస్తున్నారు. ఇందులో భాగంగా.. ఇటుకల పొయ్యిపై పెద్ద పెద్ద పాత్రల్లో అన్నం, కూరగాయలు వండుతున్నారు. ఈ క్రమంలోనే అక్కడకు వచ్చిన ఓ పోలీస్ అధికారి అక్కడే ఉన్న బూడిద (బూడిద కలిసి మట్టి) తీసుకొచ్చి ఉడుకుతున్న వంటల్లో పోశారు. దీంతో... ఈ విషయం హాట్ టాపిక్ గా మారింది. ఇది చూసిన భక్తులు ఒక్కసారిగా అధికారిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంతటి పవిత్ర కార్యక్రమానికి తరలి వస్తున్న భక్తుల కోసం సమకూరుస్తున్న వంటల్లో బూడిద పోయడం ఏమిటంటూ మండిపడుతున్నారు. ఆ అధికారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆన్ లైన్ వేదికగా డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో దీనికి సంబంధించిన వీడియోను షేర్ చేశారు యూపీ సమాజ్ వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్. ఈ సందర్భంగా ఆయన స్పందిస్తూ... కుంభమేళాకు తరలివస్తున్న భక్తులకు ఆహారం, నీరు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్న వారి మంచి ప్రయత్నాలను.. రాజకీయ శత్రుత్వం కారణంగా నాశనం చేయడం దారుణం అని రాసుకొచ్చారు!

# 2019 నుంచి నిర్మలమ్మ 'బడ్జెట్' శారీస్ ప్రత్యేకతలు ఇవే...






**న్యూఢిల్లీ - నవభూమి:**2025-26 ఆర్థిక సంవత్సరానికి గానూ కేంద్ర బడ్జెట్ ను ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ లోక్ సభలో ప్రవేశపెట్టారు. ఈ క్రమంలో... శనివారం ఉదయం 11 గంటలకు సభ ప్రారంభం కాగానే.. ఆమె బడ్జెట్ ప్రవేశపెట్టి ప్రసంగం మొదలుపెట్టారు. ఈ సమయంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ధరించిన చీర ప్రత్యేకతపై చర్చ తెరపైకి వచ్చింది. తాజాగా 8వ సారి కేంద్ర బడ్జెట్ ను ప్రవేశపెడుతున్న నిర్మలా సీతారామన్.. మొదటి నుంచీ ఆమె ఈ సమయంలో ధరించే చీరలపైనా చాలా మంది దృష్టి పెడుతుంటారు. ఆమె కేటాయిం పులపై కొంతమంది దృష్టి పెడితే.. ఆమె కట్టే చీర, దాని వెనుకున్న కథపై మరికొంతమంది దృష్టి పెడుతుంటారని అంటారు. ఇది 2019 నుంచి కొనసాగుతుండటం గమనార్హం. 2019లో తొలిసారిగా ఆర్థికమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నిర్మలమ్మ.. అప్పటి నుంచి ఏటా బడ్జెట్ రోజున ధరించే చీరల విషయంలో ఏదొక ప్రత్యేకత ఉండేలా చూసుకుంటున్నారు. ఈ క్రమంలో తొలిసారి బడ్జెట్ ప్రవేశపెట్టినప్పుడు మంగళగిరి గులాబీ రంగు చీర కట్టుకున్నారు. అప్పటి వరకూ బడ్జెట్ పత్రాలు తెచ్చే సూట్ కేసు స్థానంలో బహీ ఖాతాతో కనిపించారు. 2020లో పసుపుపచ్చ - బంగారు వర్ణంలో నీలి రంగు అంచు కలిగిన చీరలో మెరిశారు నిర్మలమ్మ. నాడు "ఆస్పిరేషనల్ ఇండియా" థీమ్ కు అనుగుణంగా దీని ధరించారు. 2021లో ఎరుపు - గోధుమ రంగు కలగలిపిన బూధాన్ పోచంపల్లి చీరలో కనిపించారు. తెలంగాణ రాష్ట్రంలోని పోచంపల్లిని.. "సిల్క్ సిటీ ఆఫ్ ఇండియా"గా పిలుస్తారు. 2022లో మెరూన్ రంగు ఒడిశాకు చెందిన చీరను ధరించిన నిర్మలమ్మ.. చాలా సింపుల్ గా కనిపించారు! అనంతరం.. 2023లో బ్రౌన్ రంగులో టెంపుల్ బోర్డర్ లో బ్రైట్ రెడ్ కలర్ చీరతో కనిపించారు. ఇక గత ఏడాది (2024) సార్వత్రిక ఎన్నికలకు ముందు ఫిబ్రవరి 1న తాత్కాలిక బడ్జెట్ ప్రవేశపెట్టిన సమయంలో.. కాంతా చీరలో కనిపించారు నిర్మలమ్మ. అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్టకు ప్రతీకగా రామా బ్లూ రంగు చీర ధరించారు. అదే ఏడాది ఎన్నికల అనంతరం జూలైలో ప్రవేశపెట్టిన బడ్జెట్ సమయంలో తెలుపు రంగు, బంగారు మెటిఫ్ లతో ఉన్న చీరలో కనిపించారు. ! ఇక మూడో సారి ఎన్డీయే కూటమి అధికారంలోకి రావడంతో ఎనిమిదోసారి బడ్జెట్ ను ప్రవేశపెడుతున్న నిర్మలా సీతారామన్... ఈసారి కూడా హ్యాండ్లూమ్ చీరనే ఎంచుకున్నారు. బంగారు అంచుతో ఉన్న గోధుమ రంగు చీర, ఎరుపు రంగు జాకెట్, అదే గోదుమరంగు శాలువాతో కనిపించారు. దీనిపై ఉన్న చేపల ఆర్ట్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది! ఈ చీరకు ఓ ప్రత్యేకత ఉంది. ఈ చీరను నిర్మలమ్మకు.. పద్మశ్రీ అవార్డు గ్రహీత దులారీదేవి కానుకగా ఇచ్చారు. కళాకారిని అయిన దులారీ తాను డిజైన్ చేసిన ఈ చేనేత చీరను నిర్మలమ్మకు బీహార్ లోని మధుబనికి ఓ కార్యక్రమం నిమిత్తం వెళ్లినప్పుడు బహుకరించారు. బడ్జెట్ వేళ దీన్ని ధరించాలని ఆమె కోరినట్లు చెబుతున్నారు.

# ఉద్యోగులెవరూ 'డీప్ సీక్' ఇన్ స్టాల్ చేసుకోవద్దు... కారణం ఇదే!




**చైనా-నవభూమి:** చైనాకు చెందిన డీప్ సీక్ స్టార్టప్ సంస్థ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) లో సంచలనం సృష్టిస్తోన్న సంగతి తెలిసిందే. ప్రధానంగా... అతి తక్కువ ఖర్చుతో అధునాతన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మోడల్ ను ఆవిష్కరించి ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. దీంతో.. ఏఐ విషయంలో ఇప్పటివరకూ బాస్ గా ఉన్న యూఎస్ కు బిగ్ షాక్ తగిలిందనే చర్చ నడిచింది.ఈ డీప్ సీక్ ఇటీవల అమెరికా టెక్ పరిశ్రమను కుదిపేసింది. ఇందులో భాగంగా... ప్రీ మార్కెట్ ట్రేడ్ లో మైక్రోసాఫ్ట్ షేరు 7శాతం, మెటా షేరు 5శాతంతో పాటు ఎన్విడియా షేరు 14శాతం చొప్పున నష్టల్లో పతనమయ్యాయి. ఇదే సమయంలో.. నాస్ డాక్ కూడా 4శాతం మేర కుంగిన పరిస్థితి. మరోపక్క యాపిల్ యాప్ స్టోర్ లో డీప్ సీక్ యాప్ అగ్రస్థానంలో ఉంది. అటు గూగుల్ ప్లే స్టోర్ లోనూ ఇదే నంబర్ వన్ స్థానంలో నిలిచిందని చెబుతున్నారు. అమెరికాలోనే కాకుండా సుమారు 51 దేశాల్లోని ప్లే స్టోర్స్ లో ఇదే అగ్రస్థానంలో ఉంది. ఈ సమయంలో.. అమెరికా కాంగ్రెస్ ఆసక్తికర నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా.. ఉద్యోగులెవరూ డీప్ సీక్ ఇన్ స్టాల్ చేసుకోవద్దని తెలిపింది. అవును... అమెరికా అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) మార్కెట్ ని చైనా డీప్ సీక్ షేక్ చేస్తోన్న వేళ అమెరికా కాంగ్రెస్ కీలక నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా.. ఉద్యోగులు ఎవరు డీప్ సీక్ ను ఇన్ స్టాల్ చేసుకోవద్దని అమెరికా కాంగ్రెస్ తన ఆఫీసులకు ఆదేశాలు జారీ చేసింది. ఇది కాంగ్రెస్ భద్రత, పరిపాలనలకు సవాల్ గా నిలుస్తుందని పేర్కొంది. చైనీస్ చాట్ బాట్ కావడంతో అత్యంత విలువైన సమాచారాన్ని తస్కరించే అవకాశం ఉందని తెలిపింది. ఈ నేపథ్యంలోనే దీన్ని ఉద్యోగులు ఎవరూ అధికారిక ఫోన్లు, కంప్యూటర్లు, ట్యాబ్ లలో ఇన్ స్టాల్ చేయకూడదని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. అయితే.. చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ మాత్రమే డీప్ సీక్ వాడతారని తెలిపింది. కాగా... ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగాన్ని చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ అధికారికి మాత్రమే పరిమితం చేయడం ఇదే తొలిసారి కాదు. 2023లో చాట్ జీపీటీ విషయంలో కూడా పరిమితులు విధించారు. ఇదే సమయంలో గత ఏప్రిల్ లో సిబ్బంది మైక్రోసాఫ్ట్ కోపైలెట్ ఉపయోగించకుండా నిషేధించారు. ఇక.. డీప్ సీక్ చైనాది కావడంతో అమెరికా మరిన్ని జాగ్రత్తలు తీసుకుంటోంది!

# మత్స్యకన్యపై భారీ చేప దాడి...



**చైనా-నవభూమి:** మత్స్యకన్యలు ఉంటారా..? అని అడిగితే... 'సాహస వీరుడు సాగర కన్య' సినిమాలో చూడటమే.. బయట పెద్దగా పరిచయం లేదు అనేది చాలా మంది సమాధానం అని అంటారు. ఈ క్రమంలో ఓ యువతి మత్స్యకన్యగా మారి, అక్వేరియంలో ప్రదర్శన చేస్తుంది. అది చూసినవారంతా ఫుల్‌గా ఎంజాయ్ చేస్తున్నారు. ఈ సమయంలో ఆ మత్స్యకన్యపై ఓ భారీ చేప దాడికి పాల్పడింది. చైనాలోని అక్వేరియంలో ఓ మహిళ మత్స్యకన్యగా ప్రదర్శన చేస్తోంది. ఈ సమయంలో ఆమెపై ఓ పెద్ద చేప అమాంతంగా దాడి చేసింది. ఈ దాడిలో ఆమెకు గాయాలయ్యాయి. ఈ విషయం తీవ్ర సంచలనంగా మారగా.. చూస్తున్నవారు తీవ్ర భయాందోళనలు వ్యక్తం చేశారు. దీనికి సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది. వివరాల్లోకి వెళ్తే... చైనాలోని జిషువంగ్ బన్నా ప్రిమిటివ్ ఫారెస్ట్ పార్క్ లో ఓ యువ రష్యన్ మత్స్యకన్య మాషా (22) అక్వేరియంలో ప్రదర్శన ఇస్తోంది. అది చూసి అక్కడున్నవారంతా ఫుల్ ఎంజాయ్ చేస్తున్నారు. ఈ సమయంలో సడన్ ఓ పెద్ద చేప ఆమెపై దాడి చేసింది. నోటితో అమాంతం మాషా తలను కరవబోయింది. అప్రమత్తమైన ఆమె తప్పించుకుంది. బికినీ టాప్, మెర్మైడ్ టైల్ ధరించిన మాషా.. ట్యాంక్‌లో తిరుగుతూ, గ్లాస్ వెలుపల నుంచి చూస్తున్న ప్రేక్షకుల వైపు తిరిగి ఉంది. ఆమె తన పనిలో అలా బిజీగా ఉండగా.. చుట్టు ఉన్న చేపల మధ్య అద్భుతమైన వాతావరణాన్ని సృష్టించింది. ఇంతలోనే భారీ చేప కనిపించడంతో ఆ దృశ్యం ఒక్కసరిగా పీడకలలా మారిపోయింది. ఈ సమయంలో పిల్లలు, ఇతర వ్యక్తులు భయంతో కేకలు వేశారు. ఈ దాడిలో మత్స్యకన్య మాషా మెడ, ముక్కు, కంటి వద్ద గాయాలయ్యాయని చెబుతున్నారు. ఈ దాడి అనంతరం ఆమె తీవ్రమైన నొప్పితో బాధపడుతున్నప్పటికీ ప్రదర్శనను కొనసాగించిందని చెబుతున్నారు. ఈ సమయంలో ఆమెకు $100 నైతిక నష్టపరిహారం అందించబడిందని తెలుస్తోంది. ఇక దీనికి సంబంధించిన వీడియో వైరల్‌గా మారగా... 'ఆమె చాలా అదృష్టవంతురాలు, తృటిలో తప్పించుకుంది' అని ఒకరంటే... 'ఆమె ఈ దాడి తర్వాత కూడా ప్రదర్శన ఇచ్చిందని చెబుతుండటం నిజంగా గ్రేట్' అని మరొకరు స్పందించారు. ఇంకొంతమందైతే.. ఆ దృశ్యాన్ని చూసి 'డీప్ సీక్ వర్సెస్ ఓపెన్ ఏఐ' అని కామెంట్ చేయడం గమనార్హం!

## రష్మిక మందన్నా డెడికేషన్‌కు హ్యాట్సాఫ్ చెప్పాల్సిందే.. ఛావా ప్రమోషన్స్‌లో విక్కీ కౌశల్‌తో ఇలా



మరాఠీ యోధుడు ఛత్రపతి శివాజీ తనయుడు శంభాజీ మహారాజ్ జీవిత కథ ఆధారంగా తెరకెక్కిన ప్రాజెక్ట్ ఛావా బాలీవుడ్ స్టార్ యాక్టర్ విక్కీకౌశల్ టైటిల్ రోల్‌లో నటిస్తున్న ఈ చిత్రానికి లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వం వహిస్తున్నాడు. రష్మిక మందన్నా ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటించింది. రష్మిక ఇందులో మహారాణి యేసుబాయి పాత్రలో నటిస్తోంది. ఈ మూవీ ఫిబ్రవరి 14న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ మూవీ ప్రమోషన్స్‌లో భాగంగా విక్కీకౌశల్ అండ్ రష్మిక టీం రీసెంట్‌గా హైదరాబాద్‌కు వచ్చేసిందని తెలిసిందే. అయితే కాలుకి గాయంతో కొన్ని రోజులుగా బెడ్ రెస్ట్‌లో ఉందని తెలిసిందే. నడవలేని స్థితిలో విశ్రాంతి తీసుకోవాల్సిన రష్మిక మందన్నా.. అదేమీ పట్టించుకోకుండా ప్రమోషన్స్‌లో పాల్గొంటుంది. విక్కీ కౌశల్ సాయంతో వీల్ ఛైర్‌లో ఈవెంట్‌కు వచ్చిన రష్మికమందన్నాకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రష్మిక మందన్నా సంప్రదాయ పద్ధతిలో విక్కీ కౌశల్‌కు హారతి పట్టి నుదుట బొట్టు పెట్టింది. ఈ వీడియో ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. కదలలేని స్థితిలో ఉన్నప్పటికీ వీల్‌ఛైర్‌లో ప్రమోషన్స్‌లో పాల్గొంటుండటంతో రష్మికమందన్నా ప్రొఫెషనల్ కమిట్‌మెంట్‌కు, డెడికేషన్‌కు అందరూ ఫిదా అవుతున్నారు. ఈ చిత్రాన్ని మ్యాడ్‌డాక్ ఫిల్మ్స్ పతాకంపై దినేశ్ విజన్ నిర్మిస్తున్నాడు.

నవచిత్ర





## సామ్‌తో బాలీవుడ్ యాక్టర్.. ఈ విషయం తెలుసా?

స్టార్ హీరోయిన్ సమంత.. రీసెంట్ గా సిటడెల్ హనీ బన్నీ వెబ్ సిరీస్ తో ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. రాజ్ అండ్ డీకే దర్శకత్వంలో వచ్చిన ఆ సిరీస్ లో బాలీవుడ్ స్టార్ హీరో వరుణ్ ధావన్ మరో కీలక పాత్ర పోషించారు. 80-90ల కాలంలో సమాజంలో మహిళల పరిస్థితి ఏంటనేది సిరీస్ లో చక్కగా చూపించారు మేకర్స్. వరల్డ్ వైడ్ గా భారీ స్థాయిలో వ్యూస్ అందుకున్న సిటడెల్ వెబ్ సిరీస్ లో సామ్ తన నటనతో అదరగొట్టింది. ముఖ్యంగా యాక్షన్ సీక్వెన్స్ లో అందరినీ మెప్పించిందని చెప్పడంలో ఎలాంటి డౌట్ అక్కర్లేదు. దీంతో అనేక మంది ప్రశంసలు అందుకుంది. విమర్శకులు కూడా సమంత యాక్టింగ్ ను కొనియాడారు. నటవారసుల ఆరంగేట్రంపై పెద్ద ప్రకటన అదే ఇప్పుడు సామ్.. మరో యాక్షన్ థ్రిల్లర్ రక్త్ బ్రహ్మాండ్: ది బ్లడీ కింగ్ డమ్ చేస్తున్న విషయం తెలిసిందే. సిటడెల్ షూటింగ్ జరుగుతుండగానే.. సమంత రక్త్ బ్రహ్మాండ్ సిరీస్ కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు ఇప్పటికే టాక్ వచ్చింది. నెట్ ఫ్లిక్స్ ఒరిజినల్ సిరీస్ గా వస్తున్న రక్త్ బ్రహ్మాండ్ కు తుంబాద్ ఫేమ్ రాహి అనిల్ బార్వే దర్శకత్వం వహిస్తున్నారు. ఫ్యామిలీ మ్యాన్, సిటడెల్ సిరీస్‌ల డైరెక్టర్లు రాజ్ అండ్ డీకే నిర్మిస్తున్నారు. అయితే ఓ రాజవంశ కుటుంబం నేపథ్యంలో రక్త్ బ్రహ్మాండ్ సిరీస్ రూపొందుతున్నట్లు తెలుస్తోంది. రాజ్యం కోసం కుటుంబంలోని ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగే పోరాటాలతోపాటు రాజకీయ అంశాల్లో సాగనుందని.. సామ్ యువరాణి పాత్రలో కనిపిస్తుందని టాక్ వినిపిస్తోంది. ప్రముఖ బాలీవుడ్ నటుడు ఆదిత్య రాయ్ కపూర్ రక్త్ బ్రహ్మాండ్ లో సమంతతో కలిసి స్క్రీన్‌ను పంచుకోనున్నారని ఇప్పుడు తెలుస్తోంది. ఆదిత్య ఇటీవల యాక్షన్-ప్యాక్డ్ మొదటి షెడ్యూల్ ను పూర్తి చేశారని సమాచారం. తన రోల్ కోసం కత్తి యుద్ధంతోపాటు వివిధ మార్షల్ ఆర్ట్స్ లో శిక్షణ పొందారట. ఇక రక్ష్ బ్రహ్మాండ్ లో మీర్జాపూర్ ఫేమ్ అలీ ఫజల్, వామిక గబ్బి కీలక పాత్ర పోషిస్తున్నారు. బాలీవుడ్ కు చెందిన బడా స్టార్లు కూడా సిరీస్లో భాగం కానున్నారని టాక్ వినిపిస్తోంది. కాగా 2025లో సిరీస్ ను రిలీజ్ చేసేందుకు మేకర్స్ ఏర్పాట్లు చేస్తున్నారు. మరి రక్త్ బ్రహ్మాండ్ సిరీస్ ఎలాంటి రెస్పాన్స్ అందుకుంటుందో వేచి చూడాలి.


## సరదాగా ఉండే సినీజర్నలిస్టులు.. హీరో కాంప్లిమెంట్

తెలుగు ఫిలిం జర్నలిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్టార్ హాస్పిటల్ సౌజన్యంతో మల్టీ సూపర్ స్పెషాలిటీ హెల్త్ క్యాంప్ ఈరోజు ఫిలిం ఛాంబర్ లో నిర్వహించారు. తెలంగాణ ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు, ప్రముఖ హీరో విశ్వక్ సేన్ చేతుల మీదుగా క్యాంప్ ప్రారంభమైంది.. టిఎఫ్‌డిసి ఛైర్మన్, ప్రముఖ నిర్మాత దిల్ రాజు మాట్లాడుతూ-నిత్యం బిజీగా ఉండే ఫిలిం జర్నలిస్టులు ఆరోగ్యంపై అవగాహన , శ్రద్ధ అవసరం కాబట్టి ఇలాంటి క్యాంపులు వల్ల మరింత ఆరోగ్యంగా ఉండేందుకు ఉపయోగపడతాయ- ని అన్నారు. ప్రముఖ హీరో విశ్వక్ సేన్ మాట్లాడుతూ "మా అందరితో సరదాగా ఉండే జర్నలిస్టులు ఎప్పుడు అదే విధంగా ఉండాలి అంటే దానికి హెల్త్ క్యాంపులు మరింత ఉపయోగపడతాయని అన్నారు". ఈ కార్యక్రమంలో స్టార్ హాస్పిటల్ సిఓఓ భాస్కర్ రెడ్డి , తెలుగు ఫిలిం జర్నలిస్ట్ అసోసియేషన్‌తో ఒక ఏంఓయు కుదుర్చుకున్నారు. కార్యక్రమంలో తెలుగు సినీ జర్నలిస్టులు పాల్గొన్నారు.






## 'వార్ 2' క్లిప్ లీక్... అందులో ఏముంది?



హృతిక్ రోషన్ హీరోగా ఎన్టీఆర్ కీలక పాత్రలో అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో యశ్ రాజ్ ఫిల్మ్స్ బ్యానర్‌లో రూపొందుతున్న 'వార్ 2' సినిమాను ఈ ఏడాది ఆగస్టులో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. అందుకు తగ్గట్లుగా షూటింగ్ స్పీడ్‌గా చేస్తున్నారు. షూటింగ్ కార్యక్రమాలు ముగింపు దశకు చేరుకున్నాయి. ఇదే సమయంలో సినిమాలోని కొన్ని సన్నివేశాలకు వీఎఫ్ఎక్స్ వర్క్ జరుగుతుందని తెలుస్తోంది. సినిమా యాక్షన్ సన్నివేశాలకు వీఎఫ్ఎక్స్ వర్క్ జరుగుతూ ఉండగా హృతిక్ రోషన్, ఎన్టీఆర్ మధ్య జరిగే ఫైట్‌కి సంబంధించి చిన్న క్లిప్ లీక్ అయ్యింది. సోషల్ మీడియాలో ఒక్కసారిగా వైరల్ అయిన ఆ క్లిప్‌ను మేకర్స్ డిలీట్ చేయించే ప్రయత్నం చేస్తున్నారు. ఈమధ్య కాలంలో సోషల్ మీడియా ప్లాట్‌ఫాం ఎక్స్ ఇలాంటి వీడియోలను ఎక్కువ షేర్ కాకుండా వెంటనే నిరోధించగలుగుతోంది. దాంతో వార్ 2 యూనిట్ సభ్యులు ఎక్స్ టీంతో సంప్రదింపులు జరిపి వెంటనే చర్యలు తీసుకున్నారు. అయితే ఇతర ప్లాట్ ఫామ్‌లపై మాత్రం ఇంకా వార్ 2 లీక్ సీన్ షేర్ అవుతుందని తెలుస్తోంది. అక్కడ కూడా అతి త్వరలోనే ఆ క్లిప్‌ను డిలీట్ చేసే విషయమై తీవ్రమైన ప్రయత్నాలు జరుగుతున్నాయి. త్వరలోనే వార్ 2 సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఇలాంటి సమయంలో లీక్ కావడం అనేది ఏమాత్రం మంచిది కాదు. అందుకే మేకర్స్ ఈ విషయంపై చాలా స్పీడ్‌గా స్పందించారు. మరో వైపు లీక్ అయిన క్లిప్‌లో ఏం ఉంది, ఎన్టీఆర్ ఎలా ఉన్నారు అంటూ ఫ్యాన్స్‌లో చర్చ జరుగుతోంది. చూసిన వారు సోషల్ మీడియాలో ఇండైరెక్ట్‌గా కామెంట్స్ చేస్తూ ఉంటే, చూడని వారు వారి పోస్టులను చూసి ఊహించుకుంటున్నారు. మొత్తానికి ఎన్టీఆర్ ను వార్ 2లో చాలా స్పెషల్‌గా చూడబోతున్నారు అంటూ మరోసారి లీక్ అయిన క్లిప్ కూడా చెప్పకనే చెబుతోంది అంటూ అభిమానులు చాలా నమ్మకంగా చెబుతున్నారు. ఎన్టీఆర్ మొదటి బాలీవుడ్ ప్రాజెక్ట్ కావడంతో అంచనాలు ఆకాశాన్ని తాకేలా ఉన్నాయి. అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా అద్భుతమైన యాక్షన్ సన్నివేశాలతో అయాన్ ముఖర్జీ ఈ సినిమాను రూపొందిస్తున్నారు. బ్రహ్మాస్త్ర వంటి మంచి విజయాన్ని, భారీ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చిన అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా కావడంతో అంచనాలు నార్త్ ఇండియాలో భారీగా ఉన్నాయి. వార్ 2 సినిమా విడుదల సమయంలో సౌత్‌లోనూ అంచనాలు పెంచే విధంగా ప్రమోషన్స్ చేయాల్సి ఉంది. ఎన్టీఆర్, హృతిక్ రోషన్‌ల మధ్య ఫైట్ సీన్స్ ఉంటాయా లేదంటే ఇద్దరు మంచి స్నేహితులా అనే విషయాలపై ఇంకా ఎలాంటి క్లారిటీ రాలేదు. అయినా వార్ 2 సినిమాను చూడ్డానికి ఎదురు చూస్తున్న వారి సంఖ్య భారీగానే ఉంది. ఎన్టీఆర్ ఇటీవల దేవర సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. వార్ 2 సినిమా విడుదలకు ముందే ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో సినిమాను చేసేందుకు సిద్ధం అవుతున్నాడు. అతి త్వరలోనే ప్రశాంత్ నీల్, ఎన్టీఆర్ మూవీ ప్రారంభం అయ్యి 2027లో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు ఉన్నాయి.

## 'తండేల్' ప్రీ రిలీజ్ ఈవెంట్ వాయిదా.. మళ్లీ ఎప్పుడంటే.?



నటుడు అక్కినేని నాగ చైతన్య ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం తండేల్ మలయాళీ బ్యూటీ సాయి పల్లవి కథనాయికగా నటిస్తుండగా.. చందు మొండేటి దర్శకత్వం వహిస్తున్నాడు. గీతా ఆర్ట్స్ బ్యానర్‌పై అల్లు అరవింద్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ఫిబ్రవరి 07న ప్రేక్షకుల ముందుకు రానుంది. విడుదల తేదీ దగ్గర పడుతున్న సందర్భంగా నేడు ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా ఈ వేడుక రేపటికి వాయిదా వేస్తున్నట్లు చిత్రయూనిట్ ఎక్స్ వేదికగా ప్రకటించింది. "ది ఐకానిక్ తండేల్ జాతరను రేపటికి వాయిదా వేస్తున్నాం. ఈవెంట్ భారీ స్థాయిలో ఉంటుంది. ఈ పాలి యాట గురితప్పేదే లేదేస్" అంటూ పోస్ట్ పెట్టింది. ఇక ఈ వేడుకకు ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ముఖ్య అతిథిగా రాబోతున్న విషయం తెలిసిందే.






## పట్టు వదల్లే.. ఉత్కంఠ పోరులో టీమ్‌ఇండియా జయభేరి




**పుణె-నవభూమి:** సొంతగడ్డపై ఇంగ్లండ్‌తో జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను భారత్ మరో మ్యాచ్ మిగిలుండగానే 3-1తో చేజిక్కించుకుంది. రాజ్‌కోట్‌లో చేజారినా పుణెలో మాత్రం భారత్ పట్టు వదల్లేదు. శుక్రవారం పుణెలోని మహారాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ (ఎంసీఏ) వేదికగా ఆద్యంతం ఉత్కంఠగా జరిగిన పోరులో టీమ్‌ఇండియా 15 పరుగుల తేడాతో జయభేరి మోగించింది. భారత్ నిర్దేశించిన 182 పరుగుల ఛేదనలో ఇంగ్లండ్ లక్ష్యానికి చేరువగా వచ్చినప్పటికీ 19.4 ఓవర్లలో 166కే పరిమితమైంది. హ్యారీ బ్రూక్ (26 బంతుల్లో 51, 5 ఫోర్లు, 2 సిక్సర్లు), బెన్ డకెట్ (19 బంతుల్లో 39, 7 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. తన కెరీర్‌లో తొలి టీ20 ఆడిన హర్షిత్ రాణా (3/33), స్పిన్నర్ రవి బిష్ణోయ్ (3/28) అద్భుత బౌలింగ్‌తో భారత్‌ను గెలిపించారు. మొదట బ్యాటింగ్ చేసిన భారత్.. టాపార్డర్ విఫలమైనప్పటికీ హార్దిక్ పాండ్యా (30 బంతుల్లో 53, 4 ఫోర్లు, 4 సిక్సర్లు), శివమ్ దూబె (34 బంతుల్లో 53, 7 ఫోర్లు, 2 సిక్సర్లు), రింకూ సింగ్ (30) రాణించడంతో 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 181 పరుగులు చేసింది. దూబేకు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు లభించింది.

**హార్దిక్, దూబె పోరాటం**

12/3.. రెండు ఓవర్లు ముగిసేసరికి భారత్ స్కోరిది! ఈ స్థితి నుంచి భారత్ 181/9తో ముగించిందంటే అది హార్దిక్, దూబె పోరాటమే. ఈ సిరీస్‌లో తొలి మ్యాచ్ ఆడిన పేసర్ సకీబ్ మహ్మూద్.. తాను వేసిన మొదటి ఓవర్లో శాంసన్ (1), తిలక్ (0), సూర్య (0)ను పెవిలియన్‌కు చేర్చడంతో భారత్ పీకల్లోతు కష్టాల్లో పడింది. కానీ అభిషేక్ (19 బంతుల్లో 29, 4 ఫోర్లు, 1 సిక్స్) రింకూ నాలుగో వికెట్‌కు 45 పరుగులు జోడించి జట్టును ఆదుకున్నారు. రెండు ఓవర్ల వ్యవధిలో ఈ ఇద్దరూ నిష్క్రమించారు. ఈ క్రమంలో క్రీజులోకి వచ్చిన హార్దిక్, దూబె ఇంగ్లిష్ బౌలర్లపై ఎదురుదాడికి దిగారు. ఈ జోడీ ఆరో వికెట్‌కు 45 బంతుల్లోనే 87 పరుగులు జోడించడంతో భారత్ పోరాడగలిగే స్కోరును ప్రత్యర్థి ముందు నిలపగలిగింది.

## సచిన్‌కు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్



**ముంబై-నవభూమి:** భారత క్రికెట్ అభిమానుల ఆరాధ్య దైవం సచిన్ టెండూల్కర్ మరో ప్రతిష్టాత్మక పురస్కారానికి ఎంపికయ్యాడు. బీసీసీఐ అతడిని జీవితకాల సాఫల్య పురస్కారంతో సత్కరించనుంది. శనివారం ముంబైలో జరుగబోయే బీసీసీఐ వార్షికోత్సవ వేడుకలలో సచిన్‌కు ఈ అవార్డును అందజేయనున్నట్టు బోర్డు ప్రతినిధి తెలిపారు. దివంగత కెప్టెన్ కల్నల్ సీ.కే. నాయుడు పేరిట అందజేసే ఈ అవార్డును అందుకోబోతున్న 31వ క్రికెటర్ సచిన్.

నవక్రీడ

## కోహ్లీ.. ఆఫ్ స్టంప్.. అదే కథ



**ఢిల్లీ-నవభూమి:** 2012 నవంబర్ తర్వాత తొలిసారి రంజీ మ్యాచ్ ఆడుతున్న విరాట్ కోహ్లీ బ్యాటింగ్ తీరు మారలేదు. గత కొంతకాలంగా అతడిని వేధిస్తున్న ఔట్ సైడ్ ఆఫ్ స్టంప్ బలహీనతను విరాట్ మరోసారి బయటపెట్టుకున్నాడు. ఈ సమస్యను అధిగమించేందుకు సంజయ్ బంగర్ వద్ద ప్రత్యేక శిక్షణ తీసుకుని బరిలోకి దిగిన ఈ రన్ మెషిన్.. మ్యాచ్‌కు వచ్చేసరికి తేలిపోయాడు. పుష్కరకాలం తర్వాత రంజీ రీఎంట్రీ ఇచ్చిన అతడు 15 బంతులు మాత్రమే ఆడి 6 పరుగులకే నిష్క్రమించాడు. రైల్వేస్ పేసర్ హిమాన్షు సంగ్వాన్ 28వ ఓవర్లో వేసిన ఆఫ్‌స్టంప్ ఆవల బంతిని వెంటాడబోయిన కోహ్లీ క్లీన్ బౌల్డ్ అయ్యాడు. దీంతో అతడి బ్యాటింగ్ విన్యాసాలను చూద్దామని అరుణ్ జైట్లీ స్టేడియానికి పోటెత్తిన అభిమానులకు మరోసారి నిరాశే ఎదురైంది. కోహ్లీ బ్యాటింగ్ చేస్తున్న సమయంలో నిండుగా కనిపించిన స్టాండ్స్.. అతడు ఔటైన వెంటనే ఖాళీ అవడం గమనార్హం. ఇదిలా ఉంటే గూగుల్‌లో అత్యధిక మంది వెతికిన వారిలో కోహ్లీ ముందువరుసలో ఉన్నాడు. రాష్ట్ర జట్టుకు చేసిన సేవలకు గుర్తింపుగా ఢిల్లీ క్రికెట్ అసోసియేషన్ (డీడీసీఏ) కోహ్లీని శుక్రవారం ఘనంగా సన్మానించింది.


Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**